మార్చి, 16-31, 2022
సంపుటి 02, సంచిక 09

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక

## హోళీ శుభాకాంక్షలు!!





# బూర్గుల రామకృష్ణారావు

**(మార్చి 13, 1899 - సెప్టెంబర్ 14, 1967)**

బహుభాషావేత్త, స్వాతంత్ర్యోద్యమ నాయకుడు, రచయిత, న్యాయవాది. హైదరాబాదు రాష్ట్రానికి తొలి ఎన్నికైన ముఖ్యమంత్రి. రెండు రాష్ట్రాలకు గవర్నరుగా కూడా పనిచేసారు. బూర్గుల బహుభాషావేత్త, సాహితీవేత్త. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, కన్నడ, మరాఠీ, ఉర్దూ, పారశీక, సంస్కృత భాషల్లో బూర్గులకు ప్రావీణ్యం ఉంది. మహారాష్ట్రలో చదివే రోజుల్లోనే ఆంగ్లంలో కవితలు రాసేవారు. పారశీక వాఙ్మయ చరిత్ర ఆయన రచనలలో పేరు పొందినది. జగన్నాథ పండితరాయల లహరీపంచకమును, శంకరాచార్యుల సౌందర్యలహరి, కనకధారాస్తవమును తెలుగులోకి అనువదించారు. బూర్గుల 1967, సెప్టెంబర్ 14 న గుండెపోటుతో మరణించారు.

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor, Near NTR Stadium  Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

విషయ సూచిక




04 సందిగ్ధ మానవుష్ని చిత్రించిన **కాంచనపల్లి రాజేందర్ రాజు** కవిత **నువ్వు కాని నువ్వు...**



05 **పురుషుని భగ్న ప్రేమ**ను చిత్రించిన **వెంపో** నాటి కథ



41 గూడెపోళ్ళ బతుకులో స్త్రీని చర్చించిన **విజయలక్ష్మి ముచ్చలిక** కథ...




11 **తెలుగు భాషా పుష్టిలో కథల పాత్ర**ను చెబుతున్న **శర్మ** వ్యాసం



15 కుటుంబ ప్రాధాన్యాన్ని చెప్పే **దేవకి** కథ **పిడికిలి ఇసుక**



20 **స్త్రీ అస్తిత్వాన్ని వెతికే ఆమె కూడా మనిషే రాధాకృష్ణమాచార్యుల** కవిత



43 ఒక సంస్కృతిలో ఐకాన్‌గా (వ్యాసం) **శంఖం** పరిణామాన్ని చెప్పిన **చకిలం...**

ధారాపాతమైన పద్యశిల్పం తెలిపిన **నాటికవిత... శ్రీలొంకరామేశ్వరా** ... పేజీ 02

మచ్చ హరిదాసు విమర్శనా కోణాన్ని ఆవిష్కరించిన **ఎర్రోజు** వ్యాసం **సహృదయ విమర్శకులు...** పేజీ 21

ఒక దోబూచులాటలో పనివాళ్ళ మనోగతం చెప్పిన **దొండపాటి.... భూమిగుండ్రం** కథ... పేజీ 25

జీవితంలో ఉదయ కాంతిని ఆశించే **ఆంజనేయులు** కవిత **మనిషిగా...** పేజీ 32

**సాహిత్యంతో సినీ బంధాన్ని** తెలియజేసిన వ్యాసం... పేజీ 37

నేటి కథకుడు, విమర్శకుడు **వెల్దండితో శీలం** ఈ పక్షం ముఖాముఖి ముచ్చట్లు... పేజీ 33

కాలాన్ని ప్రేమకావ్యంగా చూసే **హరగోపాల్** కవిత... **తొవ్వ...** పేజీ 40

అంతటా విస్తరించిన ఆమెను చిత్రించిన **వీణావాణి** కవిత **నెలపొడుపు...** పేజీ 24

సూర్యచంద్రమణం మానవునికి ఉపమించే **రామకృష్ణారావు** కవిత **ఉదయభూపాలం** ... పేజీ 10

పువ్వు పిలుపును పసిగట్టిన **తుమ్మూరు** కవిత **రసహేల...** పేజీ 42

**కథా స్రవంతి పిన్నంశెట్టి కిషన్** కథనాన్ని చిత్రించిన **సంకేపల్లి** ... పేజీ 29


**ఇంకా...** సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

# శ్రీ లొంకరామేశ్వరా...

**నంబి శ్రీధర్ రావు**



నంబి శ్రీధర్ రావు రచించిన శ్రీలొంక రామేశ్వర శతకంలోనివి ఈ పద్యాలు. జూన్ 27వ తేదీ 1934 సంవత్సరంలో నంబి గుండె రావు, లక్ష్మీబాయమ్మలకు ఆయన నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో జన్మించారు. ఆయన "శ్రీమన్నింబాచల మాహాత్మ్యము" 1962, "శ్రీమన్నింబగిరి నరసింహ శతకము" 1968, "ప్రహ్లాద చరిత్ర"1971, "శారదా గణితము"1972, "శ్రీ లొంక రామేశ్వర శతకము"1974, "శ్రీకృష్ణ లీలలు"1976, "శ్రీ దుర్గా వరదాయిని స్తోత్రమాల"1982 మొదలైన కావ్యాలు రచించాడు. ఈ కవి సంగీతకళలోనూ ప్రావీణ్యం కలిగిన వాడు. కవిరాజుగా ప్రశస్తి పొందిన ఈ కవి ఉపాధ్యాయునిగా సేవలందించాడు. నంబి శ్రీధర్ రావు 19 సెప్టెంబర్ 2000 సంవత్సరంలో పరమపదించారు.

తనకున్ గల్గిన కొద్ది కోరుకొనినన్ దానమ్ము గావించుచున్
దనకున్ గల్గిన కొద్దితో నెపుడ దృప్త స్వాంతుడై మించుచున్
దనకున్ గల్గిన కొద్ది దేవుని ప్రసాదంబంచు లోనెంచుచున్
జినుకున్ సింధు వొనర్చు జ్ఞాని భువిలో శ్రీ లొంకరామేశ్వరా!

ఇద్ధాత్రిన్ దనజీవనమ్ము గళగా నెవ్వాడు నైపుణ్యమున్
శ్రద్ధాసక్తులు నిండ దిద్దు కొనుచున్ సంఘప్రసంగమ్ములన్
బుద్ధిస్ఫూర్తి దలిర్ప ముందు చనుచున్ బొల్పారునో వాడెపో
సిద్ధుండౌ యుగకర్త యౌ సుఖియునౌ శ్రీ లొంకరామేశ్వరా!

అధిరోహించినవారి మోసికొని యాయాసమ్ము లేకన్ మహాం
బుధులన్ నౌకలు దాటు చుండు కరణిన్ బుద్ధ్యున్నతుల్ ధర్మమున్
విధిగా నెత్తిన బెట్టుకొంచు ధృతిసంవిస్ఫూర్తి సంసారవా
రిధి లీలన్ దరియించు చుందురు గదా! శ్రీ లొంకరామేశ్వరా!

చెయి జాఱున్ ఘనభూతమై యటు నిరీక్షింపన్ మహద్భవ్యమై
నయ మంచున్ గొన వర్తమాన మగుచున్ వర్తిల్లి బ్రహ్మాండమే
యయినన్ మ్రింగెడు కాలచక్రమును మాయావిక్రమంబున్ గణిం
చియు దత్తత్త్వ మెఱుంగ సాధ్యపడునా? శ్రీ లొంకరామేశ్వరా!

సంపాదకీయం

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

16-31 మార్చి, 2022

సంపుటి 02 సంచిక 09



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# జీవించడం ఒక కళ...

మనిషి బతుకుతాడు. ప్రతి ప్రాణి బతుకుతుంది. ప్రపంచంలో అడుగుపెట్టిన ప్రతి ప్రాణికి బ్రతికే హక్కుంది. అట్లాగే మనిషికి తరతమ భేదం లేకుండా జీవించే హక్కు ఉంది. స్వేచ్ఛ ఉంది. ఇతరుల స్వేచ్ఛను హరించకుండా ఎలాంటి విఘాతం లేకుండా ప్రతి వ్యక్తికి తన స్వేచ్ఛను అనుభవించే హక్కు ఉంది. ప్రపంచ ప్రయాణంలో తాను ఒక బిందువుగా ప్రవహించడం సరే. కాని అది మాత్రమే జీవితం కాదు. జీవితానికి ఒక పరమార్థం ఒక లక్ష్యం ఉండాలనుకునే వ్యక్తి ఈ యాంత్రికతను అంగీకరించడు. ఇందులో భాగస్వామ్యాన్ని ఆకాంక్షించడు. ఉన్నతమైన వ్యక్తులను ఆదర్శంగా స్వీకరిస్తాడు. కాని వాళ్ళపట్ల అతి విధేయతను, బానిసత్వాన్ని ప్రకటించడు. చివరికి తాను ఎన్నుకున్న రంగంలో శిఖరస్థాయి వైపు అతని గురి వుంటుంది. వక్రమార్గాలు, విద్రోహాలు లేని స్థైర్యం అతడు సంతరించుకొంటాడు. జీవితం అంటే ఏదో బ్రతికేయడం అని కాకుండా ఉజ్జీవించడం అనే స్థాయిని కలిగి వుంటాడు. ఇలాంటి సోయి మనిషికి ఎట్లా వస్తుంది? వ్యక్తి నైర్మల్యం వల్ల వస్తుంది. సాహిత్య స్పృహ వల్ల వస్తుంది. పుస్తక పఠనం వల్ల వస్తుంది. వ్యక్తిగత జీవితాన్ని సామాజికతకు అనుసంధించడం వల్ల వస్తుంది.

బహుశా: ప్రగతి పథికులందరిలో సాహిత్య స్పృహ ఉండకపోవచ్చు. వివిధ రంగాలకు చెందిన నిష్ణాతులు ఆయా రంగాలలో సుప్రతిష్ఠులు కావచ్చు. కాని సాహిత్య స్పృహ వల్ల వాళ్ళకు కచ్చితంగా తమ రంగంలో మరింత నిటారుగా నిలబడే అవకాశం ఉంటుంది. మనిషిలో ఇట్లాంటి వ్యక్తిత్వానికి హేతువు అతని నిరంతర జిజ్ఞాసే. సోక్రటీస్ మరణశిక్ష అనుభవించే కొద్ది కాలానికి ముందు నిశ్చలంగా గిటార్ వాయిద్యాన్ని సాధన చేశాడట. ఆయన ప్రశ్నలు ఇప్పటికీ ప్రపంచానికి ప్రశ్నలే. ఆయన హేతు దృక్పథం ఎంతకాలమైనా ఆరాధనీయమే.

కాగా భావవాద ప్రభావంలో మునిగిపోయిన వారికి ఈ ప్రపంచం మిథ్య అనిపించవచ్చు. జీవితం క్షణభంగురం అనే నిస్పృహ కూడా ఆవరించవచ్చు. అయితే సాహిత్యం పట్ల సరైన దృక్పథం కలిగిన వ్యక్తి ఈ నిస్పృహను దరి చేరనివ్వడు. 'నిన్నలేని అందమేదో, నిదుర లేచెనెందుకో' అనే ఆశావహ దృక్పథమే అతన్ని వెంబడిస్తుంది. LIFE, believe, is not a dream. So dark as sages say; Oft a little morning rain. Foretells a pleasant day. అనే Charlotte Bronted's "Life" అనే Poem అంతులేని ఆశావహ దృక్పథం కనబడుతుంది. బతకాలనే తపన నుంచి అస్తిత్వవాదం ఎట్లా పుట్టుకొచ్చిందో మనకు తెలుసు. ఇది సాహిత్యాంతరీకరణ జరిగి సాహితీ ప్రపంచంలో ఎన్ని వాదాలకు మూలమైందో మనం చూస్తున్నాం. ప్రపంచ పరిణామంలో అధికారం కోసం సంపద కోసం చేసే యుద్ధం కన్నా బతుకు కోసం, అస్థిత్వం కోసం చేసే పోరాటాలే విలువైనవి. మానవ లేక సమాజ పరిణామాన్ని నిర్దేశించగలిగేవి.

ఏమైనా మానవ జీవితం చాలా విలువైనది. అందునా వట్టి జీవితం కాకుండా ఎవరైతే ఉజ్జీవితం గడుపుతారో వారే నాయకులుగా, కవులుగా, ఇతరేతర రంగాలలో ఉన్నత వ్యక్తులుగా పరిణామం చెందుతారు. పరిణితి సాధిస్తారు. 'బలుసాకు తినైనా బతుకుతాను' అనే సామెతలకు బదులుగా 'బతికి సాధిస్తాను' అనే స్ఫూర్తిని ప్రకటిస్తాడు.

పఠన స్ఫూర్తితో నిరంతరం సజీవంగా ప్రవహించే మనిషే జీవితం విలువ తెలుసుకోగలుగుతాడు. ప్రతి క్షణం అడుగు ముందుకు వేయగల్గుతాడు.

జై తెలంగాణ, జై జాగృతి.

కవిత కల్వకుంట్ల

కవిత

# నువ్వు కాని నువ్వు...



కాంచనపల్లి రాజేంద్ర రాజు, 9849 22 6423

అవును
నువ్వు కాని నువ్వును
తరతరాలుగా...
యుగయుగాలుగా...
జన్మజన్మలుగా మోస్తున్నావు

అంతా తెలుసనుకుంటావు కానీ...,
నువ్వు ఎవరో నీకే తెలియదు
నీకేం కావాలో అంతకన్నా తెలియదు

తీయదనాన్ని ఆస్వాదిస్తూనే
చేదుని ఆహ్వానిస్తావు
సంతోషాన్ని అనుభవిస్తూనే
సంతాపాన్ని ఊహిస్తావు

నివురుగప్పిన నిజాన్ని కోరుకుంటూనే
నిలకడలేని అబద్ధాన్ని ఆశిస్తావు

ఎవరినో చూసి
అలా ఉండాలనుకుంటావు ఏదో చూసి
ఇలా జరగాలని జరగాలనుకుంటావు

నిన్ను నువ్వుగా
ఎప్పుడూ అనుమతించవు
నీకు నువ్వుగా
ఎప్పుడూ.. ఎప్పుడూ ఆమోదించవు

జీవితం కాని బతుకులో అతుక్కుపోతావు
నువ్వు గాని నువ్వులో ఇరుక్కుపోతావు

బాధలు కష్టాలుగా..
కష్టాలు కన్నీళ్లుగా...
కన్నీళ్లు కాష్టాలుగా...
మార్చుకునే క్రమాన్ని
ఎన్నటికీ... ఎప్పటికి గుర్తించవు

ఉడుకుతున్న అన్నంపై ఆవిరిలా బుసలు కొడతావు
అలా.. అలా గాలిలో కలిసి
ఆఖరికి అదృశ్యం అవుతావు

మిగుల్చు కునేదేది లేదని తెలియక
అనుక్షణం నీకు నువ్వుగా
నిన్ను నువ్వు రగుల్చుకుంటూనే... ఉంటావు

పరిపక్వత వల్ల ఆధ్యాత్మికతనో...
ఆధ్యాత్మికత వల్ల పరిపక్వతనో...
ఖచ్చితంగా పొందుతావు

అప్పుడు
అదిగదిగో అప్పుడు...
ఏదో చెప్పాలనుకుంటావు
వినేవారు ఉండరు

ఏదో చేయాలి అనుకుంటావు
పట్టించుకునేవారు ఉండరు

చాపలా
నిన్ను నువ్వు చుట్టేసుకునే క్రమంలో
నీ ప్రతిచర్య
చాదస్తంగా ప్రకటించబడుతుంది

ఎంతో గుర్తింపు పొందిందనుకున్న
నీ జీవితం

నీ, అనుకున్న వాళ్ల నిర్లక్ష్యానికి
నిస్తేజమై పోతుంది

ఎంతో గౌరవించబడిన నీ గతం
దయనీయమై....
అప్రస్తుతంగా మారుతుంది

నువ్వు అనుకుంటావు
రాసిందో... చూసిందో.. చదివిందో..
సాధించిందో.. సంపాదించిందో...

ఏదో.. ఏదో ఒకటి
రేపటి తరానికి ఇవ్వాలని.
ఇస్తావు కూడా ఎంతో కొంత..

పుచ్చుకునే వాడికి తెలియదు అది నీదని
తెలిసినా.... ఏ గౌరవమూ..ప్రేమా
నీపై కురవదు

ప్రవాహంలో పడి కొట్టుకుపోయే
నీటి బిందువులకేం తెలుసు....?

మేఘాల రాపిడి
మెరుపుల సంఘర్షణ

సముద్రంలో కలిసిన
నీటి చుక్కలు ఆవిరై
తిరిగి ఆకాశం చేరి
ఆపై చినుకై.. ప్రవాహమై..
ఉరుకుల పరుగులతో ఆగకుండా....
మళ్లీ ఆవిరై ఆకాశం చేరేవరకు

అలా అలా
కొట్టుకుపోతూనే ఉంటుంది
అచ్చంగా నీ జీవితంలా...
ఖచ్చితంగా నీ జన్మలా...

నాటి కథ

# లోతు తెలియని ప్రేమ

స్త్రీ హృదయం పసిగట్టలేని పురుషుని కథ...

వెంపో

లో లోపల పెండ్లిని గూర్చి తియ్యని కలలు కంటూనే స్నేహితులె వరయినా ఆ విషయాన్ని గూర్చి ప్రస్తావన తెస్తే జితేంద్రియుడులా మాట్లాడే లక్షణాలు మురహరి కూడా వున్నాయి.

అసలు పెండ్లిచేసుకోవటం, పిల్లల్ని కనటం అనే కార్యక్రమాలు చాలా తక్కువ రకంగాళ్లు మాత్రమే చేస్తారని మురహరి తరహా మనుష్యుల వుద్దేశం. అయితే ఈ తరహా మనుష్యులు యీ కార్యక్రమాలకి పూర్తిగా యెల్లప్పటికీ దూరంగా వుంటారా. అంటే అదీలేదు. అందరికంటే ముందు గాను, తొందరగాను తమ పనులు ముగించేసుకుపోతుంటారు.

అయితే వీళ్ళిట్లా తయారుకావడాని క్కారణాలు లేకపోలేదు. తామేదో ఒకటి జీవితంలో సాధించితీరాలనే పట్టుదల వీళ్ళమనస్సుల్లో వుంటుంది. ఆ ప్రయత్నంలో వివాహం ఒక తీవ్రమైన ప్రతిబంధకంగా తయారౌతుందని భయపడి వివాహాల పైన యిటువంటి అభిప్రాయలు వెలిబుచ్చుకుంటారు.

మనిషి పెద్ద డాబుసరిగా లేకపోయినా యెవరూ వేలెత్తి చూపేటంత అంద విహీనంగా మాత్రం లేదు. నల్లగానే కనపడినా యెల్లప్పుడూ తెల్లనిదుస్తులే వాడి ఆ లోపం పైకి వుబకనీయడు. వాళ్ళ వంశం తీరే అదికాబోలు. ముక్కులు మహచెడ్డలావు. అయితే సులోచనాలు వాడటం వల్ల యీ లోపంకూడా అందరూ గుర్తించలేకపోవచ్చు. యిక అద్దాల చాటు నుండే కళ్లు యెలా వుంటే మాత్రం యెవరిక్కావాలి; కనిపించటంలో మాత్రం యెవరికీ యెట్టి అనుమానాలులేవు. యేమి నూనె వాడతాడోగాని తలెప్పుడూ నున్నగా వుంటుంది.

చదువుకి, కొలువుకి యెటువంటి అంతరాయం కలగకుండా మురహరి బాగానే నెట్టుకొస్తున్నాడు. దీక్ష ప్రశంసనీయమైనట్టిదైనా అందం లోపమైనా మనోవికారాలకి యివన్నీ అడ్డుకానేరవు గదా! అందులో ఆధునిక యుగంలో నివసిస్తున్న వ్యక్తి రాగరహితుడుగా మనగలగటం తేలికైన పనికాదు. పుస్తకం విప్పినా, చలన చిత్రం చూచినా, ఎదుటి వానితో సంభాషించినా, ఆఖరికి తనతో పాటు పనిచేసే గుమాస్తాలను చూచినా స్త్రీ ప్రమేయంలేని చోటంటూ లేకుండా పోయినప్పుడు, స్త్రీలను గురించి ఆలోచించకుండా వుండటం మురహరికే గాదు- యెవరికీ సాధ్యంకాదు. అయినా మురహరి వివాహ ప్రయత్నానికి పైకి విముఖత్వం చూపటం యిప్పటికీ మానుకోలా.

ఆఫీసులో తనతోపాటే గుమాస్తా పని చేస్తున్న అనసూయ యెవరితోనూ యెప్పుడూ అతిగా మాట్లాడి యెరుగదు. ఆమెకు పురుషులతోపాటు కలిసి పనిచెయ్యటమెలాగో తెలుసు. యే అభిప్రాయంతో యేది యెట్లా మాట్లాడినా, చూచినా, నవ్వినా మగాళ్ళెట్లా తమ కన్వయించుకుంటారో అనసూయ బాగా యెరుగును. అందుకే ఆమెను ఆఫీసులో యే ఒక్కరూ కాలక్షేపానికి వినియోగించు కోరు. అందరూ ఆమెను గౌరవంగా చూచి సాక్షాత్తూ పురాణాలలో అనసూయయనే అనుకుంటారు.

మురహరి పక్కనే అనసూయ సీటుకూడా. మురహరామెను కన్నెత్తి పూర్తిగా చూచిన పాపాన కూడా పోలేదు. ఎప్పుడూ దస్తరాలలో తలదూర్చి తన పనేదో తాను చూసుకుంటూ పోతాడు. యెప్పుడైనా యేదైనా ఫైలు విషయం అడగవలసి వచ్చినా, చెప్పవలసి వచ్చినా అతని వైఖరిలో యెటువంటి మార్పురాదు. ఈ వైఖరి అనసూయకు మురహరి యెటువంటి ప్రమాదకారి కాదని నిర్ణయించుకోటానికి యెక్కువ రోజులు పట్టలా.

అనసూయకు యితరులతో మాట్లాడకుండా వుండే అలవాటు కేవలం ప్రమాదాల నుండి సంరక్షించుకోవాలనే తప్ప ఆమెకు కులాసాగా మాట్లాడట మంటే గిట్టక కాదు. మురహరి ప్రమాదకారి కాదని నిర్ణయించుకొన్న అనసూయ అతనితో ఆఫీసరు లేనివేళల్లో వుద్యోగ ధర్మంగా రెండు ముక్కలు

నాటి కథ

మాట్లాడటం తప్పుకాదని భావించుకొంది. అకారణంగా యీ మధ్య మురహరిని మామూలు ధోరణిలో ఒక ముక్క యెక్కువగా అనసూయ పలకరించి సమాధానం పొందుతుంది. ఇదే సందర్భంలో మురహరి కూడా కాస్త తలెత్తి ఆమెను పూర్తిగా చూచి తన సమాధా నమేదో తెలియజెప్పవలసిన పరిస్థితి కూడా యేర్పడింది. ఈ పరిస్థితులు ఆఫీసులో అనసూయ ప్రవర్తనలో మార్పు వచ్చిందని యితరులు తలపోసుకు నేటంత యెక్కువేమీ గాదు.

నిత్యం ఆఫీసు యెప్పుడు విడిచి పెడతారా, బయట పడదామనే మురహరి మనస్తత్వంలో ఈ మధ్య అతనికే తెలియని ఒకమార్పు పరిమితి చెందింది. తనగదిలో వున్నంతసేపు యెప్పుడు ఆఫీసుటైం అవుతుందా, వెళ్ళి కూర్చుందామనే తొందర మురహరికి రోజు రోజుకి యెక్కువవుతూ వచ్చింది. అలాగే అతనికి సాయంకాలం ఆఫీసు విడిచిపెట్టి ఆ పాడుగదిలోనికి వచ్చి పడాలంటే బాధగా మారింది. ఇదివర కెప్పుడూ తన గది చేరగానే తాను కట్టిన పరీక్ష పుస్తకాలు విప్పి శ్రద్ధగా చదివే మురహరి యిప్పుడు పుస్తకం విప్పి రెండు లైనులైనా గట్టిగా చదవలేకపోతున్నాడు.

యౌవనం కదలబారిన మురహరి మెదడులో యేదో తెలియని తియ్యని రసధునులు జాలువారసాగినై. అతని కళ్ళు శూన్యంలో సుందర స్త్రీ మూర్తిని వెతుకుతున్నాయ్. ఆమె యెవరోకాదు! రోజూ తాను సంభాషించే అనసూయే! అందుకే అతడు ఆఫీసులో అనసూయ ప్రక్క కూర్చోటంలో అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవించకలుగుతున్నాడు. అతని కానందం కల్గించటంలో అనసూయ పాత్ర యేమీ లేకపోవచ్చు. అయినా మురహరి మనస్సు ఆమెపై లగ్నమై అనసూయను చూడని క్షణాలు భరించరానివిగా తోచినయ్. తానిప్పుడెట్టి పరిస్థితిలో వున్నాడో కూడా ఆలోచించలేని బలహీనతలో మురహరి చిక్కుకున్నాడు. స్త్రీ శరీరం అతనికిప్పుడు మధురమైన వూహల్ని కల్గిస్తూ ఆ దృశ్యాన్ని తానొంటరిగా వున్నప్పుడు కూడా చూడగల్గుతున్నాడు.

తానిదివరకెన్నో సినిమాలు చూచాడు. పుస్తకాలు చదివాడు. కాని యిదివరకె ప్పుడూ యువతీయువకు లిర్వురు ప్రేమించి పెండ్లి చేసుకున్నారన్న సంఘటనలకి ప్రత్యేకత యిచ్చేవాడు కాదు. అవే సంఘటనలిప్పుడు మురహరికి ప్రియతమమైనాయి. ఆ సంఘటనలలోని నాయకి అనసూయగా తాను నాయకు డుగా పోల్చుకొని సుఖాంతంగా కథ ముగియడానికి యెదురు చూస్తున్నాడు.

అనసూయ తనతో మాట్లాడిన ప్రతి ఒక్క మాట, ప్రతి ఒక్క చూపు, చివరికి ఆమె పెదవులపై చిందులు తొక్కే నవ్వూ, కథానాయకి, కథానాయకునిపై చూపే అవ్యక్తమైన ప్రేమ చిహ్నాలుగా మురహరి అన్వయించుకోసాగాడు.

సినిమాలలో, కథలలో కూడా యిట్లాగేకదా కథ ప్రారంభమయ్యేది. ఏ బట్టల కొట్టులోనో యిద్దరు యువతీ యువకులు బట్టలు ఖరీదు చెయ్యటానికి వెళ్ళితే వాళ్ళిద్దరి చూపులు కలిసి అది 'ప్రేమ'గా పెంపొందుతుంది. లేక సైకిలు చక్రానికి తగిలిన యువతి కళ్ళు సైకిలుపై నున్న యువకునితో కలవ్వొచ్చు. అదీ కాకపోతే ప్రమాదంలో చిక్కిన యువతిని వీరోచితంగా సంరక్షించిన యువకుడు ఆకర్షించబడవచ్చు. యిలాగే యెన్నో రీతులు ప్రేమ జనించటానికి కారణభూతమైనపుడు తన పక్కనే ఆఫీసు గుమాస్తాగా పనిచేస్తున్న యువతి తన్నాకర్షింపలేక పోవటమేమిటి? తప్పక ఆకర్షించి అనసూయ తనదిగా ఒకనాటికి కాగలుగుతుందని మురహరి నిశ్చయించుకొన్నాడు.

"యేవండీ అంత తొందరగా ఆఫీసుకి వచ్చి చేరుకుంటారా?"

"అబ్బే! యేముందీ, గదిలో యేమీ తోచుబడిగాక."

"యేదో పరీక్షకు కూడా కట్టారు కాబోలు!"



**అతని** కళ్ళు శూన్యంలో సుందర స్త్రీ మూర్తిని వెతుకుతున్నాయ్. ఆమె యెవరోకాదు! రోజూ తాను సంభాషించే అనసూయే! అందుకే అతడు ఆఫీసులో అనసూయ ప్రక్క కూర్చోటంలో అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవించకలుగుతున్నాడు. అతని కానందం కల్గించటంలో అనసూయ పాత్ర యేమీ లేకపోవచ్చు. అయినా మురహరి మనస్సు ఆమెపై లగ్నమై అనసూయను చూడని క్షణాలు భరించరానివిగా తోచినయ్.

మురహరి చిక్కులో బడ్డాడు. తన వాలకం అనసూయ కనిపెట్టి వేసిందో యేమోననే భయం, ఆమాత్రం తెలుసుకోగలిగితే అదీ ఒకందుకు మంచిదేననే సంతృప్తి అతనికి కలిగింది.

"యేమి పరీక్షలో జీవితం పొడుగునా ఒకటే చదువా? కాసేపైనా ఆనందం వుండక్కర్లా!"

"ఆఫీసుపని మీకంత ఆనందాన్ని కలిగిస్తుందా?" ఆశ్చర్యంగా అనసూయ ప్రశ్నించింది.

నెమ్మది నెమ్మదిగా తన మనోభావాలను అనసూయకు నివేదించటానికి యిదే అదననుకొని "ఆఫీసుపని యెంత కష్టమైనా మీయందరితో కలిసి మాట్లాడుకుంటుంటే యెంతో ఆనందంగా వుంటుంది" అని బదులు చెప్పిన మురహరి తన భావాన్ని సగానికి పైగా ఆమెకు అర్థమైయేట్టు చెప్పగలిగాననుకున్నాడు.

'అలాగా!' అని కిలకిలా నవ్వి అనసూయ తన పనిలో మునిగిపోయింది.

ఆ నవ్వు మురహరి నెత్తిన తేనెలు వర్షించింది. ఆఫీసు కాగితాలు తిరగవేస్తున్నాడన్నమాటేగాని అతని మనస్సు అనసూయ నవ్వును వ్యాఖ్యానించుకోవటంలోనే ఆనాడంతా మునిగివుంది. తనపై ఆమెకు అనురాగం లేకపోతే యివాళ ప్రొద్దున ఆ విధంగా యెందుకు మాట్లాడించి వుంటుంది. ఒకవేళ కులాసాగా మాట్లాడించినా తను 'మీతో మాట్లాడుతుంటే యెంతో ఆనందంగా వుంటుంద'ని చెప్పినపుడు ఆమె ఆ మాటను హృదయపూర్వకంగా స్వీకరించి 'అలాగా' అని యెందుకు కిలకిలా నవ్వింది? ఆమె తన హృదయాన్ని గ్రహించే వుంటుంది. అబ్బ! ఆ నవ్వు కేవలం ఒక్కనవ్వు మాత్రమే తనకెంత మధురానుభూతిని కలిగించింది.

పిచ్చిపిచ్చి దీక్షలుమాని స్త్రీ హృదయ సౌందర్యాన్ని ఆరాధించాలనే పట్టుదల మురహరిలో హెచ్చింది. యెన్నాళ్ళనుంచో పేరుకొనివున్న కోర్కెలు అతన్ని అనసూయకు అతి సన్నిహితంగా యీడ్చుకొని వస్తున్నాయి. ఇవాళ ప్రొద్దున జరిగిన సంఘటనతో యిక అనసూయకు తనకు మధ్య యెంతో దూరం లేదనుకున్నాడు.

గదిలో ప్రవేశించిన మురహరి స్వర్గలోకానికి బదిలీయైనట్టు ఆనంద పారవశ్యుడైపోతున్నాడు. గదిలో వస్తువులన్నీ యిప్పుడు తన హోదాకు తగినట్టివిగా తోచటంలేదు. చాప - దానిపై పరుపుచుట్ట- అది యెన్నో యేండ్ల నాటిది. దానిపై మాసిన దుప్పటి, చదువుకొనే పిల్లవాడిగా యెక్కడపడితే అక్కడ పుస్తకాలు, నోట్సులు, కూజా, దానిపై చిలుము పట్టిన గ్లాసు- ఈ వస్తువులన్నీ అతనికి అసహ్యం వేసినయ్.

**తనపై ఆమెకు అనురాగం లేకపోతే యివాళ ప్రొద్దున ఆ విధంగా యెందుకు మాట్లాడించి వుంటుంది. ఒకవేళ కులాసాగా మాట్లాడించినా తను 'మీతో మాట్లాడుతుంటే యెంతో ఆనందంగా వుంటుంద'ని చెప్పినపుడు ఆమె ఆ మాటను హృదయపూర్వకంగా స్వీకరించి 'అలాగా' అని యెందుకు కిలకిలా నవ్వింది? ఆమె తన హృదయాన్ని గ్రహించే వుంటుంది.**

ఏ క్షణంలోనే ఈ వస్తువులన్నీ అతడు విడిచిపెట్టేవే ననుకున్నాడు.

ఆ వెంటనే మురహరికి ఆవస్తువులన్నీ మమ్మువిడిచి పెట్టిపోతారా? అని యేడ్పు మొగంతో అర్థించి నట్లగుపించాయి. విజయగర్వంతో మురహరి అద్దం తీసి తనముఖాన్ని చూచుకున్నాడు. అనసూయను తన కళ్ళముందు కట్టేసి ఆ మనోహర విగ్రహాన్ని ఆరాధిస్తున్న మురహరికి ఒక్కసారిగా తన ముఖం ఆ అద్దంలో కన్పించేసరికి అతనికి అసహ్యం వేసింది. తానింత అందవిహీనంగా వున్నానని అతనిదివరకెప్పుడూ అనుకొని యుండలేదు. అసలిదివరకెప్పుడూ తనను యితరులతో పోల్చుకొని వుండలేక తన అందవిహీనతను తెలుసుకొని వుండలేక పోవడం సహజమే! తానిప్పుడు మెరుపు తీగవంటి ఒక స్త్రీ సాన్నిహిత్యాన్ని ఆపేక్షిస్తున్నాడు. గనుక తనకున్న లోటులేవో అతి తేలికగా బయట పడసాగాయి.

కళ్ళజోడు తీసి తనను పరిశీలించిన కొద్దీ మురహరి వదనం మరింత విషాదఛాయలు కమ్ముకొని మాడు చెక్కలా అగుపించసాగింది. ఇక తనను తాను చూచుకోలేని అసహనంతో మురహరి గుండె దడ హెచ్చింది. అద్దం ఒకపక్క పారేసి చిరకాలంగా తనకు ఆశ్రయమిచ్చిన ఆ పరుపుపైనే మురహరి మేను వాల్చాడు. క్షణకాలం క్రిందట తాను వూహించుకొన్న అశాసౌధాలన్నీ ఆటంబాంబులతో విధ్వంసమై పోతున్నట్టు చూడగల్గుతున్నాడు.

"అందవికారంగా వున్న నన్ను అనసూయ యెలా ప్రేమిస్తుంది? ప్రేమించి వుండకపోతే ఆమె నాతో యెందుకు అంత చొరవగా మాట్లాడి వుంటుంది. ఆమె సంభాషణలు కేవలం స్నేహం మాత్రంగానే యెందుకు కాకూడదు. ఇదే నిజమైతే అనసూయకు నాముఖ మెట్లా చూపించేది?" అనే భావ సంఘర్షణతో మురహరి ఉక్కిరిబిక్కిరి కాసాగాడు.

"భౌతిక సౌందర్యమే ప్రేమకు ఆధారభూతమా? కాదు. అనసూయ చాలా తెలివి గలది. ఆమె నాలోని హృదయ సౌందర్యాన్ని ఆరాధిస్తోంది. ఇది సత్యం" అనే ప్రేమశాస్త్రంలోని సూత్రాలు మురహరి భావప్రపంచంలోనికి దిగుమ తయ్యేసరికి కొంత తేరుకోసాగాడు. అయితే తాను కూడా అనసూయ భౌతికరూపాన్ని విడిచి మానసిక విశిష్టతనే ఆరాధించాలనే నిశ్చయానికి వచ్చాడు. మానసికలోతుల్ని వెదకగల ధైర్య సాహసాలు తనకెంత వరకు వున్నాయనే ప్రశ్న అతనికప్పుడు కలగలేదు.

యౌవనపు తొలిదశలో హృదయ సౌందర్యాన్ని పరిశోధించగల నిగ్రహం మురహరికే గాదు, ఏ ఒక్కనికి వుండదని

చెప్పాలి. మురహరికి ఆ నిగ్రహం లేదు.

హృదయసౌందర్యమే ప్రాతిపదికగా కల్గిన తన పవిత్రప్రేమ పత్రాన్ని అనసూయకు దఖలు పరచట మెట్లాగో మురహరి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ప్రేమలేఖ నమూనా కొరకై నవలలు, సినిమాలు సాధ్యమైనన్ని గుర్తుకు తెచ్చుకుంటున్నాడు. తొందరపడి తానే బయటికి పొక్కేదాని కంటే కొంత సహనం చూపిస్తే అనసూయే బయటపడగలదని ఒక్కొక్కసారి మురహరి అనుకొనేవాడు. అయితే తనకున్న అనుభవాన్ని బట్టి స్త్రీ అంత తొందరగా బయటపడదని ఆలస్యం చేస్తే పరిస్థితులు విషమించినా విషమించవచ్చునని గుర్తురావటంతోటే మురహరి కలం, కాగితం తీసి తన హృదయావేదనని స్పష్టంగా చిత్రించాలని ప్రారంభించాడు.

"సార్" బయటనుంచి పిలుపు.

విసుగుతో మురహరి తలుపు తెరిచాడు. తపాలావాడు కొన్ని పుత్తరాలు అతని చేతిలో పెట్టి తన దారిన తాను పొయ్యాడు.

తలుపు బిగించి వచ్చిన పుత్తరాలు చూడటం కంటే ముందు తన లేఖను పూర్తిచెయ్యాలని మురహరి ప్రయత్నం చేసి చూశాడు. కోర్కెలు తన అధీనంలో లేక చివరికి వచ్చిన పుత్తరాలనే చూడక తప్పింది కాదు. కార్డుల్ని పైపై చూచి కవరు చించాడు. లేఖ చివరి పంక్తులపై కళ్ళను దించాడు.

"నీవు కూడా నీ మొండిపట్టుదలను విడిచి ఒక యింటి వాడవుగా కావాలని కోరుతున్నా" అని స్నేహితుడు కామేశం సంతకాన్ని గుర్తించాడు.

మురహరి పెదవులపై లాస్యం తొణికింది. తనూ అదే ప్రయత్నంలో వున్నసంగతి కామేశానికేమి తెలుసు! ముందు తన లేఖ వ్రాయటం పూర్తిచేసి తరువాత కామేశాని కూడా ఈ శుభవార్త తెలియజేయాలనుకుని కలం తీశాడు.

"నీవుకూడా" అన్నాడు. తను పెండ్లి చేసుకుంటున్నాడా యేమిటని మురహరి మళ్ళా కామేశం వ్రాసిన ఉత్తరం విప్పి చదవటం ప్రారంభించాడు.

"నీవు పనిచేస్తున్న ఆఫీసులోనే...."

మురహరి కళ్ళు బయర్లు కమ్మాయి. తరువాత అక్షరాలు స్పష్టంగా కన్పించ టంలా, చేతులు వణకుతున్నాయి.

".... పనిచేస్తున్న అనసూయ అనే అమ్మాయితో సంబంధం నిశ్చయమైంది..."

మురహరి కల అగ్నిపర్వతంలా పగిలినట్లయింది. లావాద్రవంలా మెదడు సలసల బయటికి పొర్లుకొని వచ్చినట్ల యింది. తన యజమానిని నొప్పించిన పుత్తరాన్ని చేతులు ముక్కలు ముక్కలుగా చించిపారేసినయ్. యజమానిని పరువు తన గుండెల్లో పొదుపుకొంది.

ఆలోచనలు స్తంభించిన మురహరి అలా యెంతసేపు నిశ్చేష్టుడైపోయాడో అతనికి తెలియదు. తేరుకొని కళ్ళు విప్పేసరికి గదిలో తన సామానులన్ని జాలిగా వోదార్చినట్లు కనిపించినయ్. జీవితంలో తొలిసారిగా ప్రేమ ప్రయత్నంలో గట్టి దెబ్బతిన్న మురహరికి 'ప్రేమ' అంత బూటకమైన వస్తువు మరొకటి లేదనిపించింది. కామేశం పుత్తరం ఒక్కరోజు ఆలస్యంగా చేరివున్నట్లయితే తానెంత పరాభవానికి లోను కావాల్సివచ్చేదో వూహించుకొని భయభ్రాంతుడైనాడు.

> **ప్రేమలేఖ నమూనా కొరకై నవలలు, సినిమాలు సాధ్యమైనన్ని గుర్తుకు తెచ్చుకుంటున్నాడు. తొందరపడి తానే బయటికి పొక్కేదాని కంటే కొంత సహనం చూపిస్తే అనసూయే బయటపడగలదని ఒక్కొక్కసారి మురహరి అనుకొనేవాడు. అయితే తనకున్న అనుభవాన్ని బట్టి స్త్రీ అంత తొందరగా బయటపడదని ఆలస్యం చేస్తే పరిస్థితులు విషమించినా విషమించవచ్చునని గుర్తురావటంతోటే మురహరి కలం, కాగితం తీసి తన హృదయావేదనని స్పష్టంగా చిత్రించాలని ప్రారంభించాడు.**

తనతో గుమాస్తా పనిచేసుకొనే అనసూయే తన ప్రక్కన కూర్చున్నదని అర్థం చేసుకొనటానికి కామేశం పుత్తరం మురహరికి బాగా పనికొచ్చింది. రాగరహి తుడుగా అనసూయతో ప్రవర్తించటానికి మొట్టమొదట మురహరికి కష్టమైనా మొత్తంమీద విజయుడయినాడు.

తనపక్కన కూర్చున్న అనసూయ ముఖపరిచయమన్నా లేని కామేశానికి ప్రియురాలుగా అయిపోవటం, ప్రేమతత్వంలోని యే సూత్రాన్నాధారించు కొనని మురహరి ఆలోచించుకోసాగాడు. చివరకతడు ప్రేమించుకున్నారనటంలో అర్థం లేదనే నిశ్చయానికి వచ్చాడు. ప్రేమ ప్రాతిపదికగా నడిచే సినిమాలు, నవలలు, కథలు వొట్టి కల్పితగాథలుగా చిత్రించినవ నుకున్నాడు. అయినా ఒకసారి రేగిన అతనిలోని స్త్రీ దాహాన్ని అణుచుకోలేక పోయాడు. అందుకని తల్లిదండ్రుల్నే పెళ్ళి చెయ్యమని అడిగితే పోతుందిగా! కాని యిప్పటిదాకా పెళ్ళివద్దని మొరాయిం చుకు కూర్చున్న తను యే ముఖం పెట్టుకొని యిప్పుడు పెళ్ళిచెయ్యమని అడుగగలడు? అభిమానం దెబ్బతినదూ? అందుకని ఆ ప్రయత్నం మానుకున్నాడు.

పోనీ తననే యెవరైనా కన్య వలచి వస్తుందేమో చూద్దామని వేచివున్నాడు మురహరిప్పుడు. తనవైపు నుంచి జరిగిన ప్రయత్నం విఫలమైనప్పుడు మిగిలిన మార్గం యిదొక్కటేగా మరి.

యథాప్రకారం మురహరి కిప్పుడు ఆఫీసు పని బరువుగా తోచింది. ఆఫీసులో తనకుర్చీ ముళ్ళకంచెలాగా బాధించడం ప్రారంభించింది. తన పనేదో తను యథాశక్తి పూర్తిచేసుకొని యేరోజుకారోజు బయటపడుతున్నాడు. గట్లు తెంచుకొన్న యౌవనోన్మాదానికి అడ్డుకట్టలు వేయలేక మురహరి సతమతమౌతున్నాడు. బి.ఏ. వరకు చదవాలనే అతని దీక్ష సంగతి కూడా గుర్తులేదిప్పుడు. ఆఫీసు విడిచి

నాటి కథ



**మురహరి ఆప్యాయంతో ఆమె ముఖంలోకి చూస్తున్నాడు. మృత్యువు నుండి రక్షించిన అతనిపై ఆ అమ్మాయి తప్పకుండా కృతజ్ఞురాలౌతుం దనుకున్నాడు. ఇంతకంటే పురుషుడు ఆకర్షింపబడటానికి మంచి సమయం మరొకటి దొరకదనుకున్నాడు. ఆ సమయంలో అతని మనస్సులో యువతి యువకులు ప్రేమించుకొన్న ఘట్టాలన్నీ ఒక్కసారి స్ఫురణకు వచ్చాయి.**

పెట్టడమే తడవుగా పట్టణం వెలుపల అప్పుడప్పుడే నిర్మాణమైన ఆనకట్ట వద్దకు ఒంటరిగా పోయి కూర్చోవటం అలవాటు చేసుకొన్నాడు.

నది కిరువైపులా ఎత్తయిన కొండలు, కొండకోనలు రెండూ కలిపి విశృంఖలంగా ప్రవహించే నదికి మానవుడు అడ్డుకట్ట వేశాడు. అంతటితో ఆ నది అందుబాటు లోనికి వచ్చి బీటలువారిన భూములపై తన అమృతధారల్ని ప్రవహింపచేస్తూంది. ఈ దృశ్యం మురహరికి మానవుని విజయానికి చిహ్నంగా ఎదురుగా నిల్చివుంది. 'వ్యక్తిగత విషయాలలో కూడా మానవుడు కొంత సంయమనాన్ని ప్రదర్శించగలిగితే మానవత్వం కూడా యింకెన్ని నాగరిక శిఖరాలను అందు కొనగలిగేది! యెవరో మహాపురుషుడు తప్ప ఈ రకంగా యేవొక్కరూ ప్రవర్తించటం లేదుకదా! ప్రతి ఒక్కరూ వ్యక్తిగత విషయం వచ్చేసరికి కట్లు తెంచుకొని విహరించదలుస్తారు. బహుశా యిది నదీజలాలను అవరోధించటమంత తేలికైన పని కాదుగాబోలు?'

ఈవిధంగా ఆలోచించుకుపోతున్న మురహరికి ఒక్కసారిగా తాను నిగ్రహాన్ని కోల్పోవటం గుర్తుకొచ్చి చలించిపోయాడు. పరవళ్ళు తొక్కుకుంటూ నాలుకలు చించివచ్చే ఆ ప్రవాహానికి ఎదురుగా గంభీరముద్ర దాల్చివున్న సిమెంటు కట్టడాన్ని మురహరి దృష్టి మరల్చి చూచాడు.

పెద్ద గుంపొకటి ఆ కట్టపై మూగి వుండటం మురహరి కంట బడింది. నాలుగు వైపుల నుంచి జనం ఆ విచిత్ర మేమిటో చూద్దామని పరుగులు తీస్తున్నారు. మురహరి కూడా ఆ వైపుకే ఆకాంక్షతో బయలుదేరాడు. సమీపించిన కొద్దీ ఒక స్త్రీ కంఠం గుండెలు పగిలిపోయేట్టు విలపించటం మురహరి చెవునబడింది. నడక వేగాన్ని యింకా పెంచాడు.

అక్కడకుచేరి చూచేసరికి నదిలో ఒక స్త్రీ మునుగుతూ తేలుతూ వుండటం మురహరి గమనించాడు. నది ఒడ్డున ఒక ముసలామె ఆ మునిగిపోతున్న స్త్రీ కొరకై గుండెలు బాదుకుంటూ 'నాబిడ్డను కాపాడండి తండ్రో' అని కన్నీరు మున్నీరుగా యేడుస్తోంది. నదిలో మునిగి పోతున్న స్త్రీ అవసానకాలం సమీపించింది. తలపైకెత్తడం ఆగిపోయింది. విడిపోయిన శిరోజాలు నీటిపై నాచులా కమ్ము కున్నాయి. యే ఒక్కరూ దిగి ఆమెను సంరక్షించటానికి సిద్ధంకాలేదు. ప్రతివారు 'అయ్యోపాపం! ఆమెకు జలగండం రాసిపెట్టివుంది; యెవరేమి చేస్తారని చప్పరిస్తున్నారు. ప్రతివాడు దిగితే తనకేమి ప్రమాదం చుట్టుకుంటుందోనని భయపడుతున్నాడు.

ఆ దృశ్యం మురహరి మనస్సును కలచి వేసింది. యింతమంది హేమాహేమీలయిన జనం మూగివుండగా ఒక ఆడది రక్షణలేక ప్రాణం పోగొట్టుకోవటం అతడు సహించలేక పోయాడు. అంతే. యిక వెనుకాముందూ చూడకుండా మురహరి నదీ గర్భంలోకి దూకి ఆస్త్రిని తన వీపు మీద ఆదుకొని ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చిచేరాడు. అంతలో కొంతమంది ధైర్యం చేసి ఆమెను పట్టుకుని గట్టుమీదకు చేర్చారు. మళ్ళా జనమంతా ఒకసారి ఆ దృశ్యాన్ని చూడటానికి వెళ్ళారు.

అందరూ మురహరి ధైర్యసాహసాల్ని వేనోళ్ళ పొగిడేవారే! ఆలస్యం చెయ్యకుండ ఆమెను ఆసుపత్రికి తీసుకొని వెళ్ళటం వుత్తమమని కొంతమంది సలహా యిచ్చారు.

ప్రథమ చికిత్స తర్వాత ఆసుపత్రిలో ఆమె జీవిస్తుందనే ఆశ కలిగింది. వైద్యం చేస్తున్న సమయానకూడా మురహరి ఆమె తల్లితోపాటు అక్కడే నిలబడి వున్నాడు. పూర్తిగా పదహారు సంవత్సరాలయినా నిండని ఆ నీట మునిగిన బాలిక సౌందర్యాన్ని మురహరి రెప్పవాల్చకుండా చూస్తున్నాడు. తాను సాహసించి వుండకపోయినట్లయితే ఈ సౌందర్యం నదీజలాల కలిసి పోయేదేగదా? అనుకొని ఒక్క నిట్టూర్పు విడిచాడు.

"కొత్తగా కట్టారు ఆనకట్ట, చూశోద్దామని పిల్ల ఒకటేపోరు పెడితే

నాటి కథ

కోశెడు దూరాన్నుంచి నడిచొచ్చాం నాయనా, నేను వద్దే అని నోరు నోరు కొట్టుకుంటున్నా పిల్లయింటేనా? ఆనకట్ట మీద ఒక కాలు పెట్టి ఇంకోకాలుతో నీళ్ళను తన్నటం మొదలెట్టింది. యింకేవుంది కాలుజారి ఒక్కసారి కొట్టుకుపోయింది. ఆ నారాయణమూర్తి ఈ తండ్రిని పంపించకపోతే నా ఒక్కగాను ఒక్క కూతురు గంగమ్మతల్లి మింగేశేదే"నని ముసలమ్మ కళ్ళ నీళ్ళెట్టుకుంది.

"ఇంకెందుకు యేడుస్తావ్! నీకూతురు బ్రతికిందిలే" డాక్టరు ఇంజెక్షను యిస్తూ ఓదార్చాడు.

"ఊరుకో ముసలమ్మా" మురహరి కూడా సమీపించి ముసలమ్మను ఓదార్చాడు.

"ఇంకా తడిగుడ్డలుతోనే వున్నావా? నాయనా!" మురహరిని ఆమె పరామర్శించింది.

"పరవాలేదులే యింటికెళ్ళి మార్చు కుంటాను". మురహరి తానింకా యిక్కడ వున్నందుకు సిగ్గుపడుతూ అన్నాడు.

ఆ బాలిక నెమ్మది నెమ్మదిగా కళ్ళు తెరిచింది. మురహరి ఆప్యాయంతో ఆమె ముఖంలోకి చూస్తున్నాడు. మృత్యువు నుండి రక్షించిన అతనిపై ఆ అమ్మాయి తప్పకుండా కృతజ్ఞురాలౌతుం దనుకున్నాడు. ఇంతకంటే పురుషుడు ఆకర్షింపబడటానికి మంచి సమయం మరొకటి దొరకదనుకున్నాడు. ఆ సమయంలో అతని మనస్సులో యువతి యువకులు ప్రేమించుకొన్న ఘట్టాలన్నీ ఒక్కసారి స్ఫురణకు వచ్చాయి. అన్నిటికంటె ఈ సంఘటన ప్రేమ జనించటానికి చాలా బలవత్తరమైందిగా భావించుకొన్నాడు.

బాగా తెల్వొచ్చిన ఆ బాలిక తన చుట్టూ తల్లీ, తడిగుడ్డలతో ఒక యువకుడూ, డాక్టరూ నిలబడి వుండటం చూచింది. ఒక్కసారి "అమ్మా" అంటూ తన తల్లిని కౌగిలించుకొని బావురుమంది.

"ఊరుకో అమ్మా! నేను చెప్పితే విన్నావా?" తల్లి కూతురు తల నిమిరింది.

"ఇంకేమీ భయంలేదు. యేదైనా బండి కట్టించుకొని మీవూరు చేరం"డని. డాక్టర్ సలహాచెప్పి వెళ్ళిపోయాడు.

"నేను కూడా యిక వెళ్ళుతానమ్మా!" మురహరి అన్నాడు.

"మంచిది నాయనా! నీ కడుపు చల్లగా నూరేళ్ళు బతుకు" మురహరిని దీవించింది ముసలమ్మ.

ప్రమాదంలో చిక్కుకొన్న అమ్మాయి పల్లెత్తి ఒక్కమాట కూడా మురహరిని పలుకరించలేదు.

అనసూయ గుర్తుకొచ్చిన మురహరి త్వరత్వరగా తన గది ముఖం పట్టాడు. ప్రేమట! ప్రేమ! అంతా బూటకం. దీనికొక పవిత్ర అర్థాన్ని సృష్టించి అందరూ తెగపొగడటం నేర్చుకున్నారు. ఎదుటివారి హృదయాలను తెలుసుకోలేని ఈ పాడు ప్రపంచంలో ప్రేమకు స్థావరముందంటే అది వట్టి 'నాటకం' అని పళ్ళు బిగపట్టి గొణుక్కుంటూనే మురహరి బట్టలు మార్చుకుని వెంటనే కలం, కాగితం తీసి యింటికి బరాబరా వుత్తరం రాసిపడేశాడు.

ఆ వుత్తరాన్ని చదువుకొన్న మురహరి తల్లిదండ్రుల ఆనందానికి మేరలేదు.

***(పరిసరాలు -1, కథల సంకలనం నుంచి)***

---

కవిత

# ఉదయభూపాలం



డా॥ వై. రామకృష్ణారావు, 89857 43964

చల్లారిన సూర్యుణ్ణి పరామర్శిద్దామని
పడమటి కొండ వెనుకకు వెళ్ళాను
ఇందాకటి వాడిలేదు గానీ
ప్రజ్వలిస్తూనే ఏదో దిగులుగా, నిమగ్నంగా...
చిక్కుబడ్డ కిరణాలను విడదీస్తూ
లెక్కబెట్టుకుంటున్నాడు
లెక్క సరిపోయినట్లు లేదు
ఆలోచనగా, అన్యమనస్కంగా కనిపించాడు
ఎన్నో కిరణాలు లుప్తమైపోయినై
భూతలం నుండీ తిరుగు ప్రయాణంలో
దారి తప్పి ఉంటాయి
కొన్ని వానమబ్బుల పరిష్వంగంలో
బుజుగమనాన్ని మరచి
ఇంద్రధనుస్సులై వొంపు వెలార్చి ఉంటాయి
కొన్నయితే శిశిర హిమకణాలను చుంబించి
మల్లెపువ్వుల అభ్యంజనానికై
శీతల బిందువులై జాలువారి ఉంటాయి
నిండుగా వెలిగేందుకు
జాబిల్లి కొన్నిటిని ఆబగా దోచేసుకుని ఉంటాడు
నిర్వేదం నుండీ నిభాయించుకొని
మళ్ళీమళ్ళీ మయూఖతంత్రుల్ని
ఒడుకుతూనే ఉంటాడు ఓ వింత చరఖాతో!
ఒకచోట నిలకడగా ఉండమంటే వింటాడా
భూవలయాన్ని ఓ పార్శ్వంలో వెలిగించి
మరోదిక్కుకు తమోయవనిక దించుతాడు
ఒక్కరోజే ఒక్కలా ఉండడు
ఏడాదంతా తిరిగి తిరిగి
వినూత్న బుతుగీతమై పోతుంటాడు
మనమైనా అంతే...
పరిణామాలతో పరిభ్రమిస్తూ అదృశ్యమై పోతాం
తేడా ఒక్కటే
అస్తమించిన భానుడు
మేలు కొలుపు పాడుతూ మళ్ళీ ఉదయిస్తాడు

వ్యాసం

# కథలు చెప్పే సంస్కృతే తెలుగు భాషకు పరిపుష్టం...

**భాషాభివృద్ధిలో బాలల కథల పాత్ర చెప్పే వ్యాసం....**



వి. రాజేశ్వర శర్మ
91778 87749

పిల్లలకు కథలు చెప్పడం అనేది మనకు ప్రాచీన కాలంనుంచి ఉన్నది. కథ మన తరతరాల అమూల్య సాహిత్య సంపదలో బహుళ జనాదరణ పొందిన ప్రక్రియ. అలాగే కథానిక అనేది కూడా ఆధునిక కాలంలో పాశ్చాత్య ప్రపంచం నుంచి వచ్చిన సాహిత్య ప్రక్రియ. ఈ కథానిక వచ్చిన తరువాత కూడా మన కథ తాను అదృశ్యం కాకుండా ఆ కథానికను కూడా తనలో ఒక భాగంగా విలీనం చేసుకుని మరింత బలంగా నిలబడ్డ మన సాహిత్య రూపం. ఈ రెంటిలో దేని లక్షణాలు, లక్ష్యాలు, ప్రయోజనాలు, లాభాలు దానికి ఉన్నాయి. కథ, కథానిక ఈ రెంటినీ ఈనాడు పరిశోధకులు తప్ప దాదాపు అందరూ 'కథ' అనే అంటున్నారు.

'కథకైనా, కథానికకైనా మూలాలు ఆది మానవులు కలిసి కూర్చుని చెప్పుకున్న కథలను ప్రస్తావించడంతోనే ప్రారంభమౌతున్నాయి'. లిపి లేని కాలంలోనే మనుషులు కథలు చెప్పుకునే వారని చరిత్ర కారులు అంటారు. "తరుచు ప్రయాణాలతో స్థిరంగా ఉండని జనం అవసరాలను దృష్టిలో ఉంచుకుని పాశ్చాత్య పత్రికలు కథానికలను రాయించాయని, అదే కథానిక ఆరంభమనీ ఒక పాశ్చాత్య విమర్శకుడు విమర్శిస్తారు." "కథ పది మందిలో చెప్పు కోవడం ద్వారా మొదలైంది. కథానిక ఒక్కరూ చదువటం కోసం మొదలైంది" అన్నారు వివిన మూర్తి (ముందుమాట, దిద్దుబాటలు, దిద్దుబాటుకు ముందు కథలు 92, తానా ప్రచురణలు). వారే అన్నట్టు 'కథ అన్ని కళారూపాలలో ఉంటుంది. ఆ కళా రూపాలలో ఒకటైన కథానికలోనూ ఉంటుంది'.

కథలు చెప్పుకోవడం కోసమే పుట్టాయి. చెప్పుకోవడం ద్వారానే పుట్టాయి. కథ మనుషులను సమూహాలుగా కలిపి, వారి ప్రపంచాన్ని విస్తృతం చేస్తూ వారిలోకి ప్రవహిస్తుంది. మనం బాలల కథలు అంటున్నవి కూడా నిజానికి అందరికి చెందిన కథలు. పంచతంత్ర




కథలు పిల్లలకు మాత్రమే అంటే ఒప్పుకుంటామా? కాదుకదా. అది విష్ణుశర్మ ఉద్దేశ్యం కూడా కాదు. దానికి పిల్లలు పెద్దలు అనేం లేదు. కథ అందరిది. అందుకే రామాయణ భారత భాగవతాల్లోని కథలు కూడా తరతరాలుగా పెద్దలూ పిల్లలూ కలిసి కుతూహలంగా వింటున్నారు. నాటి చందమామ వంటి పత్రికలు కూడా ఇలా కథల ద్వారా పిల్లల్నీ పెద్దల్నీ కలిపే పనిని ఎంతో మెళుకువతో విజయవంతంగా చేయగలిగాయి. పిల్లల్ని ప్రత్యేకంగా విడదీసే పని మన కథా సాహిత్యం చేయలేదు. పాశ్చాత్య సాహిత్యంలో కూడా నాటి గలీవర్ యాత్రలు మొదలు నేటి హారీ పాటర్ వరకూ ఇదే విషయం రుజువవుతున్నది.

కథలు ఎంతో ఆసక్తికరంగా చెప్పే అలవాటు, ఆ కళ మన గత తరం వరకు మన ఇళ్ళలో పెద్దవాళ్ళకు ఉండేది. ఈనాడు అది క్రమంగా అంతరించి పోతున్నది. దాన్ని కొందరు ప్రత్యేకంగా నేర్చుకోవలసి పరిస్థితి వచ్చింది. స్టోరీ టెల్లింగ్ అనేది డబ్బుతో ముడిపడిపోతూ అదో ఖరీదైన ప్రత్యేక విషయంగా మారిపోతున్నది. కథచెప్పడం ప్రవృత్తిగా కాకుండా వృత్తిగా మారుతున్నది. ఇలాంటి పరిస్థితులలో పిల్లలకు కథలు చెప్పే అలవాటును చేయడంకోసం కొంత

వ్యాసం

కాలంగా వ్యక్తులుగానూ, సంస్థలు గానూ కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు.

కథలు చెప్పడం అనేది వేల సంవత్సరాలుగా తరతరాలుగా మన సమాజానికి అందివస్తున్న ప్రజల కళా ప్రక్రియ. నిజానికి ఇది జానపదుల వారసత్వ కళాసంపద. ప్రపంచంలో కథలు చెప్పుకోని దేశం లేదు. కథలు లేని మానవసమాజాలూ లేవు. లిపి ఇంకా రాని కాలంలో కూడా కథలున్నాయి. ఇప్పటికీ లిపి లేని జానపద సమాజాలూ, సమూహాలూ కథలు చెప్పుకుంటూనే ఉన్నారు. సుమారు రెండువేల ఎనిమిది వందల సంవత్సరాల క్రితం వీధుల్లో 'హోమర్' జనాలకు చెప్పిన కథలే ప్రసిద్ధ గ్రీకు ఇతిహాసాలైన 'ఇలియడ్', 'ఒడిస్సీ'లు. మన రామాయణ, భారతాలు, బృహత్కథలు వంటివి కూడా రాయడం కంటే ముందు జానపదుల్లో కథలుగా ప్రచారంలో ఉండేవని చెప్తారు. ఇక్కడ ప్రముఖ బాలసాహిత్య వేత్త హరికృష్ణ దేవసరే చెప్పిన విషయాన్ని కూడా గుర్తుచేసుకోవాలి. "ప్రపంచంలో ఎన్నో అమర గ్రంథాలు రచయితలు పెద్దవాళ్ళ కోసమనే రాశారు. కానీ అవి ఈనాడు పిల్లల సాహిత్యంలో "క్లాసిక్స్"గా గుర్తింపబడుతున్నాయి." కనుక పిల్లలకు ఏ కథలు ఎలా చెప్పాలి అన్నదే అసలు విషయం. అది అత్యంత శక్తి వంతమైన విధానం. కథను చెప్పే కళను కాపాడుకోవలసిన కాలం ఇది. కథలను మన పిల్లలకు కానుకలుగా అందించవలసిన కాలం ఇది.

ఒకరు చెప్పిన కథే మరొకరు చెప్పున్నప్పుడు ఎన్నో మార్పులకు లోనవుతుంది. అలా కథ నిత్య నూతనంగా ప్రవహిస్తూనే ఉంటుంది. మన తెలుగులో కథ చెప్పడం అనేది అనేక రూపాలలో కొనసాగింది. జానపదుల్లో బుర్రకథలు,ఒగ్గుకథలు, పటంకథలు, చిందుకథలు, యక్షగానాలు వంటి అనేక ప్రక్రియల్లో చేరి కథలు జనాన్ని అలరించాయి. చదువుకున్న సమాజాల్లో హరికథలు, పురాణ కథలు,ప్రవచనాలు, పెద్దవాళ్ళు చెప్పే కథలు... ఇలా వెళుతూ ఎన్నో వ్రతాలలోనూ, పూజలలోనూ కథలు చెప్పుకోవడం కనిపిస్తుంది. బతుకమ్మ పండుగలో కథలను పాటలుగా పాడుకోవడం మనకు తెలుసు. ఇప్పుడు కూడా ఇలాంటి అనేక రూపాలలో జానపదుల్లోనూ, నగరజీవుల్లోనూ కథలు చెప్పుకోవడం, వినడం కొంతమేరకు కొనసాగుతున్నా, మారిన పరిస్థితులలో క్రమంగా ఈ అలవాటు, ఈ విద్య మసకబారుతున్నది.

చెప్పుకోవడం కోసమే కథ పుట్టింది. చెప్పుకోవడం ద్వారానే కథ పుట్టింది. కథ ఏ ఒక్కరిదో కాదు. అది సామూహికత లోంచే పుట్టింది. కథ సామూహికమైన ఉమ్మడి సొత్తు. ఒక్కటిగా మనుషులను కలిపి ఉంచడం దాని స్వభావం. బాల సాహిత్యంలో కూడా ఇప్పటి వరకూ కథే ఎక్కువగా కనబడుతున్నది. రచయితలు బాలసాహిత్యంలో కథానికను కూడా బలంగా నిలబెట్టే పని ఇంకా మిగిలే ఉన్నది. కథానిక ఈనాటి పిల్లల పరిస్థితులను, వారు ఎదుర్కుంటున్న సమస్యలనూ, వారి ఆకాంక్షలనూ, విజయాలనూ, మరింత దగ్గరగా చూపించగలదు. కథానిక వాస్తవిక ప్రపంచాన్ని చూపి, నిలబెట్టి నడిపిస్తుంది. కథ ఊహలకు రెక్కలిచ్చి అద్భుత

**సుమారు రెండువేల ఎనిమిది వందల సంవత్సరాల క్రితం వీధుల్లో 'హోమర్' జనాలకు చెప్పిన కథలే ప్రసిద్ధ గ్రీకు ఇతిహాసాలైన 'ఇలియడ్', 'ఒడిస్సీ'లు. మన రామాయణ, భారతాలు, బృహత్కథలు వంటివి కూడా రాయడం కంటే ముందు జానపదుల్లో కథలుగా ప్రచారంలో ఉండేవని చెప్తారు. ఇక్కడ ప్రముఖ బాలసాహిత్య వేత్త హరికృష్ణ దేవసరే చెప్పిన విషయాన్ని కూడా గుర్తుచేసుకోవాలి.**




కాల్పనిక ప్రపంచంలోకి ఎగరేసుకు పోతుంది. కనుక బాలసాహిత్య రంగంలో కథలు, కథానికలు కలిపి 'కథలు'గా చెప్పే సంస్కృతిని పునరుద్ధరించడం ఈనాటి అవసరం. ఇలా పిల్లలకు కథలు చెప్పడం వల్ల, పిల్లలు కథలు వినడం వల్ల వాళ్ళకు అనేక లాభాలు కలుగుతాయి. మన తెలుగుభాష భవిష్యత్తులో మరింత పరిపుష్టం కావడానికి కథలు చెప్పే సంస్కృతి ఎంతో దోహదం చేస్తుంది.

ముందే చెప్పుకున్నట్టు 'కథలు' వేల సంవత్సరాలుగా మానవ జాతికి ఒక తరంనుంచి మరొక తరానికి అందివస్తున్న అమూల్య సంపద. కథ మానవజాతి పురోగమనానికి ఓ దిక్సూచిలా, ఓ దిక్సూచిలా తోడ్పడింది. కథల్లో కల్పించుకున్న ఊహలు, కల్పనలు ఎన్నో శాస్త్రీయ పరిశోధనలకు, శాస్త్రీయ సాంకేతిక ఆవిష్కరణలకు ప్రేరణనిచ్చాయి. వాటికి పునాదులుగా నిలబడ్డాయి. కథలు మనుషులకు ఈ ప్రపంచాన్ని గురించి ఆలోచించడం నేర్పాయి. లోకాన్ని ఎలా చూడాలో, ఎలా అర్థం చేసుకోవాలో, ఎప్పుడు ఎక్కడ ఎలా నడుచుకోవాలో, లోక వ్యవహారం ఎలా నిర్వహించాలో కథలు బోధించాయి. యుద్ధాలు, ప్రకృతి వినాశనాలు, కుటుంబాల్లో సంక్షోభ పరిస్థితులు ఏర్పడ్డప్పుడు మనుషులకు కావలసిన గుండెనిబ్బరాన్ని, ఓదార్పును

కథలు ఇచ్చాయి. ఏది మంచో, ఏది చెడో, ఏంచేయాలో, ఏంచేయకూడదో కథలు ఉదహరించాయి. జిజ్ఞాస, పరిశీలనాసక్తి, ఊహాశక్తి, కల్పనాశక్తి వంటివి వికసింపజేస్తూ మెదడును నిశితం చేసినవి కథలు. కథలు చెప్పడం వల్ల, కథలు వినడం వల్ల భాషాపరంగా ఒనగూడే ప్రయోజనాలు కూడా ఎన్నో ఉన్నాయి. కనుక కథలు అందరూ వినాలి. అందరూ చెప్పాలి. అది మన భవిష్యత్తుకూ, భాషకూ అమూల్యమైన మేలు చేస్తుంది.

పెద్దలు పిల్లలకు కథలు చెప్పడం పూర్వం నుంచి ఉన్నదే. ఇప్పుడు పిల్లలతో కూడా కథలు చెప్పించే అలవాటును పెంపొందిస్తే కథలు పిల్లలకు మరింత చేరువౌతాయి, ఇష్టమౌతాయి. వాళ్ళకూ, భాషకూ కావలసినంత మేలు జరుగుతుంది. ఈ ప్రయత్నం ఇటీవల గుర్తించదగిన స్థాయిలో జరుగుతున్నది. నేను ఓ పాఠశాలకు కథా కార్యశాల సందర్భంగా వెళ్ళినప్పుడు 'కథలెందుకు?' అనే ప్రశ్నను పిల్లల ముందుంచినప్పుడు వాళ్ళు అనేక కోణాల్లో కథల ప్రయోజనాలను గురించి తమ మాటల్లో చెప్పారు. కథలు వింటే ఆనందంగా ఉంటుందని, సంతోషం కలుగుతుందని, బాగుంటుందని, కాలక్షేపం ఔతుందని కొందరు పిల్లలు చెప్పారు. ధైర్యం పెరుగుతుందని, తెలివితేటలు పెరుగుతాయని, మాట్లాడే పద్ధతి తెలుస్తుందని, భాష తెలుస్తుందని, చరిత్ర తెలుస్తుందని కొందరన్నారు. సమస్యలు వస్తే తీర్చుకునే పద్ధతి తెలుస్తుందని, కొత్త సంగతులు తెలుస్తాయని, తామే ఆ పాత్రలుగా అనిపిస్తుందని, అలా తాము తమకు తెలియకుండానే ఊహించుకుంటామని కొందరు అన్నారు. స్నేహం,పెద్దవాళ్ళపై గౌరవం, ప్రేమ పెరుగుతాయన్నారు. నీతులు ఉంటాయని, కలిసి ఉండడం తెలుస్తుందని, కొత్త ఆలోచనలు కలుగుతాయని, మనుషులగురించి అర్థమౌతుందని, జంతువులగురించి తెలుస్తుందని, మంచి కలలు వస్తాయని మరికొందరు మాట్లాడారు. చదువడం,

**కథలు వింటే ఆనందంగా ఉంటుందని, సంతోషం కలుగుతుందని, బాగుంటుందని, కాలక్షేపం ఔతుందని కొందరు పిల్లలు చెప్పారు. ధైర్యం పెరుగుతుందని, తెలివితేటలు పెరుగుతాయని, మాట్లాడే పద్ధతి తెలుస్తుందని, భాష తెలుస్తుందని, చరిత్ర తెలుస్తుందని కొందరన్నారు. సమస్యలు వస్తే తీర్చుకునే పద్ధతి తెలుస్తుందని, కొత్త సంగతులు తెలుస్తాయని, తామే ఆ పాత్రలుగా అనిపిస్తుందని, అలా తాము తమకు తెలియకుండానే ఊహించుకుంటామని కొందరు అన్నారు.**

రాయడం నేర్చుకోవచ్చని, తాముకూడా కథలు పుట్టించి రాస్తామని, తమ పేర్లు పేపర్లలో వస్తాయని, తమను కూడా మెచ్చుకుంటారని వాళ్ళు ఆశపడ్డారు. అందరూ ఒక్కదగ్గర కూర్చుని మాట్లాడుకోవచ్చని, కొత్త కొత్త ప్రదేశాలగురించి తెలుస్తుందని, నవ్వుకోవచ్చని, నటన నేర్చుకోవచ్చని, మిమిక్రి చేయొచ్చని, కథలను నాటికలుగా వేసి సెల్‌ఫోన్‌లలో చిత్రించవచ్చని, పేరొస్తుందని, డబ్బులొస్తాయని వాళ్ళు చెప్పుకొచ్చారు. ఇవి పెద్ద పెద్ద సూత్రీకరణలు కాకపోయినా పిల్లలు కథల గురించి చెప్పిన ఆలోచనలు. వీటిలో భాషా పరమైన అంశాలు కూడా కొన్ని ఉన్నాయి.

ఈనాటి పరిస్థితులలో మన తెలుగు భాషను మరింత భాగ్యవంతం చేసుకోవడానికి కథలు చెప్పే కార్యక్రమాలు ఉద్యమంలా జరగాలి. కథలు చెప్పడం వల్ల, కథలు వినడం వల్ల కలిగే భాషాపరమైన కొన్ని ప్రయోజనాలు చూద్దాం. వినడం ద్వారానే మాట్లాడడం తెలుస్తుంది. వినడం ద్వారానే మౌఖిక భాషా ప్రయోగ నైపుణ్యాలు నేర్చుకుంటారు. కొత్త కొత్త పదాలు తెలుస్తాయి. మరుగున పడ్డ పదాలు వెలుగులోకి వస్తాయి. తెలిసిన పదాలను విభిన్న సందర్భాలలో, వేరే వేరే అర్థాలతో, భావాలతో ఉపయోగించడం తెలుస్తుంది. ఎన్నో రకాల వాక్య నిర్మాణ రీతులు, వ్యక్తీకరణలు పరిచయం అవుతాయి. భాష అంటే కేవలం శబ్దం ద్వారా మాత్రమే కాదని , దానికి తగిన ఆంగిక వ్యక్తీకరణ కలిపితేనే అది సరిగా ఎదుటి వాళ్ళకు చేరుతుందని తెలుసుకుంటారు, నేర్చుకుంటారు.సమయ సందర్భాలను, వ్యక్తులను బట్టి పలికే ధ్వని సంబంధమైన మార్పులుకూడా భాషలో భాగమేనని తెలుసుకుంటారు. భావోద్వేగాలను వ్యక్తీరించే సమయంలో భాషలో జరిగే మార్పులను అర్థం చేసుకుంటారు. అందంగా చెప్పడం, ఆకర్షించేలా చెప్పడం, సమయోచితంగా, పాత్రోచితంగా చెప్పడం, శక్తి వంతంగా, ఆకర్షణీయంగా చెప్పడం తెలుస్తుంది. వినడం పట్ల ఆసక్తి పెరుగుతుంది. విన్నదాన్ని సరిగ్గా అర్థం చేసుకునే నైపుణ్యం వస్తుంది. మాటలను చిత్రాలుగా, ఊహలను మాటలుగా అనువదించుకోవడం తెలుస్తుంది. భావాలను చక్కగా వ్యక్తీకరించడం అలవాటౌతుంది. భావోద్వేగాలను వ్యక్తీకరించడం వస్తుంది. జాతీయాలు, సామెతలు అలంకారాలు వంటివి ఎలా వాడాలో అభ్యాసమౌతుంది. గుంటనక్కలు, కరటక దమనకులు, కుంభకర్ణుడు, బకాసురుడు, గాడిద



చాకిరి, కాకిగోల, పాముపగ, గ్రామ సింహం వంటి అనేక పదాలనూ, పదబంధాలనూ అవసరమైన చోట ఎలా వాడుకోవాలో అవగాహన చేసుకుంటారు. భాషణలో, లేఖనంలో తమదైన శైలి అలవడుతుంది. అనేక ప్రాంతాల పదాలు, ఉచ్చారణలు తెలుస్తాయి. మాటలతో సంఘటనలను దృశ్యమానం చేసేకళ అలవరుచు కుంటారు. సందర్భోచితంగా సంభాషించడం తెలుస్తుంది. కథల మీద ఇష్టం కలిగి కథల పుస్తకాలు చదివే అలవాటు కలుగుతుంది. తాముకూడా ఏమైనా రాయాలనే కోరిక కలిగి రాసే ప్రయత్నం చేస్తారు. రాస్తారు. అలా ఎందరో తెలుగులో చక్కగా చెప్పే వక్తలు, నూతన రచయితలు తెలుగు సమాజానికి లభిస్తారు. తెలివితేటలు పెరుగుతాయి. మంచి వ్యక్తిత్వాలు ఏర్పడుతాయి. మానవ సంబంధాలు బలపడతాయి. కొత్త కొత్త రచనలు జరిగి తెలుగు భాషకూ, తెలుగు సమాజానికీ, దేశానికీ ఎంతో మేలు ఒనగూడుతుంది. కథలు చెప్పడం అనేది కేవలం భాషకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. దానితో శాస్త్ర,సాంకేతిక, ఆర్థిక,సామాజిక, సాంస్కృతిక రంగాలకు కూడా పరోక్షంగా ఎంతో లాభం కలుగుతుంది.

మరి కథలు ఎవరు చెప్పాలి? ఇళ్లలో తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మలు, నానమ్మలు, అన్నలు, తమ్ముళ్ళు,

**పుస్తకాలు తెస్తున్నారు. వాటిని సినీమాలుగా కూడా తీస్తున్నారు. వాటిని పిల్లలతో బాటు పెద్దలుకూడా ఇష్టంగా ఆదరిస్తున్నారు. మన దగ్గర కూడా ఈ అవగాహన ఉండేది. మన దేశంలో రవీంద్రనాథ్ టాగూర్, ప్రేమ్‌చంద్, గురజాడ వంటి ఇంకా ఎందరో ప్రసిద్ధ రచయితలు పెరిగిన పిల్లలకోసం కూడా అమూల్యమైన రచనలు చేశారు.**




అక్కలు, చెల్లెళ్ళు చిన్నవాళ్ళు, పెద్దవాళ్ళు అందరూ కథలు చెప్పాలి. తప్పకుండా నేర్చుకొని మరీచెప్పాలి. నెలకు కనీసం రెండు రోజులైనా ఇంటిల్లిపాది కలిసి కథల పండుగ చేసుకోవాలి. వెన్నెల్లోనో, చుక్కల కిందో అయితే మరీ బాగుంటుంది. బడుల్లో సబ్జక్టులతో సంబంధం లేకుండా టీచర్లందరికీ కథలు చెప్పడం రావాలి. "కనీసం వంద కథలైనా చెప్పగలిగితేనే ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందే అర్హత ఉండేలా ఒరూల్ ఉండాలి" అన్నాడో విద్యావేత్త. తెలుగు భాషాభిమానులేకాదు, భవిష్యత్తరాలకు మంచి భవిష్యత్తును కోరుకునేవాళ్ళందరూ కథలు నేర్చు కోవాలి. కథలు చెప్పడం ప్రారంభించాలి.

మాతృ గర్భంలో ఉన్నప్పటినుంచి పద్దెనిమిది సంవత్సరాలు నిండేవరకూ అందరూ పిల్లలే. అదంతా బాల్యమే. ఎవరికి ఇష్టంవున్నా, లేకపోయినా వాళ్ళు బాలలే, అది బాల్యమే. ఇది జాతీయ, అంతర్జాతీయ చట్టాలు చెపుతున్న మాట. ఆ బాల్యంలో రకరకాల వయోదశలు ఉంటాయి. పిల్లలంటే కేవలం చిన్న పిల్లలే కాదు. వారిలో పెద్దపిల్లలు కూడా ఉంటారు. ఈ సోయి ఉన్నది కనుకనే పాశ్చాత్య సాహిత్య ప్రపంచం చిన్న పిల్లలకోసం బాలసాహిత్యాన్ని రాయడంతో బాటు, పెరిగిన పిల్లలకోసం కూడా రాస్తున్నారు. పుస్తకాలు తెస్తున్నారు. వాటిని సినీమాలుగా కూడా తీస్తున్నారు. వాటిని పిల్లలతోబాటు పెద్దలుకూడా ఇష్టంగా ఆదరిస్తున్నారు. మన దగ్గర కూడా ఈ అవగాహన ఉండేది. మన దేశంలో రవీంద్రనాథ్ టాగూర్, ప్రేమ్‌చంద్, గురజాడ వంటి ఇంకా ఎందరో ప్రసిద్ధ రచయితలు పెరిగిన పిల్లలకోసంకూడా అమూల్యమైన రచనలు చేశారు. మన దేశంలోని కొన్ని ఇతర భాషల్లో బాలసాహిత్య రచయితలు కూడా పెద్దపిల్లలకోసం పనికొచ్చె కథలు రాస్తున్నారు. కానీ నేడు మన తెలుగు బాలసాహిత్యంలో క్రమంగా ఈ అవగాహన లోపిస్తూ బాల్యం అంటే కేవలం చిన్న పిల్లలకు మాత్రమే పరిమితమైనదనే భావన బలపడుతున్నది. తెలుగులో బాలసాహిత్యంలో పెద్దపిల్లలకోసం రాస్తున్న వాళ్ళు చాలా చాలా తక్కువ. బాలసాహిత్యం రాస్తున్న రచయిత లందరూ పెద్దపిల్లలకోసం కూడా రాయాలి. కేవలం గత కాలపు కథలకు అనుకరణలుగానో, నకళ్ళుగానో ఉండే రచనలు కాకుండా, వర్తమానంలో ఉన్న బాల్యాన్ని సాహిత్యంలోకి తేవాలి. ఈనాటి పిల్లల పరిస్థితులు, వాళ్ళ ఆశలు, ఆలోచనలు, వాళ్ళు ఎదుర్కొంటున్న పరిస్థితులు, వాళ్ళ సంఘర్షణలు, విజయాలు,ఊహలు, కల్పనలు అన్నీ కథల్లోకి తేవాలి. ఈనాటి పిల్లలకు వాళ్ళ నిత్యజీవితంలో హాయిగా, సులభంగా ఉండే తెలుగును నేర్పేలా కథలు రాయాలి. వర్తమాన వాస్తవికతలతో, ఆధునిక కల్పనలతో, భవిష్యత్తుకు నడిపించే కథలు, కథానికలు ఈనాటి బాలసాహిత్య రచయితలు రాయాలి. తాము కూడా కథలు చెప్పాలి. ఇది ఈనాటి చారిత్రక అవసరం.

కథలు వర్ధిల్లాలి! కథలు చెప్పే సంస్కృతి వర్ధిల్లాలి!! కథలతో తెలుగు భాష గుబాళించాలి!!!

కథ

# పిడికిలి ఇసుక

మానవీయ భావజాలాలకు ప్రతిబింబం...



దేవకి తిరునగరి
99496 36515

"అమ్మమ్మ! ఇవ్వాళ్ల పులిహోర చేస్తావా?" బుంగమూతి పెట్టి అడిగింది వర్షిత

"ఓ ఎందుకు చేసి పెట్టను. అర గంటలో నీ ప్లేట్లో పులిహోర ఉంటుంది. సరేనా? "బుజ్జగింపుతో చెప్పింది వర్ధనమ్మ.

"అమ్మమ్మా! నాకు పులిహోరేం వద్దు. ఫ్రైడ్ రైస్ కావాలి" అడిగాడు అనురాగ్ బతిమిలాడే ధోరణిలో.

"చూడండి పిల్లలు ఇద్దరికీ కావలిసినవి చేసి పెడుతాను. కాస్త ఓపిక పట్టండి. ముందు వర్షిత అడిగింది. అంచేత ఇవ్వాల్లేమొ పులిహోర రేపు వెజ్ టేబుల్ ఫ్రైడ్ రైస్. ఒకేనా." సముదాయింపుగా చెప్పింది వర్ధనమ్మ.

కూతురు తర్వాత మళ్ళీ పిల్లలు పుడుతారనే అనుకోలేదు వర్ధనమ్మ పరంధామయ్య దంపతులు. కూతురు సంయుక్త తర్వాత ఏడేళ్ళకు వచ్చిన గర్భాన్నీ వద్దనుకోలేదు. అట్లా ఆ ఇంట్లో ప్రవేశించిన మరో ప్రాణి మాధవ్. ముప్పై ఏళ్ళు దాటాయి. పెళ్ళి మాటెత్తితే చిరాకు. సెటిల్ కావాలంటాడు. అడ్వకేట్‌గా ఈ మధ్యే ప్రాక్టీసు మొదలు పెట్టిండు. డిస్ట్రిక్ట్ కోర్టులోనే కాక హైకోర్ట్‌తో పాటు వేరే జిల్లాలకు కేసులకు అటెండ్ అవుతుంటాడు. ఇటీవలి కాలంలో మంచి పేరే తెచ్చుకున్నాడు. అక్క పిల్లలంటే ప్రాణం. ప్రతి ఎండాకాలం సెలవులకు టంచన్‌గా అమ్మమ్మ ఊరికి చేరుకుంటారు అనురాగ్ వర్షితలు. దానికి కారణం లేక పోలేదండోయ్. అమ్మమ్మ తాతయ్యలు ప్రాణప్రదంగా చూసుకుంటారాయె. మామయ్య సంగతి చెప్పాల్సిన పనే లేదు. మరి రాకుండా ఎట్లా ఉంటారు? వాళ్ళడుగాలే కాని అమ్మమ్మకు నీరసం పటాపంచలై పోతుంది. లేని ఉత్సాహం పుట్టుకొస్తుంది. నిజం చెప్పాలంటె వారం రోజులుగా ఆమెకు ఒంట్లో నలతగా ఉంది. ఐనా సరే ఆ అమ్మమ్మ వెనుకడుగు వేసేది లేదు. తోట నుండి కావలిసిన పండ్లు చెరుకు గడలు తాటి ముంజులు మక్కజొన్న కంకులు వేరు శనగ కాయల లాంటివి సమకూర్చడం తాతయ్య పని.

"ఏంటర్రా పిల్లలూ! తాతయ్య మిమ్మల్ని తోటకు తీసుకెళ్తారట తొందరగా లేచి తయారవ్వండి." వర్ధనమ్మ తొందరపెట్టింది మనవడు మనవరాలిని.

"ప్లీజ్ అమ్మమ్మ! ఇంకాసేపు పడుకుంట. రాత్రేమో చాలా పొద్దుపోయి పడుకున్నాం కదా!" అంది వర్షిత

"ఎందుకో???"అమ్మమ్మ దీర్ఘం తీసి అడిగింది.

"మరేమొ తాతయ్య కథలు చెప్తుంటేను..." తన నిద్రకు కారణాన్ని చెప్ప చూసాడు అనురాగ్.

"ఆ కారణాలన్నీ నాకనవసరం. పొద్దున్నే లేవడం మంచి అలవాటు. సరె సరె తొందరగా స్నానాలు చేసి రండి"అంటూ హెచ్చరించి వర్ధనమ్మ వంటింట్లోకి దూరింది.పది నిమిషాల్లో అన్నా చెల్లెండ్లిద్దరు అమ్మమ్మ ఆజ్ఞను శిరసావహించారు. అమ్మమ్మ పెట్టిన టిఫిన్ తినేసి చెప్పులేసు కుంటున్నారిద్దరూను.

"పిల్లలు ఆగండాగండి. ముందు నాకెదురు రండి. ఓ ముఖ్యమైన కేసు వాదించడానికి హైకోర్ట్ పోతున్నాను. కాస్త ఎదురు రండర్రా!" చిరునవ్వుతో అడిగాడు మాధవ్.

"ఓ అలాగే" అంటూ మామయ్యకు ఎదురొచ్చి అమ్మమ్మ ఇచ్చిన బ్యాగులు తీసుకొని తాతయ్యతో తోటకు చెక్కేసారు. ఆ రోజంతా తోటంతా గెంతులేసారు. కొబ్బరి బోండాలు కొట్టించుకొని తృప్తిగా తాగారు.. చెట్లకున్న ఉయ్యాలలూగారు. విరగ కాసిన మామిడికాయలను పండ్లను ఏరి ఏరి బుట్టలలో నింపడం మొదలు పెట్టారు. ఈ లోగా అమ్మమ్మ పనివాళ్ళతో పంపించిన కారేజ్ ఖాళీ చేసారు. టైం చూస్తే మూడైంది. తోటలోనే ఓ మూలగా రెండుగదుల పెంకుటింట్లో కాసేపు విశ్రాంతి తీసుకొని ఇంటిముఖం పట్టారు.

కథ

ఇంట్లో కాలు పెడుతూనే పకోడి వాసన వాళ్ళ ముక్కుపుటాలను అదరగొట్టింది.

"కాళ్ళూ చేతులు కడుక్కొని రండర్రా! వేడివేడిగా పకోడీలు తిందురుగానీ" అంటూ వర్ధనమ్మే కాదు ఆ వాసనకు మనసూ తొందర పెట్టింది. కాళ్ళూ చేతుల పని కానిచ్చేసి పకోడీ ప్లేట్లతో వరండాలో చెక్క బల్లపైకి చేరుకున్నారు పిల్లలు. పరంధామయ్యేమొ ఆరాంచేర్లో కూర్చొని మనవడు మనవరాళ్ళ సందడి చూసి తెగ మురిసిపోతూ తానూ ఒక్కో పకోడి పని పట్టేస్తున్నాడు.

"ఏంటి ఏదో ఘుమ ఘుమ వాసన. ఓ పకోడీనా? మరి నాకేదర్రా? మీరే లాగించేస్తే ఎట్లా?" అంటూ మాధవ్ వచ్చాడు.

"నీకూ ఉన్నాయిలే. అమ్మమ్మ చేస్తునే ఉంది. ముందు కాళ్ళూ చేతులు కడుక్కొని రా. లేకపోతే అమ్మమ్మ పెట్టదుగా" అంది వర్షిత కళ్ళెగరేస్తూ.. కొడుక్కీ పకోడీ ప్లేటు తెస్తున్న భార్యను చూసి నువ్వూ ఓ ప్లేటు తెచ్చుకోవచ్చుగా" అన్నాడు పరంధామయ్య.

"కాళ్ళూ చేతులు కడుక్కొని నేనూ తింటాను. మీరేం బెంగ పడకండి" అని నవ్వుతూ ఇంటివెనకాలకు పోతూనే "వర్షితా" అంటూ కేకేసింది. పకోడీలు తిన్న మూతి తుడుచుకుంటూ ఒక్క అంగలో వెళ్ళి అమ్మమ్మ కొంగు పట్టుకుంది." నా ముందుకు ఇలా రా అంటూ వర్షితను తన ముందుకు లాక్కొని కళ్ళు తెరిచింది. విదియ నాటి చంద్రరేఖను చూసి అలా చేయడం వర్ధనమ్మకు అలవాటు. అలా ఇష్టమైన వాళ్ళ మొహం చూస్తే ఆ నెలంతా మంచి జరుగుతుందనే నమ్మకం కూడా.

పిల్లల సెలవులు ఐపోయాయి. నాలుగు రోజుల్లో స్కూళ్ళు తెరుస్తారనగా సెకండ్ సాటర్ డే సండేతోపాటు మరో రెండు రోజులు సెలవు పెట్టి సంయుక్త సాగర్లు వచ్చేసారు.వర్ధనమ్మ సంతోషానికి పట్ట పగ్గాల్లేవు.ఆ విషయం ముందే తెలిసినందువల్ల ముందే కొడుక్కి చెప్పి కూతురు అల్లుడు, మనవడు, మనవరాలు అందరికీ బట్టలు తెప్పించింది. పక్కింటి వనజాక్షి సాయం తీసుకొని చకిలాలు.. కారప్పూస... అరిసెలు.. లడ్డూలు... కజ్జికాయలు చేయించింది. సప్తమి తిథి శుక్రవారం బాగుందని ఒడి బియ్యం నింపడానికి నిర్ణయించుకొంది కూడా.

"ఎందుకమ్మా! ఈ హడావిడి. పెళ్ళై పదిహేను సంవత్సరాలు కావస్తుంది. మేమిద్దరమూ ఉద్యోగాలు చేస్తున్నాం. మంచి పొజిషన్లో ఉన్నాం కూడా. ఈ పెట్టుపోతలు... ఇంత తాపత్రయం ఇంకా అవసరమా అమ్మా!" అంది సంయుక్త

"నువ్వెంత ఎత్తు ఎదిగినా నాకు కూతురువే తల్లీ! నేనున్నంతవరకు ఇలా జరుగాల్సిందేనమ్మా! అది సంప్రదాయం కూడా..." అంది వర్ధనమ్మ. మరునాడు ఇరుగు పొరుగు ముత్తైదువలను పిలిచి ఒడిబియ్యం నింపిది. వర్షిణి అనురాగ్ లకు కూడా మంచి డ్రెస్లు కుట్టించడంతో వాళ్ళు తెగ సంబుర పడిపోయారు.

"ఏమండీ ఒకసారి వీలు చూసుకొని మధురానగరం వెళ్ళొద్దామా?" సంయుక్త

"ఏంటి అమ్మానాన్నలపై బెంగ పెట్టుకున్నావా?" సాగర్

"నిజమేనండీ. దుక్కలా ఉన్న నాన ఎలా ఐపోయారో? కాస్తో కూస్తో అమ్మ బావుండబట్టి సరిపోయింది" దిగులుగా అంది సంయుక్త.



కథ

"ఏం చేస్తాం గుడ్డిలో మెల్ల. మీ తమ్ముడు మరదలేమో ఏ సెలవుల్లేని ఉద్యోగాలు చేస్తున్నా రాయె. పోనీ ఇంటిదగ్గరేమన్నా వెసులుబాటా అంటే అదీలేదు. క్లయింట్లతోనే సరిపోతుంది.."

"అదే బాధగా ఉందండి. కనీసం ఊళ్ళో ఉన్నా పనివాళ్ల ఆసరా ఉండేది. ఈ హైదరాబాద్‌లో అదీ లేదు. నాన్న మంచాన పడి.. ముక్కుతూ మూల్గుతూ.. అమ్మ చేయలేక..." బాధగా మూల్గింది సంయుక్త.

"బాధ పడకు.-ఈ సృష్టిలో జరుగుతున్న సంఘటనలకు మనం కేవలం ప్రేక్షకులం మాత్రమే. పరిస్థితులతో సహజీవనం తప్పదు. అన్ని పరిస్థితులను జీర్ణించుకోవాలె. సరే రేపు ఎలాగూ సెలవే కదా! ఓసారలా వెళ్ళొద్దాంలే" సమాధానపరిచాడు సాగర్.

"ఎక్కడికేంటి" అటుగా వస్తున్న అనురాగ్ అడిగాడు.

"అమ్మమ్మ తాతయ్యలను చూడటానికి" చెప్పింది సంయుక్త.

"ఎప్పుడు?" అనురాగ్ వెనకాల వస్తున్న వర్షిత ప్రశ్న.

"పది గంటలకంతా బయలుదేరాలనుకుంటున్నాం."

"మేము లేకుండానే......?" ఇద్దరి పిల్లల ఎదురు ప్రశ్న

"మీకు 15 నుండి ప్రి ఫైనల్స్. బుద్ధిగా చదువుకోండి. మళ్ళీ వెళ్ళినపుడు వద్దురుకాని." సముదాయించింది సంయుక్త.

"కుదరదు. మేం సిలబసులో అప్ టు డేట్‌గా ఉన్నాం. నేనైతే మామయ్యతో చెస్ ఆడి ఎన్ని రోజులైందో తెలుసా?" అన్నాడు అనురాగ్.

"నేను అత్తయ్యతో టెన్నికైట్ ఆడాలి." వర్షిత.

"ఇప్పుడంత సీన్ లేదర్రా. వాళ్ళ పనులలో వాళ్ళు మునిగిపోయి ఉన్నారు."

"ఏంలేదు. నువ్వలాగే అనుకో. అత్తయ్య మామయ్య మేమెళ్ళామంటే మాతోనే స్పెండ్ చేస్తారో లేదో చూడు." అన్నారు పిల్లలిద్దరు. అమ్మమ్మ

**"వర్షితా అనురాగ్ రండర్రా! అమ్మమ్మ మీకోసం పులిహోర పాయసం చేసింది." అంటూ పిల్లలను పిలిచింది సంయుక్త. అమ్మమ్మ వంటలంటే లొట్టలేసుకుంటూ తినే పిల్లలకు ఆ రోజు ఆవంటలు పెద్దగా సంతృప్తి నివ్వలేదు. కాసేపు అమ్మమ్మ తాతయ్యలతో కబుర్లు చెప్పి సాయంకాలం మాధవ్ స్విగ్గీ నుండి తెప్పించిన స్నాక్స్ తిని వాళ్ళకు బై చెప్పి ఆరు గంటలకల్లా ఇల్లు చేరుకున్న పిల్లలకు మనసు మనసులో లేదు.**

తాతయ్యల దగ్గరికి పోవడమనగానే వర్షిత అనురాగ్‌ల ఆనందానికి అవధుల్లేవు. ఏ సుప్రభాతాలు లేకుండానే ఉదయాన్నే లేచి బుద్ధిగా తయారయ్యారు. పది గంటలకల్లా కారు మధురానగరం చేరుకుంది. మనవడు మనవరాలిని చూడగానే వర్ధనమ్మ పరంధామయ్యలు తెగ సంతోషపడిపోయారు. కాని పిల్లలు అనుకున్నట్టు మాధవ్ అర్చనలు అంత సమయాన్ని పిల్లలకు కేటాయించలేక పోయారు. నామమాత్రపు పలకరింపుల తర్వాత ముందురూంలో తమ క్లయింట్లతో వాళ్ళు మమేకమైపోయారు. సంయుక్త వాళ్ళమ్మకు సాయంగా ఏదో పనిలో మునిగిపోయింది. సాగర్ మాత్రం మామగారిని తన కబుర్లతో ఊరట కలిగించే పనిలో లీనమైపోయాడు. నిరుత్సాహంగా పిల్లలిద్దరు టివితో కాలక్షేపం చేయక తప్పలేదు.

"సంయుక్తా! పిల్లలను భోజనానికి పిలువు తల్లీ!" అంది వర్ధనమ్మ.

"వర్షితా అనురాగ్ రండర్రా! అమ్మమ్మ మీకోసం పులిహోర పాయసం చేసింది." అంటూ పిల్లలను పిలిచింది సంయుక్త. అమ్మమ్మ వంటలంటే లొట్టలేసుకుంటూ తినే పిల్లలకు ఆ రోజు ఆవంటలు పెద్దగా సంతృప్తి నివ్వలేదు. కాసేపు అమ్మమ్మ తాతయ్యలతో కబుర్లు చెప్పి సాయంకాలం మాధవ్ స్విగ్గీ నుండి తెప్పించిన స్నాక్స్ తిని వాళ్ళకు బై చెప్పి ఆరు గంటలకల్లా ఇల్లు చేరుకున్న పిల్లలకు మనసు మనసులో లేదు. ఎంతో ఆత్మీయంగా ప్రేమగా ఉండే మామయ్య పెద్దగా పట్టించుకోలేదు.

పెళ్ళైన కొత్తలో అత్తయ్య బానే మాట్లాడేది. అదేంటో ఈ మధ్య ఆ చనువు కనబడటమే లేదు. మరీ ఈ రోజు ఏమాత్రం పట్టించుకోకుండా వాళ్ళ పనులలో మునిగి పోయారు. వాళ్ళ పెళ్ళిలో అంతా తామై తిరిగిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. మామయ్య పెళ్ళి పనులన్నింటిని అమ్మా నాన్నలే దగ్గరుండి చేసారు. ఎందుకిట్లా జరిగింది?" అనుకొని చాలా మదన పడ్డారా పిల్లలు.

"అనురాగ్! నన్నోసారి మామయ్య ఇంటి దగ్గర దింపిరా నాన్న." బతిమిలాడే ధోరణిలో సంయుక్త.

"నాకు వీలుకాదమ్మ. రేపటి నుండే మా ఇంటర్నల్స్. నేను మంచి మూడ్‌లో ప్రిపేరౌతున్న" అనురాగ్ సమాధానం...

"వర్షితతో నువ్వైతే రాఖీ కట్టించున్నావుగా. మరి నేను మా తమ్ముడికి కట్టక్కర్లేదా?" కాస్త నిలదీస్తున్న ధోరణిలో నవ్వుతూ అంది సంయుక్త.

"ఇదిగో ముందే చెప్తున్న. దింపడమొకసారి... పికప్ చేసుకోవడం మరోసారి కుదరదంటే కుదరదు. మనం వెళ్లామా? నువ్వు రాఖీ కట్టావా? తిరుగు ప్రయాణం చేసామా? అన్నట్లుండాలి. ఓకేనా?" కచ్చితంగా చెప్పాడు అనురాగ్.

"ఓకే బంగారం" అంటూ చెవులు పట్టుకుంది సంయుక్త నవ్వుతూనే.

"నాన్న రావడానికి ఎంత టైం పడుతుందో ఏమో? ఒక్కదాన్నే బోర్. ఎలాగూ తొందరగా వచ్చేస్తానంటున్నారుగా నేనూ వస్తా." అంది వర్షిత.

"మరీ సంతోషం తల్లీ!" అంటూ కొడుకు కూతురుతో తమ్ముడి ఇంటికి

బయలు దేరింది సంయుక్త. మాధవ్ వాళ్ళ ఇంటి ముందు కార్లు ఆ ఇంటి సందడిని తెలిపాయి. నవ్వులు కేరింతలు బయటి వరకు వినిపిస్తున్నాయి. ఎవరై ఉంటారని ఆలోచిస్తూనే ముగ్గురూ లోపలికి ఎంటరైతే కాని అర్చన అన్నా వదినలు వాళ్ళ పిల్లలు వచ్చారని అర్థం కాలేదు.

"రండి వదినా! బావున్నారా? మీ రాక కోసమే మీ తమ్ముడి ఎదిరి చూపులు...." అంటూ ఆహ్వానించింది అర్చన.

"మా తమ్ముడు నీతో చెప్పాడేంటి నా కోసం ఎదిరి చూస్తున్నట్టు?" అడిగింది సంయుక్త.

"ప్రత్యేకంగా చెప్పాలేంటి? ఆ చూపులే చెప్తున్నాయి." నవ్వుతూ అంది అర్చన.

"నిజమే. సారీ మాధవ్ రేపు స్కూల్‌లో ఇన్స్పెక్షన్ ఉంది. రికార్డ్స్ అప్డేట్ చేసుకోవడంలో టైమే తెలియలేదనుకో" కొంచెం సముదాయింపు ధోరణిలో అంది సంయుక్త. "ఇప్పుడు మీ తమ్ముడి మొహం వెయ్యి వాట్స్ బల్బులా వెలుగుతుందనుకొండి" అంటూనే వాళ్ళ వదినా అన్నయ్యల మధ్య దూరిపోయింది అర్చన.

సంయుక్త రాఖీ కట్టి తను తెచ్చిన స్వీట్ తినిపించింది. అర్చన అన్నయ్య పిల్లలతో పెద్దగా చనువు లేనందున బోర్‌గా ఫీలైన అనురాగ్ వర్షితలు తొందర పెట్టడంతో "ఒరేయ్ మాధవ్ వెళ్ళొస్తానంటూ లేచింది. "అదేంటి వదినా భోజనం చేయకుండా వెళ్ళడమేంటి? ఓ అరగంటాగండి. కాటరింగ్ వాడు వచ్చేస్తాడు." అంది అర్చన.

"లేదు అర్చన. ఆయనొచ్చేటైమైంది. వెళ్ళాలి. ఎలాగూ రాత్రి తినేది చపాతీనే. పిండి తడిపే వచ్చా. పిల్లలు సాండ్ విచ్ ఆర్డర్ చేసుకున్నారు." అంది సంయుక్త.

"వదినా! మీరు నన్ను చాలా డిసప్పాయింట్ చేస్తున్నారు. ఉండండి బొట్టు పెడతాను."

"ఇంకా ఈ ఫార్మాలిటీస్ అవసరమా అర్చన" అన్నది సంయుక్త.

"అలా అంటారేం వదినా! ఎన్నేళ్ళైనా మీ అక్కాతమ్ముళ్ళ అనుబంధం తరుగుతుందేమిటి?

మీరు రాఖీ కట్టకమానరు. మీ తమ్ముడేమో చీర ఇవ్వక మానడు." అంటూనే బొట్టు పెట్టి కవర్ చేతి కందించింది అర్చన. యాంత్రికంగానే ఆ కవర్‌ను అందుకొని" వెళ్ళొస్తానంటూ తమ్ముడికి చెప్పి బయటపడ్డారు ముగ్గురు. కారు ఇంటి వైపు దూసుకెళ్తుంటె ఆలోచనలు గతాన్ని వెతుక్కున్నాయి.

ఆ ఒక్క రాఖీ పౌర్ణమే కాదు. అలాంటి ఎన్నో రాఖీ పౌర్ణములు చాలా వేగంగా ప్రయాణం చేస్తూ వెళ్ళి పోయాయి. ఇటు సంయుక్త పిల్లలు అటు మాధవ్ పిల్లల చదువులైపోవడమే కాదు.

మంచి ఉద్యోగాలు వాళ్ళను అమెరికా పంపించేసినై. సంయుక్త సాగర్‌లు చాలా ఇష్టంగా కట్టుకున్న ఇంట్లో ఇద్దరుగా మిగిలిపోయారు. ఇప్పుడు వాళ్ళు ఇంటి ముందు ఆవరణలో మామిడి అరటి నేరేడు సీతాఫల్ జామ చెట్లకు నీరు పారిస్తూ... వెనకాల ఉన్న ఆకు కూరలు పెంచడంలో మునిగి పోయారు. వాటిని పిల్లలను పెంచినంత జాగ్రత్తగా చూసుకుంటున్నారు. పిల్లలు దూరమయ్యారన్న దిగులును దూరం చేసుకునే ప్రయత్నంతో పాటు ఎంతో కొంత ఊరటఏదైనా కావచ్చు.రెండూ కావచ్చు. కాలం మరింత వేగాన్ని పెంచింది. ఉరుములు మెరుపులు లేని వర్షంలా అనురాగ్ ఒకానొకనాడు ఓ అమెరికా అమ్మాయితో ఊడిపడ్డాడు మా పెళ్ళైందంటూ. జరిగిన జరుగుతున్న సంఘటనలను అంగీకరించాలని నిర్ణయించుకున్నా ఏదో అలజడి. తమ పెద్దరికం నిలుపుకోదలిచి.... తమ కొడుకు పెళ్లిని పరిచయం చేయడంలో భాగంగా బంధు మిత్రులకు ఓ విందు ఏర్పాటు చేసారు. తమ ప్రమేయం లేకుండా జరిగిన కొడుకు పెళ్లిని జీర్ణించుకుంటుండగానే వర్షిత నుండి తానో అబ్బాయిని ప్రేమిస్తున్నట్లు కబురొచ్చింది.

"ఏమ్మా వర్షితా! ఇంతకీ ఎవరా అబ్బాయి? ఏ ఊరు? వాళ్ళ తల్లిదండ్రులు కుటుంబ పూర్వాపరాలు తెలుసుకున్నావా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది సంయుక్త.

"ఏంటమ్మ నీ సోది. కశ్యప్ మా ఆఫీసులోనే పని చేస్తున్నాడు. చాలా మంచివాడు. మేమిద్దరమూ అమెరికావాసులం. వాళ్ళ కుటుంబంతో మనకేం పని చెప్పు?." విసుగ్గా సమాధానమిచ్చింది వర్షిత. కూతురు భవిష్యత్తు భద్రంగా ఉండాలని సంయుక్త ఆవేదన. అది అర్థం చేసుకునే స్థితిలో లేదు వర్షిత. అంగీకారం తెలుపడం నామ మాత్రమైనా బంగారం బట్టలు.. పెట్టు పోతలు అన్నీ పద్ధతిగా అడిగి మరీ చేయించుకుంది వర్షిత. అనురాగ్ మాత్రం ఆఫీస్ పనుల వల్ల రాలేకపోతున్నానంటూ ఓ వెయ్యి డాలర్లు పంపించాడు.

"ఏవండీ చూసారా? అనుబంధమంతా డాలర్లుగా మారిపోయింది. చెల్లి పెళ్ళి దగ్గరుండి జరిపించాల్సిన అన్న డబ్బులు పంపి చేతులు దులిపేసుకున్నాడు." బాధతో అంది సంయుక్త.

"పరిస్థితులు మారినై. వాటికనుగుణంగా మనం సర్దుకపోవాలి. తప్పదు. వాళ్ళ ఉద్యోగ పరిస్థితులు మనకు తెలియవు కదా!" మనసులో అసంతృప్తి ఉన్నా పైకి మాత్రం అనునయ వాక్యాలు పలికాడు సాగర్.

"కాక ఏం చేయగలం లెండి" అంది సంయుక్త. ఏ లాంఛనాలు తక్కువ కాకుండా పెళ్ళి ఘనంగా చేసారు. పెళ్ళికి మాధవ్ అర్చనలు రానైతే వచ్చారు. వాళ్ళ వ్యవహారం ఏదో చుట్టం చూపులా తప్ప మేనమామ అతని భార్యలా కనబడలేదు మంగళ సూత్రాలను అందరిచే ముట్టించడం వంటి తంతు తప్ప. చెప్పాలంటే సంయుక్త సాగర్‌ల ఆత్మీయ స్నేహితులే వెన్నుదన్నుగా నిలబడడంతో ఏ ఆటంకాలు లేకుండా పెళ్ళి సవ్యంగా జరిగింది. ఒక వారం రోజుల లోపు వర్షిత కశ్యప్‌లు బాక్ టు పెవిలియన్ అంటూ అమెరికా చెక్కేసారు.

ఇల్లంతా బోసిపోయింది. రెక్కలొచ్చిన

> **సంయుక్త రాఖీ కట్టి తను తెచ్చిన స్వీట్ తినిపించింది. అర్చన అన్నయ్య పిల్లలతో పెద్దగా రాపోర్ట్ లేనందున బోర్‌గా ఫీలైన అనురాగ్ వర్షితలు తొందర పెట్టడంతో "ఒరేయ్ మాధవ్ వెళ్ళొస్తానంటూ లేచింది. "అదేంటి వదినా భోజనం చేయకుండా వెళ్ళడమేంటి? ఓ అరగంటాగండి. కాటరింగ్ వాడు వచ్చేస్తాడు." అంది అర్చన.**

పక్షులు ఎగిరిపోక తప్పదనే వాస్తవం తెలిసిందే. ఐనా ఆ వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోతున్నారా భార్యాభర్తలు. మనసు మనసులో లేదు. రోజులు యాంత్రికంగా అడుగులు వేస్తున్నాయి. ఐనా వాటి ప్రయాణం సాగుతునే ఉంది. ఓ సంవత్సరం అలా దొర్లుకుంటూ వెళ్ళిపోయింది. ఓ రోజు పొద్దున్నే పేపర్ చదువుతూ రాజకీయాలను చర్చిస్తున్న సాగర్ సంయుక్తలను సెల్‌ఫోన్ నన్ను పట్టించుకోమంటూ గోల పెట్టింది. ఇంత పొద్దున్నే ఎవరై ఉంటారని ఆలోచించిన సంయుక్తను సెల్‌ఫోన్‌లో బాల్య మిత్రురాలు రంజిత పలుకరించింది. ఆ పలకరింపు చర్చా గోష్ఠిలా సాగిపోతుండగా...

"సంయుక్తా! వాకింగ్‌కు వెళు తున్నాను. తలుపేసుకో" అంటూ బయట పడ్డాడు సాగర్. వాకింగ్ చేస్తున్నాడన్న మాటేకాని పిల్లల గురించే ఆలోచన. రైల్వే ట్రాక్ దాటాడు. రోడ్డంతా నిర్మానుష్యంగానే ఉంది. నడక వాకింగ్‌లా లేదు. కాళ్ళను బలవంతంగా ఈడుస్తున్నాడు. అకస్మాత్తుగా ఎదురుగా రెండు బుల్లెట్ బండ్లు. పక్కపక్కనే. అదేం విచిత్రమో వాటిని నడుపుతున్న మహానుభావుల చేతులు చెట్టాపట్టాలేసుకొని ఉన్నాయి. ఆ బండ్ల లైట్లు సాగర్ కళ్ళను మూసుకోమన్నాయి. స్పీడ్ బ్రేకర్‌ను దాటుతున్న ఆ బండ్ల దారి తప్పాయి. కుడివైపు దూసుకురావడమే కాదు. ఏకంగా సాగర్‌ను పడేసి మరీ ముందుకు దూసుకపోయి నాయి. అవి కూడా మరికొంత దూరం పోయి ఓ చెట్టును ఢీ కొట్టి శవాసనం వేసినై వాటితోపాటు దాని మీదున్న మనుషులునూ. ఏకంగా ఐదు నిమిషాల్లో మూడు ప్రాణాలు గాలిలో కలిసి పోయాయి.

తండ్రి దహనక్రియలకు రాలేకపోయినా అంత్యక్రియలకు అనురాగ్ వర్షితలు రానూ వచ్చారు. పోనూపోయారు. ఇద్దరూ తమ వెంట రమ్మని ఒకటే యాగీ. "చూద్దాంలే.. నాలుగు రోజులు పోనీయండి" అంటూ సరిపెట్టింది. తనన్న నాలుగు రోజులు నాలుగు నెలలైపోయినై. కోడలు పాశ్చాత్య సంస్కృతిలో ఇముడలేనేమో అన్న సందేహం... వర్షిత డెలివరీ టైం కారణాలుగా ఆమె ఉంటున్న టెక్సాస్‌లో అడుగుపెట్టింది. తను వచ్చిన వారం రోజులకు వర్షిత డెలివరీ అయింది. హాస్పిటల్ డెలివరీ టైంలో భర్త మాత్రమే అటెండ్ అవడానికి అనుమతించింది. ఇంట్లో ఎదురుచూపులతో తను మిగిలిపోయింది. నాలుగైదు గంటల నిరీక్షణ తరువాత కూతురు పుట్టిందని లక్షిత పేరు పెట్టామన్న వార్తతో అల్లుడి నుండి ఫోన్. ఆ దేశంలో పుట్టగానే పేరు పుడుతారనే విషయం అప్పుడు గాని గుర్తు రాలేదు సంయుక్తకు. మనవరాలు పుట్టిందన్న వార్త సంతోషాన్ని మోసుకొచ్చినా మనవరాలికి పెట్టే పేరు ప్రస్తావన తన దగ్గర రాకపోవడం ఏ మూలనో కలుక్కుమంది. నో వర్క్.... నో పేమెంట్ రూల్ వల్ల వర్షిత నెల రోజులకే ఆఫీసు వెళ్ళక తప్పలేదు. ఇద్దరూ ఉద్యోగస్తులే. పని మనుషులు లేని దేశం. బట్టలు.. బాసండ్లు.. వంటపని ఇంటిపని సమస్తం స్వయంగా చేసుకోవలసిందే. చూస్తూ చూస్తూ కూతురికే వదిలేయలేక పోయింది. పైగా చంటిపిల్లొకతి. అలా అని వయసు మనసు సహకరించకపోవడంతో ఆపనులకు పూర్తి న్యాయం చేయలేక పోయింది. మాట్లాడేవారు కరువు. ఎటుపోవాలన్న పిల్లలపై ఆధారపడి తీరాలి. పోని పిల్లలేమైనా పలకరిస్తారా అంటే అదీ లేదు. అలసిపోయిన శరీరాలు.. సెల్‌ఫోన్‌కు అంకితమైపోయిన మనసులు.. ఈ చెవ్వు మాట ఆ చెవ్వుకు వినపడని సంస్కృతుల నీడలు. వీక్ ఎండ్స్ ఏ సైట్ సీయింగ్ కాని బయటికి వెళ్ళినా అన్నీ శూన్య దృక్కులే. మనసంతా సాగరమయమే. బాగుండదని న్యూయార్క్‌లో ఉన్న కొడుకు దగ్గర ఉండి వచ్చింది. ఆపై ఆరు నెలల గడువు ముగియటంతో ఇండియాకు తిరుగు ముఖం పట్టింది సంయుక్త. మనసు చాలా విచిత్రమైంది. ఏదో కోరుకుంటుంది. కోరుకున్నది చేరువైనా మళ్ళీ ఏదో అసంతృప్తి. పరాయి దేశంలో అసౌకర్యం సరే. మరి ఇండియాలో... తన ఊర్లో... తన ఇంట్లో.. ఎందుకీ పరిస్థితి. ఎడతెగని ఆలోచనలు.

చిన్నతనంలో తాతయ్య.. నానమ్మ అమ్మా.. నాన్న.. తమ్ముడు.. తను.. వచ్చిపోయే బంధువులు ఎనలేని హాయి. పరిస్థితుల వల్ల క్రమంగా పుట్టిన ఊరితో సంబంధం తగ్గిపోయింది. అమ్మా నాన్న పట్టణంలో తమ్ముడి సంసారంలో చేరుకన్నాక ఏంటో అది పుట్టింటి వాసనలా అనిపించలేదు.

నాదైన సంసారంలో మునిగిపోయి ఒకవైపు ఉద్యోగం మరోవైపు పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన సద్యోగంతో సతమతమై వాళ్ళ చదువులు పూర్తై ఉద్యోగాలలో స్థిరపడగానే ఊపిరి పీల్చుకుందామనుకున్న. అడ్డాలనాడు బిడ్డలు కాని గడ్డాలనాడా అన్నట్లు తమ ఉన్నతికి బాధ్యతను అంగీకరించిన ఆ మనసులు పెళ్ళి పిల్లల విషయంలో తమ ప్రమేయాన్ని కాదు పొమ్మన్నారు. దురదృష్టం వెంటాడి సహచరుణ్ణి దూరం చేసింది. క్రమంగా జీవితంలోని సంబంధాలన్నీ పిడికిట్లో ఇసుకలా జారిపోయాయి. తను మాత్రం రేణువులా మిగిలిపోయింది. అది కూడా జారడానికి ఇంకెంతో కాలం పట్టదేమో అన్న ఆలోచన ఆమెను వెంటాడుతుంది. శాశ్వత నిద్రకు ఎదిరిచూస్తున్న ఆమెకు రోజువారి నిద్ర ససేమిరా రానంది.

కవిత

# ఆమె కూడా మనిషే



డా॥ టి. రాధాకృష్ణమాచార్యులు, 98493 05871

ఆమె
స్వతంత్ర స్వయంచాలకంగా
కనపడుతుంది
కానీ
నిజ జీవితంలో పరాధీన శక్తిగా
వినపడుతుందింకా..

నాగరికత నీడలో
మగువ నడక సొంతమనే భ్రమ
వెనుక దాగున్నది మగవాని ముసుగు
ఆకాశంలో సగంగా
ఆమె
నిజంగా నేలపైనే చెదిరిన చిరునామా

సాహిత్యాకాశంలో సగంగా
గర్వించింది సాహితీ లోకం
అక్షరాల ఆమె పత్తా ఎక్కడో!
మేల్ జెండర్ ఈసూ ఊసులో
పెరిగిన కొత్త అణచివేతకు బలి
చదివినా లేకున్నా జరుగుబాటిదే

ఆమె అవని రూపం
ఓర్పు ఆమెకు నేడు శాపం

మనిషంటే కేవలం మగవాడే కాదు
ఆమె కూడా మనిషే అర్థమైతే
ఆర్థిక సంబంధాల్లో
ఆమె ఉద్యోగ సంపాదనలో కూడా
ఆమె స్థానం నిజంగా ఎక్కడ

మార్పు అనివార్యం
ఆమె అసమానమైనా
సమానత కోసం
కన్నీరో కదనమో నిత్య సత్యం
ఎన్ని అంతర్జాతీయ మహిళల
ఉత్సవాలు చేసుకున్నా
అంతా కంటి తుడుపు చర్యలానే

సంకల్పం సన్నని దారంలా కాదు
గుండెలను కుదిపేసే ధైర్యమై రావాలి
అప్పుడే మహిళకు
మహిలో గౌరవ సమానత్వం వచ్చేది
సహజంగా స్థిరంగా బతికేది
వనిత మనసు నిండా మురిసేది
ఆదరణ పొందేది ఆత్మ నిబ్బరంగా

వ్యాసం

# సహృదయ విమర్శకులు... డా॥ మచ్చ హరిదాసు

విమర్శలో లోతులు వెతికిన వ్యాసం...



ఎర్రోజు వెంకటేశ్వర్లు
94925 57037

తెలుగు సాహిత్యంలో ప్రాచీన ఆధునిక సాహిత్యాలను సమదృష్టితో పరిశీలించేవారి సంఖ్య తగ్గుతుంది. ఎందుకంటే ఆధునిక సాహిత్యాన్ని ఆకాశానికెత్తేసి ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేయకుండానే వీలైనంత పాతాళానికి తొక్కేయాలని చూసేవాళ్లు కొందరు.

ఆధునిక సాహిత్యంలో ఏమీలేదని, ప్రాచీన సాహిత్యంలోనే అన్నీ ఉన్నాయని, ఆ సాహిత్యమే సంజీవని అని అత్యుక్తులు చెప్పేవారు ఇంకొందరు. ప్రాచీనార్వాచీన సాహిత్యాలపై సమీక్షలు, ముందు మాటలు, విమర్శ వ్యాసాలు, పరిచయాత్మక వ్యాసాలు, అభినందన వ్యాసాలు, లాక్షణిక వ్యాసాలు వచన కవిత్వ విమర్శలు పరిశోధనా వ్యాసాలు.

ఇలా ఎన్నో వ్యాసాలు సమన్వయ దృష్టితో రాసి, ప్రాచీన ఆధునిక సాహిత్యాలకు వారధిగా నిల్చారు.

తెలుగులో యాత్రా చరిత్రలపై వెలువడిన మొట్టమొదటి పరిశోధన గ్రంథం హరిదాసు గారిదే. డాక్టర్ ఎన్.గోపి వేమన పద్యాలను పరిశీలించి, పరిశోధన చేసి ప్రపంచానికి చాటారు. అలాగే హరిదాసు సుమతి పద్యాలు నిశితంగా పరిశీలించి, పరిశోధించి కొత్త పద్యాలను, దానిలోని సాహిత్య వైశిష్ట్యాన్ని సాహితీ లోకానికి పరిచయం చేశారు 'తథ్యము సుమతీ' గ్రంథం ద్వారా. అంతేకాక వ్యాస



లహరి, అష్టాదశ వంటి గ్రంథాల్లో విమర్శనాత్మక వ్యాసాలు, యాత్రా రచనల సూచి, గోరుకొయ్యలు (నానీలు) మొదలైన రచనలు చేశారు. తెలుగు సాహిత్యంలో ప్రచార కాంక్ష లేని సాహితీ వేత్తల్లో వీరు ముందు వరసలో ఉంటారు.

ఇటీవల 'అష్టాదశ' సాహిత్య విమర్శ వ్యాసాల్ని ప్రచురించారు. దీనిలో 18 వ్యాసాలున్నాయి. భాగవత మూల్యాలు, కవి జనాశ్రయం, సకల నీతి సమ్మతం, వివిధ శతకాలు, డా.ఎన్.గోపి యాత్ర రచనలు, అనుమాండ్ల భూమయ్య గారి రచనలు, యాత్ర సాహిత్యం, నిషిద్ధాక్షరి మొదలైన వాటిపై వివిధ దృక్కోణాల్లో విశ్లేషించారు హరిదాసు.

తెలుగు సాహిత్యంలో శతకాల తర్వాత బహుళ జనాదరణ పొందిన గ్రంథం భాగవతం. అందులో భక్తి, రక్తితో పాటు నీతి, జీవన విలువలు మొదలైనవి కనిపిస్తాయి. వీటిని వెలికితీసి, వివరించారు "భాగవతం- మానవ మూల్యాలు - భక్తి తత్వం" అనే సుదీర్ఘ వ్యాసంలో హరిదాసు. ప్రతివారికి శీలమే ప్రధానమని ప్రహ్లాదుని కథ ద్వారా బోధించారు. శీలం అంటే సుగుణ సంపద అని చెప్పారు. రంతిదేవుని కథను ఉదాహరిస్తూ, "అన్నము లేదు కొన్ని మధురాంబులున్నవి..." అనే ప్రసిద్ధ పద్యాన్ని ఉటంకించారు. రంతిదేవుని దానగుణాన్ని సోదాహరణంగా వివరించారు. క్షమా గుణానికి ద్రౌపది ప్రతీకని అశ్వత్థామ కథ ద్వారా నిరూపించారు. తృప్తిని మించిన సంపద లేదని 'వడుగాయెవ్వరి వాడవెవ్వడవు.. 'కారే రాజులు..' మొదలైన పద్యాలను ఉదాహరిస్తూ బలి చక్రవర్తి కథ ద్వారా తెలిపారు. శుక్రాచార్యుడు చెప్పిన ధర్మసూక్ష్మాలను ప్రస్తుత సమాజానికి సమన్వయం చేస్తూ వివరించారు. 'అహింసా పరమో ధర్మః' అంటే ఇతరులపై అకారణంగా దౌర్జన్యం చేయకపోవడం ఎవరైనా మనపై దాడికి పూనుకుంటే ముఖం పగిలిపోయేలా జవాబు చెప్పడమే ఈ కాలపు అహింసా పద్ధతి అని ప్రస్తుత వ్యవస్థకు తగినట్లు మార్చి చెప్పిన తీరు బాగుంది. ఏనుగు కథ ద్వారా గురూపదేశం యొక్క

అంతరార్థాన్ని వివరించారు. గర్వము, కామక్రోధాదులను తరిమివేస్తే, మనసు ప్రసన్నమౌతుంది. అప్పుడే జీవ కారుణ్య బుద్ధి, భూతదయ కలుగుతాయని ప్రహ్లాదుడు చెప్పిన విషయాన్ని ప్రస్తుత సమాజంలో పాటిస్తే బాగుంటుందని విశదీకరించారు.

'జీవకోటికి సేవ చేస్తే భగవంతుని సేవించినట్లే, అంటే దేశభక్తి కలవానికి దైవానుగ్రహం తప్పక లభిస్తుందని' (పేజి 4) చెప్పినారు. మానవ సేవే మాధవసేవ అనే తత్త్వమే భాగవతం సందేశమని, సులభశైలిలో బోధించారు. దీనిలోని ఏ ఏ విషయాలను ప్రస్తుత సమాజం ఏవిధంగా అన్వయించుకోవచ్చో అరటిపండు ఒలిచినట్లు ప్రవచించారు రచయిత.

తెలుగు భాషలో రాయబడిన తొలి గ్రంథం కవిజనాశ్రయం. దీని కర్త 10వ శతాబ్దికి చెందిన మల్లియ రేచన. అది ఛందశ్శాస్త్రానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథం. ఈ రచనలో సహాయకుడిగా జినవల్లభుడు పేరును రేచన కీర్తించాడని రచయిత పేర్కొన్నారు. "ఏయది హృద్యమనవద్యము "అన్న నన్నయ కావ్య నిర్వచన పద్యం దీనికి అనుసరణమని చెప్పవచ్చునని పరిశోధనాత్మకంగా తెలిపారు వ్యాసకర్త. ఏయే గణాలతో పద్యం ప్రారంభిస్తే ఎలాంటి ఫలితాలుంటాయో రేచన చెప్తూ, ముఖ్యంగా మగణ ప్రయోగం శుభాన్ని భగణం సుఖాన్ని కలిగిస్తుందని రేచన చెప్పిన మాటను గుర్తుచేశారు. నన్నయ భారతం, నన్నెచోడుని కుమార సంభవం, తిక్కన నిర్వచనోత్తర రామాయణం, ఎఱ్ఱన హరివంశం, పోతన మహాభాగవతం, పెద్దన మనుచరిత్ర.. ఇలా ఎందరో ప్రసిద్ధ కవులు 'మ' గణంతో కావ్యారంభం చేశారని ఉదహరించారు. రేచన కవిజనాశ్రయాన్ని మగణంతో ప్రారంభించడం వల్ల పైన చెప్పిన కవులతో పాటు తెలుగు ఛందో గ్రంథాలన్నింటి పైన ఈ ప్రభావం పడిందంటారు రచయిత. రేచన యతి ప్రాసలను వడి,ప్రావడి అన్నాడనీ, యతికి విరతి, విశ్రాంతి, విరామం.. (సంజ్ఞ28).




మొదలైన పర్యాయ పదాలనిచ్చాడనీ, స్వర, వర్గ, సరస, ఎక్కటి వళ్లు అని నాలుగు వర్గాలుగా విభజించి చూపాడని సోదాహరణంగా వివరించారు.

లాక్షణికులు 1 నుంచి 26 వరకు అక్షర సంఖ్యను నిర్ణయించారు. వీటికి ఉక్తి ఛందం నుండి ఉత్కృతి ఛందం వరకు పేర్లున్నాయి. 26 అక్షరాల కంటే మించిన పాదాలున్న ఛందాలకు పేర్లను వివరిస్తూ, సమవృత్త, అర్ధ సమవృత్త, విషమ వృత్తాధికారాలు మూడు రకాలని, దీనిలోని ఉప విభాగాలను కూడా సోదాహరణంగా పేర్కొన్నారు. ఈ 26 ఛందాలలో మొత్తం 13,42,17,726 వృత్తాలు నిష్పన్నమవు తాయని ప్రస్తారం వల్ల తెలుస్తుందని విశదీకరించారు. తెలుగు సాహిత్య చరిత్రలో మల్లియ రేచన ఆదికవి అని పేర్కొన్నారు. లాక్షణికుడైనప్పటికీ రేచన లక్ష్య లక్షణ పద్యాలు కూడా రాయడం వల్ల వ్యాసకర్త ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసి ఉంటారు.

కరీంనగర్ ప్రాంతంలోని రామగిరి ప్రాంతం నివాసి మడికి సింగన తెలుగులో తొలి సంకలన గ్రంథం సకలనీతి సమ్మతం వెలువరించారు. దీన్ని రామగిరి దుర్గంలోని కేశవ నాథునికి అంకితం చేశారు. దీనిలో కామందక నీతిసారం, పంచతంత్రం, పురుషార్థసారం, బద్దెన నీతులు, మహాభారతం.. మ నుండి ఎక్కువ సంఖ్యలో పద్యాలు స్వీకరించాడు. మడికి సింగన రాసినవి కేవలం 39 పద్యాలే. 'మదీయము 'పేరుతో వీటితో కలిపి మధ్య మధ్యలో చొప్పించాడనీ, ఇందులో అర్థశాస్త్రం, రాజనీతి, షాడశ సంధులు, సప్తవిధ ఉపాయాలు, సప్త వ్యసనాలు, శకున శాస్త్రం మొదలైన 47 అంశాలను వర్గులుగా చేసి చెప్పారని తెలిపారు. సంకలన గ్రంథ రచనకు సింగన ఆద్యుడని చెప్పారు. దీనిని మూడు ఆశ్వాసాలుగా విభజించాడనీ, ప్రథమార్థం 289, ద్వితీయ, తృతీయాశ్వాసాల్లో 352 చొప్పున మొత్తం 993 గద్య పద్యాలు సమకూర్చాడనీ తెలిపారు. "అమర వేల్పులచే.." అనే పద్యం నీతితారావళి లోనిది పేర్కొనబడింది. కానీ మల్లియ రేచన కవి జనాశ్రయంలో ఉన్నదని, "వ్యవసాయము కొలదియు..." పద్యం బద్దెన నీతిలోనిదన్నాడు సింగన. కానీ కేయూర బాహు చరిత్రలోనిదని వ్యాసకర్త తెలిపారు. అధికుడైన వాని.. పంచ తంత్రంలో చెప్పిన భావాన్నే "అల్పుడైన వాని కధికారమిచ్చిన.." అనే పద్యంలో వేమన అల్పుని గురించి చెప్పారని, తులనాత్మకంగా చూపించారు. ఇందులో పేర్కొన్న పంచతంత్రంలోని పద్యాలకు సుమతి వేమన పద్యాలు ఉన్న దగ్గరి సంబంధాన్ని, అ సోదాహరణంగా వివరించారు. అప్పటికి ఇప్పటికి పదాల్లో వచ్చిన మార్పులను (జీతం-జీవితం) తెలియజెప్పారు.

తెలుగులో సంపూర్ణ శతక లక్షణాలు కలిగిన మొదటి శతకం సోమన వృషాధిప శతకం. సోమన శతక వైశిష్ట్యం గురించి "వృషాధిప శతకం-ఒక విశ్లేషణ" అనే వ్యాసంలో ఇలా విశ్లేషించారు. దీనిలో బసవా! బసవా! బసవా! వృషాధిపా! అనే అనే మకుటం కలిగి ఉత్పలమాల చంపకమాల పద్యాలతో సాగే దైవస్తుతి శతకమనీ, ఇందులో 3/4 వంతు పద్యాలు వృషాధిపుని స్తుతిస్తూ, సాగాయని

చెప్పినారు. భక్తులైన మగవారి చివర పేర్ల చివర అయ్య అనీ, ఆడువారి పేర్ల చివర అవ్వ (సుంకవ్వ, కాళవ్వ, గగ్గయ్య మొ..) అనీ తెలుగు పదాల విశేషాలు తగిలించడం సోమన ప్రత్యేకత'. (పేజి 107) అన్నారు. "త్ర్యక్ష సదృక్ష సంచిత దయాక్ష... మహా ప్రతి పక్ష మహోక్ష ..."(6) ఇలా సంస్కృత దీర్ఘ సమాసాలతో సాగుతోంది పద్యం. క్ష కారం చాలా సార్లు ఆవృత్తం కావడంవల్ల చమత్కార వంతమైన అర్థావబోధ కలుగుతుంది. ఈ విధమైన శబ్దాలంకార ప్రయోగంలో పాల్కుర్కి సోమన్న ప్రథమ గణ్యుడు. పోతన వంటి కవులు తర్వాత ఈ మార్గాన్ని అనుసరించాలని హరిదాసు తెలిపారు.

17వ శతాబ్దికి చెందిన కంచర్ల గోపన్న మేనమామలు అక్కన్న మాదన్నల సహకారంతో తహసీల్దారుగా నియమించ బడ్డాడు. ప్రజల పన్నులతో భద్రాచలంలో రామాలయం కట్టి జైలుపాలయ్యాడు. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. అలాంటి గోపన్న దాశరథీ శతకం రాసి, భక్త కవిగా, రామదాసుగా పేరు గడించారు. ఈ శతకంలో దాశరథీ కరుణాపయోనిధీ అనే మకుటంతో 103 పద్యాలున్నాయి. ఈ శతకంలో "చక్కెర లప్పకున్ మిగుల..." (పద్యం 28 పేజి 75) పద్యంలో పటిక బెల్లం తీపి, ప్రియురాలి పెదవుల తీపి, తేనెలోని తీపి కంటే రామ నామ మధురామృతమే బహుతీపి అని రామదాసు చెప్పిన విషయాన్ని చక్కగా వివరించారు. దాశరథీ శతకం-ఒక పరామర్శ అన్న ఈ వ్యాసంలో గొప్ప నైన ధారాశుద్ధి, అందంగా పొదిగిన అలంకారాలు, భావ సౌందర్యం లలిత లలితమైన సమాస ఘటన, అందమైన పదబంధాలు శతక మంతటా కోకొల్లలుగా కనిపిస్తాయని పేర్కొన్నారు వ్యాసకర్త.

ఒక పరిశోధకుడికి ఉండవలసిన నిజమైన లక్షణం నిరంతర శోధన, దృఢ దీక్ష. అది "తెలుగులో యాత్ర సాహిత్యం" వ్యాసంలో పుష్కలంగా కనిపిస్తుంది. యాత్ర రచన ఒక సాహితీ ప్రక్రియగా విస్తరించడానికి, నిలదొక్కుకోవడానికి వివిధ యాత్ర చరిత్ర వ్యాసాల ద్వారా కృషి చేస్తున్నారు.

ప్రముఖ కవి విమర్శకులు ప్రొ. అనుమాండ్ల భూమయ్య బహు గ్రంథకర్త. వీరి విమర్శ రెండు రకాలుగా ఉంటుంది. 1 భౌమ మార్గ విమర్శ 2 సైద్ధాంతిక మార్గ విమర్శ. మన ఉపనిషత్తుల సారాన్ని బాగా జీర్ణించుకుని అందులోని సంభాషణాత్మక లేదా ప్రశ్నోత్తర పద్ధతిని కొన్ని విమర్శ గ్రంథాల్లో ప్రవేశపెట్టారు. ఈ ధోరణికే ఆచార్య చేకూరి రామారావు భౌమమార్గం అన్నారు. మొదటి కావ్యమైన వేయి నదుల వెలుగులోని పద్యాలు చదివితే సౌందర్య లహరి, లలితా సహస్ర నామాలతో ఉన్న అనుబంధం తేటతెల్ల మవుతుందని ఉదాహరణ పూర్వకంగా వివరించారు.

హరిదాసు సహాధ్యాయి డా.ఎన్.గోపి గారు. గోపి విదేశీ యాత్ర సాహిత్యం అనే వ్యాసంలో గోపి సందర్శించిన మారిషస్, సైప్రస్, అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ దేశాల యాత్ర రచనలన్నీ రమణీయమైన ధారాళమైన వచన శైలిలో సాగిపోతాయని, భావ నవ్యత అపూర్వంగా ఉంటుందని, ప్రత్యేకంగా ప్రతీకలు వాడడం వల్ల ఈ గ్రంథాలకు జవజీవాలు కల్పించారని పేర్కొన్నారు.

భూమయ్య మరో విశిష్ట కావ్యం త్రిజట. త్రిజట - కావ్య పరిశీలన వ్యాసంలో త్రిజట సీతను తన గురువుగా భావించి రామదర్శనాన్ని లోవెలుగుగా నింపుకొని మురిసిపోవడం కవి కల్పనా చమత్కృతికి తార్కాణమని తెలిపారు కఠోపనిషత్ 1-3-3 త్రిజట (104) ముండకోపనిషత్తు 2-2-6 ( పద్యం 98) శ్లోకాలతో పద్యాల్ని తులనాత్మక పరిశీలన చేసి చూపారు. దీనిద్వారా వ్యాసకర్త సంస్కృత తెలుగు సాహిత్య అధ్యయన విస్తృతి తేటతెల్లమవుతుంది. హరిదాసు గారి విమర్శనాత్మక ప్రతిభకు నిదర్శనం ఈ వ్యాసం.

తెలుగులో స్త్రీవాద రచయిత్రిగా ప్రసిద్ధి చెందిన మందరపు హైమవతి రాసిన నిషిద్ధాక్షరి కవితా సంపుటిపై 'నిషిద్ధాక్షరి నామ సార్థక్యం' అనే పేరుతో రాసిన వ్యాసంలో "పైపైన చూస్తే ఇది ఒక విభిన్న కవితా శీర్షికల సమాహారం లాగా కనిపిస్తున్నా, నిజానికి హారంలో దారం లాగా స్త్రీలు నిత్యజీవితంలో అనుభవిస్తున్న అగచాట్ల గురించిన ఇతివృత్తాలు ఈ సంపుటిలో దర్శనమిస్తాయని" చెప్పారు. 'నేనొక పసిపాపనై' అన్న కవితలో హైమావతి భావాన్ని పాటిబండ్ల రజిని భావాల సామ్యం చెప్పి రెండు కవితల్లో ఉన్న సారూప్యతను ఉటంకిం చడం ఆయన అధ్యయన విస్తృతికి నిదర్శనంగా చెప్పవచ్చు.

'నూతన ప్రయోగానికి స్వాగతం!' అనే వ్యాసంలో కశప విశిష్టత గురించి, 'శతక సందేశం' వ్యాసంలో శతకద్వయంలోని సారాంశాన్ని విహంగవీక్షణం చేశారు.'సత్య దర్శనం 'గ్రంథంలోని మినీ కవితల గురించి వివరించారు రచయిత.

అష్టాదశ సాహిత్య విమర్శనా వ్యాసాలను పరిశీలిస్తే ప్రాచీన సాహిత్యం లోని అంశాలను నేటి సమాజానికి ఏ విధంగా సమన్వయం చేసుకోవచ్చో సోదాహరణంగా వివరించిన తీరు, లక్షణ గ్రంథాల్లోని రహస్యాలను దూది పింజలా విప్పి చెప్పడం, శతకాల్లోని రచనా రీతులను లోతుగా అధ్యయనం చేసి చెప్పడం, ఆధునిక కావ్యాల్లోని వైశిష్ట్యాన్ని సునిశిత పరిశీలించడం కనిపిస్తుంది. యాత్ర సాహిత్యాన్ని పరిశోధనాత్మక దృష్టితో విశ్లేషించడం సాహితీవేత్తలను ఆకట్టుకుంటుంది. హరిదాసు విమర్శ సకారాత్మకంగా కనిపిస్తుంది. అవసరమైన చోట తన దృష్టికి వచ్చిన దోషాలను కూడ సున్నితంగా ఎత్తి చూపడం ఆయన ప్రత్యేకత. అందుకే డా. మచ్చ హరిదాసు సహృదయ సమన్వయ విమర్శకు డనవచ్చు. వీరికి ఇటీవలే విమర్శ రంగంలో తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం లభించింది.

కవిత

# నెలపొడుపు



దేవనపల్లి వీణావాణి, 99513 31122

నిన్నటిదాకా
పాదాలకు వెదురు బద్దలు కడితే
ఇంటి చూరుకు వేలాడిన
లిల్లీ పూలన్నీ లిల్లీపుట్లు

వెంట్రుకకు కూడా గాలి తాకకూడదు
కన్నుతో లోకం చూడడానికి మాత్రమే
పొగల తెర

ఉమ్మెత్తరసంతో చితికెక్కిన సతి

బొట్టు కూడా వెక్కిరిస్తే
బోడి తలలై పండి పోలేదా

అమ్మకాలు, కొనుగోళ్లు
వరకట్నాలు, కన్యాశుల్కాలు
లేత పెళ్లిళ్లు
ఉరితాళ్ళు, చెరువులు
ఉత్త చేదు బావులు కదా

గొంతులో వడ్లగింజలతోనో కాకపోతే
కడుపులోనే నలిపివేస్తేనో
మళ్లీ భూమిలోకే
లేత పిందెలు తొంగి చూసాయి
విత్తనానికే అమ్మతనం
ఆమె చిరునవ్వు రాలిపడి
నందనవనం విరిసిందెక్కడ
ఖండాంతరాలనిండా
ఆమె రక్తం మరకలే
ఎటుచూసినా ఉప్పు సముద్రాల ఈతలే

2
మెదళ్లకు
ఎడారి విస్తరించింది
తడిలేని గుండెల వికృతాలకు
పసిదేహాలు..
అయ్యో అవిప్పుడు బొగ్గు ముక్కలు

ఆమ్ల విఘాతాలు
చెరిగిన విధి గీతలు

అవయవ మార్కెట్లకు
నెత్తుటి రాతలకు
ఆమె అక్రమ రవాణా
చేయగలిగిన కొత్త వస్తువు

కెమెరా శత్రువు
కన్ను మనదే, వేలు మనదే
ఒక్క నొక్కుతో బతుకు
అక్కరకురాని చెదల చెక్కలు

ఆమెకు గాయం పాతదే
కత్తులే కొత్తవి

3
ఆమె
అంతటా ఆమె
ఆమె అమ్మ

ఆమెకు బతుకు లేదు
అమ్మ..
అమ్మోరుగా మారితే తప్ప..

భూమికి శాంతి లేదు
కొత్త నెలపొడుపై ఉదయిస్తే తప్ప

# భూమి గుండ్రం...

**పనివాని హాస్యంలో కనిపించే ధైన్యం చెప్పే కథ...**



దొండపాటి కృష్ణ
90523 26864

తాను చూస్తున్న ఈ ప్రపంచాన్ని తనతో పాటుగా నలుగురికీ చూపించాలన్న ఉత్సాహంతో సిద్ధమైపోయాడు సూరీడు. అతని ఆశలపై నీళ్ళు చల్లుతూ పొగమంచు పరచుకుంది. హిమాలయాల్లో గాలులు ఎక్కువుగా వీస్తున్నాయి. అవి ఒకచోట స్థిరంగా లేకుండా హైదరాబాదునూ పలకరించి కలవరం పెడుతున్నాయి. మార్గశిరపు చలి వణికించేస్తుంది. అయినాగానీ సూర్యునితోపాటే సిద్ధమైపోయే వాహనాలు కొన్ని బయలుదేరాయి. అందులో జగదీష్ ట్రాలీ బండి కూడా ఉంది.

కొత్తగా ప్రభుత్వం వారు అందించిన ఆ వాహనంలో తమ దైనందిన జీవితాన్ని కొనసాగిస్తున్నారు. పేరుకు ప్రభుత్వ ఉద్యోగమే అయినా మహారాజపోషకులు మాత్రం ప్రజలే! ఒక్కో ఇంటికి/రూముకు నెలకు డెబ్బై రూపాయలు చొప్పున చెత్త తీసుకెళ్ళినందుకు వారికి ఇస్తుంటారు. అతను బండి నడిపితే ఆ బండి వెనక కూర్చున్న నాగమణి, నాగలక్ష్మిలు తమ పని తాము చేస్తుంటారు. దాదాపు ఇరవై సూపర్ సంచులతో కలిపి కుట్టిన ఒక పెద్ద సంచిని ఆ ట్రాలీ బండికి వెనక కట్టాడు జగదీష్. పనికిరాని వస్తువులు బండిలో ఒకవైపుకు వెళ్తే, పనికొచ్చే కొన్ని వస్తువులు ఆ పెద్ద సంచులోకి వెళ్తాయి.

స్కూటర్ బండ్లమీద, ఆటోల్లో కూరగాయలు అమ్మే వాళ్ళ దగ్గర్నుంచి పూలు అమ్మే వాళ్ళ వరకూ వీధి వీధి తిరిగి పిలవడానికి బదులుగా 'విషయాన్ని' చిన్న సైజు మైకులో ఫీడ్ చేసుకుంటున్నారు. కొత్త సాంకేతికతను అందిపుచ్చుకునే జగదీష్ కూడా ఈల బుర్ర శబ్దాన్ని మైకులో ఫీడ్ చేసుకున్నాడు. ప్రతి నాలుగు ఇళ్ళకు చిన్న బటన్ నొక్కిపెట్టి ఉంచుతాడు. అది కర్ణ కఠోరమైన శబ్దంగా పరిణమిస్తుంది. అతను ఎక్కువసేపు ఎదురుచూస్తూ కూర్చోవాల్సిన పని లేకుండా పని జరిగిపోతుంది. అటువంటి వింత శబ్దం అతన్నుంచి కాక ఇంకెవరి నుంచీ రాదని ఆ కాలనీ వాసులకు ఎరుకే. ఈ పద్ధతి అతనికి కొంత సాంత్వననిచ్చింది.

చలికి దుప్పట్లలో ముసుగుదన్ని పడుకున్న ఆ కాలనీ జనాలకు జగదీష్ ఈల బుర్ర శబ్దం చెవిలో జోరీగలా మోగుతూనే ఉంది. అతని బండితో అవసరం లేనివాళ్ళు 'ఇంత పొద్దున్నే పడుకోనీయకుండా ఇదేం గోలరా బాబోయ్' అనుకుంటున్నారు. అవసరం ఉన్నవాళ్ళు 'అప్పుడే వచ్చేశాడా' అని హడావుడి పడుతున్నారు. తొందర లేనివాళ్ళు మాత్రం 'ఇంత పొద్దున్నే ఎవడు లేస్తాడు? రేపు చూసుకోవచ్చులే... లేదా బయట పారేయ్యొచ్చులే' అనుకుంటున్నారు.

ఒక్కో వీధి దాటుకుంటూ వెళ్తున్న ఆ బండిలో కొంతమందిపై నుంచి చెత్త ఉన్న కవర్లను పడేస్తున్నారు. మరికొంత మంది ఇంటి గేట్ల ముందు డస్ట్ బిన్‌లను పెట్టేస్తున్నారు. జగదీష్ కిందకి దిగి వాటిని ఆ బండిలో పోసి, ఎక్కడి డబ్బాలు అక్కడ పెట్టేస్తున్నాడు. ఆ కవర్లలో తమకి పనికివచ్చేవి ఉన్నవో, లేవో అని చాలా శ్రద్ధగా పరీక్షిస్తున్నారు మణి, లక్ష్మిలు. చేతిలో ఉన్న ఇనుప చువ్వలతో కవర్లను విడదీస్తున్నారు. పనికివచ్చే ప్లాస్టిక్ కవర్లను, ఇనుప సామాన్లను, పాడైపోయిన వస్తువులను వేరుగా తీసి ఆ పెద్ద సంచిలో వేస్తున్నారు. పనికిరాని చెత్త చెదారాన్ని, డైపర్లు లాంటి వాటిని అలాగే వదిలేస్తున్నారు.

"ఏమే, నీకెన్నిసార్లు చెప్పాలి నావైపు పడ్డ కవర్లు కెలకొద్దని?" విసుక్కుంది మణి.

"సొంత అక్కవి కదా, ఏదో కూతంత సాయం చేద్దామని సూత్తాంటే...." దీర్ఘాలు తీసింది లక్ష్మి.

"నాకు తెలుసులేవే... నువ్వే బాగా పని చేత్తన్నట్లు బావ దగ్గర కలరింగ్ ఇవ్వడానికేగా...?" అంది మణి.

"ఒకే తల్లి బిడ్డలం... నేను ఎందుకలా అనుకుంటాను?" మణితో చెప్పి, "చూడు బావా... అక్క ఏమంటుందో..." భర్తను పిలిచింది లక్ష్మి. వాళ్ళ సంభాషణను

వింటున్న జగదీష్ 'రోజా ఉండేదేగా...' అనుకుని నవ్వుకున్నాడు.

★ ★ ★

బండి నిండిపోవడంతో అంత వరకు నిండిన చెత్తను నగరానికి వెలుపల పారేసి రావడానికి వీధి మలుపు తిప్పాడు జగదీష్. అప్పుడే దబ్బుమన్న శబ్దం వినిపించింది. ఉలిక్కిపడి చూశారు అక్కాచెల్లెళ్లు... ఎక్కడో విసిరేసినట్లు ఉండే మూల ఇంటి నుంచి ఒకామె చెత్త ఉన్న కవర్‌ను విసిరేసింది. ఆ ఇంటి దగ్గరికి వెళ్లి చెత్త తీసుకోడు జగదీష్. నెలవారీ డబ్బులూ తీసుకోడు. ఆ కవర్ వాళ్ళ మీద పడనందుకు సంతోషించారు. ఉలిక్కిపడేలా చేసినందుకు ఆక్రోశించారు. తర్వాత ఇనుప చువ్వలతో దాన్ని విప్పసాగారు.

బండి ఆ కాలనీని దాటేసి మెయిన్ రోడ్డు మీదకు వచ్చేసింది. నాగలక్ష్మి మొహంలో ఆనందం తొంగి చూసింది. ఆ వస్తువును మురిపెంగా చేతిలోకి తీసుకుంది. ఇంకా ఏమన్నా ఉంటాయేమోనని ఇనుప చువ్వను పక్కనపెట్టి చేతితోనే కెలకసాగింది. అది గమనించిన నాగమణి మొహంలో ఆశ్చర్యం కదలాడింది.

**యుద్ధంలో గెలిచిన సైనికుడిలా పొగమంచుతో పోరాటంలో గెలిచిన సూరీడు ఎంతో సంబరంగా పరిగెత్తాడు. పుంజుకున్న శక్తి, కాంతి కిరణాల రూపంలో ఆ కాలనీ అంతా ప్రసరించింది. ఆ కాంతికి లక్ష్మి చేతిలో ఉన్న వస్తువు తళుక్కున మెరిసింది. వెంటనే పైట కొంగుతో దాన్ని శుభ్రం చేసింది. వెయ్యి వోల్టుల ఆనందంతో దాన్ని ముద్దు పెట్టుకుని జాకెట్లో వేసుకుంది.**

యుద్ధంలో గెలిచిన సైనికుడిలా పొగమంచుతో పోరాటంలో గెలిచిన సూరీడు ఎంతో సంబరంగా పరిగెత్తాడు. పుంజుకున్న శక్తి, కాంతి కిరణాల రూపంలో ఆ కాలనీ అంతా ప్రసరించింది. ఆ కాంతికి లక్ష్మి చేతిలో ఉన్న వస్తువు తళుక్కున మెరిసింది. వెంటనే పైట కొంగుతో దాన్ని శుభ్రం చేసింది. వెయ్యి వోల్టుల ఆనందంతో దాన్ని ముద్దు పెట్టుకుని జాకెట్లో వేసుకుంది.

"బావా..." వెనకనుంచి ఇనుప చువ్వతో సైడ్ డోర్ కొడుతూ భర్తను పిలిచింది లక్ష్మి.

"ఏంటి?" అడిగాడు జగదీష్, బండిని నెమ్మది చేస్తూ...

"కూతంత బండిని పక్కకు ఆపు..." అంది లక్ష్మి.

"ఇప్పుడెందుకే..." విసుక్కున్నాడు జగదీష్.

"ఇది చూడు..." జాకెట్లో నుంచి గొలుసు బయటకు తీసింది లక్ష్మి.

జగదీష్ కళ్ళు విప్పారాయి. గబగబా డోర్ తీసి కిందకి దిగాడు. లక్ష్మి చేతిలో ఉన్న గొలుసును తీసుకుని పరీక్షించాడు. అతని అదృష్టానికి సంబరపడిపోయాడు. దాన్ని అమ్మగా వచ్చిన డబ్బుల్తో ఊళ్ళో అప్పులు తీర్చేయ్యొచ్చనుకున్నాడు.

"ఎవరు పడేశారు? ఎక్కడ దొరికింది?" అడిగాడు జగదీష్.

"ఆ మూల ఇంట్లో మొగుడు వదిలేసిన రవళి ఉంది కదా... ఆమె వేసిన చెత్త కవర్లో ఉంది" అనవాళ్ళు చెప్పింది నాగమణి. ఆ పరిసరాలు గుర్తు రాగానే జగదీష్ మనసులో అనుమానాలు సుడులు తిరిగాయి.

వాటిని కప్పి పెడుతూ, "పేరుకు తగ్గట్లే నీ చేతిలో ఏది పడినా లక్ష్మి దేవత తాండవం చేయాల్సిందే..." మెచ్చుకుంటూ లక్ష్మి బుగ్గల్ని కొరికేశాడు. సిగ్గుల మొగ్గై పోయింది లక్ష్మి.

"అంతేలే... నేనంటే నీకు మోజు పోయింది. అదేం చేసినా నీకిట్టమే... నేనేం చేసినా వంకలు పెడతావ్. పెట్టుకో... దాన్నే ముద్దు పెట్టుకో..." మూతి ముడిచింది మణి.

"అది కాదే బంగారం... నేనెక్కడ నీకు సవితిని తెస్తానోనని మమ్మల్ని అందరినీ ఒప్పించి దీన్ని కట్టబెట్టింది నువ్వే కదా... దీని కంటే నువ్వంటేనే నాకు ఇది..." అంటూ మణికి కూడా ముద్దు ఇచ్చాడు జగదీష్.

"అబ్బా... ముద్దుల్తో మాయ చేద్దామనుకున్నావా? ఆ గొలుసు అమ్మి మాకేం ఇస్తున్నావో చెప్పు..." అడిగింది మణి.

ఆ మాటకు, "దీన్ని అమ్మడం



కథ

దేనికక్కా? నేనే మెళ్ళో ఏసుకుంటా... రెండో పెళ్ళాన్నని నాకేం పెట్టలేదు. నేనేం అడగలేదు కూడా... నా బాధను నేను దిగమింగుకున్నాను. బావని అడిగితే గొలుసు కొంటానన్నాడు. ఇంత వరకు కొనలేదు. ఇక కొనొద్దు కానీ ఈ గొలుసును నేను ఏసుకుంటా...” ఖరాఖండిగా చెప్పింది లక్ష్మి. అప్పులు తీర్చొచ్చు అనుకున్నది మరలా వాయిదా పడేలా ఉందనుకున్నాడు జగదీష్.

“ఒసేయ్ పిచ్చి మొహం... నువ్వు మెళ్ళో ఏసుకున్నావే అనుకో... రవళి కంట పడిందో అనుకో... మొదటికే మోసం. అందుకే చెప్తున్నా... దీన్ని అమ్మేద్దాం.” మణి అసలు విషయం చెప్పడంతో అతనిలో జ్ఞానజ్యోతి మేల్కొంది.

“నువ్వన్నది నిజమే. దీన్ని అమ్మేద్దాం. మన అప్పులు తీరిపోతాయ్” మనసులో మాట బయట పెట్టాడు జగదీష్.

“ఇప్పుడు అవేం కుదరవ్. ఎప్పుడు చూసినా ఏదో ఒకటి చెప్పి మమ్మల్ని మాయ చేత్తన్నావ్. అప్పులు తీరడం లేదు. మాకు ఏదీ దక్కడం లేదు. ఏం జేత్తన్నావో... ఏంటో... ఈసారి మాత్రం దీన్ని అమ్మగా వచ్చిన డబ్బుల్తో మాకు నగలు కొనాల్సిందే...” పట్టుబట్టింది మణి.

“అదేం కుదరదు. ఇది నాది. వేరే నగ మార్పు చేయించుకుంటా. ఎవరికీ వాటా లేదు...” తన వాదన వినిపించింది లక్ష్మి.

అప్పులు తీర్చాలని జగదీష్... తనకి వాటా లేకపోయినా ఫర్వాలేదు, కనీసం ఫ్రిడ్జ్ అయినా కొనాలని మణి... కొత్త నగ కావాలని లక్ష్మి... పావుగంట సేపు ముగ్గురూ ఒక నిర్ణయానికి రాలేకపోయారు. ఎవరూ పంతాన్ని విడువలేదు. విషయం ఎంతకూ తెగలేదు. సొంత అక్కాచెల్లెల్లే బంగారం విషయంలో పరాయి వాళ్ళలాగా వాదించుకోసాగారు. అంత పెద్దది, ఖరీదైనది బంగారం అంటే వారికి అందని ద్రాక్షపండే... అందుకే ఒక నిర్ణయానికొచ్చాడు జగదీష్.

“ఆపండీ...” అని గట్టిగా అరిచాడు. పురావస్తు శాఖ వారిలాగా అప్పటిదాకా పురాణమంతా తవ్వుకుంటున్న అక్కాచెల్లెళ్లు, అతని అరుపుతో వారి నోటికి తాళాలు వేసుకున్నారు.

“ఇదిట్టా తేలేది కాదు. నేనో మాట చెప్తున్నా. దానికి కట్టుబడి ఉందాం...” అన్నాడు. మరలా ఏం తిరకాసు పెడుతున్నాడోనని అతనివంక అనుమానంగా చూశారు అక్కాచెల్లెళ్లు.

“ఎవరికైతే ముందు పిల్లలు పుడతారో, వారికే ఈ గొలుసు...” నిర్ణయాన్ని ప్రకటించాడు జగదీష్. సమ్మతించింది నాగలక్ష్మి.

“అదెట్టా కుదురుద్ది? ఇది నాకన్నా ఎనిమిదేళ్ళు చిన్నది. దీనికే పిల్లలు పుడతారు. నాకు పుట్టరనే కదా దీన్నిచ్చి చేసింది. నీకన్నీ తెలుసు... నా మాటకు ఇలువ లేదు...” ఏడుపు అందుకుంది నాగమణి.

“అబ్బా... నీ వయసుకు, పిల్లలు పుట్టడానికి సంబంధమే లేదు. ఉండి ఉంటే మనూర్లో ఆ వాణికి పెళ్ళైన పదహారేళ్ళకు పిల్లలు పుట్టేవాళ్ళా? మీ చెల్లిని ఒప్పించడానికే అలా అన్నాను. నువ్వు అడ్డుపడితే నేనేం చేయలేను. చూడు, రోడ్డుమీద వెళ్ళేవాళ్ళు ఎంతమంది మనవైపు అనుమానంగా సూత్తన్నారో...” అంటూ నాగమణి చెవిలో చెప్పి ఒప్పించాడు జగదీష్.

ఆ క్షణంతో ఆ కార్యక్రమానికి ఫుల్ స్టాప్ పెట్టేశాడు సామరస్యంగా... బండిని స్టార్ట్ చేశాడు జగదీష్. ముందుగా తనకే సంతానం కలుగుతుందని, ఆ గొలుసు తనకే దక్కి తీరుతుందని గట్టి నమ్మకంతో నాగలక్ష్మి మొహం వెలిగిపోతోంది. వాణిని గుర్తు చేసుకుని ఇప్పటికైనా తనకి సంతానం కలగాలని దేవుళ్ళను మొక్కే పనిలో పడింది నాగమణి.

**ఆ మాటకు,** **“దీన్ని అమ్మడం దేనికక్కా? నేనే మెళ్ళో ఏసుకుంటా... రెండో పెళ్ళాన్నని నాకేం పెట్టలేదు. నేనేం అడగలేదు కూడా... నా బాధను నేను దిగమింగుకున్నాను. బావని అడిగితే గొలుసు కొంటానన్నాడు. ఇంత వరకు కొనలేదు. ఇక కొనొద్దు కానీ ఈ గొలుసును నేను ఏసుకుంటా...” ఖరాఖండిగా చెప్పింది లక్ష్మి. అప్పులు తీర్చొచ్చు అనుకున్నది మరలా వాయిదా పడేలా ఉందనుకున్నాడు జగదీష్.**



★ ★ ★

తమ ఒప్పందం ప్రకారం గొలుసును ఎవరూ తీయడానికి వీల్లేదని కొయ్య పెట్టెలో పెట్టాడు జగదీష్. రోజుకొకసారి దాన్ని బయటకు తీసి చూడాలనేది నాగలక్ష్మి. నాగమణి కూడా చెల్లెలుకు వంత పాడడంతో రోజూ దాన్ని కళ్ళారా చూసుకుని లోపల పెట్టసాగారు. అది చూస్తూ, పిల్లల్ని కనే పనిలో ఉండమని సరదాగా ఆటపట్టించేవాడు జగదీష్. బంగారం మీద చెల్లెలుకున్న ప్రేమకు ఆశ్చర్యపోయేది నాగమణి. దురదృష్టవశాత్తూ ఆ గొలుసు కనిపించకుండాపోతే చెల్లెలు ఏమైపోతుందో అనే ఆలోచన వస్తుండేది.

నాగమణి ఆలోచనల ఫలితమో, నాగలక్ష్మి దురదృష్టమోకానీ రెండు నెలల తర్వాత గొలుసు కనిపించలేదు. సమయానికి జగదీష్ కూడా లేడు. నెల వారీ డబ్బులు తీసుకురావడానికి వెళ్తున్నాని చెప్పి వెళ్ళాడు. అక్కాచెల్లెళ్ల గుండెల్లో రాయి పడింది. ఇంట్లో అణువణువూ శోధించారు. ఎక్కడా

కనిపించలేదు. కళ్ళకు బూతద్దాలు పెట్టుకుని ఒకటికి నాలుగు సార్లు వెతికారు. ఫలితం లేకపోయింది.

"ఇదంతా నీ పనే కదక్కా..." ఏడుపును ఆశ్రయించింది నాగలక్ష్మి.

"బుద్దుండే మాట్లాడుతున్నావా? నా అనుమానం నీ మీదే!" సీరియస్ అయ్యింది నాగమణి.

"నాకు గొలుసు దొరికిన దగ్గర్నుంచి నీ వాలకం చూస్తూనే ఉన్నా. నాతో ఇదిగా ఉంటున్నావ్. నువ్వే దాచేసి ఉంటావ్. ఇచ్చేయ్... కనీసం నీకు చిన్న ఉంగరమైనా ఉంది కదా" బ్రతిమాలింది నాగలక్ష్మి.

"ఆ గొలుసు మీద నీకెంత మోజుందో నాకు తెలుసు. అది నీకు కాకుండా పోతుందని, నువ్వే దాచేసి, ఇప్పుడు ఏమీ తెలియనట్లు నాటకాలాడుతున్నావ్. బావని రానీయ్... నీ సంగతి తెల్చేస్తా..." బెదిరించింది నాగమణి.

"బావ వచ్చేదాకా ఎందుకే... ఇప్పుడే ఫోన్ చేసి నీ యవ్వారం బయట పెడతాను" అంటూ ఫోన్ అందుకుంది నాగలక్ష్మి.

**"ఆ గొలుసు మీద నీకెంత మోజుందో నాకు తెలుసు. అది నీకు కాకుండా పోతుందని, నువ్వే దాచేసి, ఇప్పుడు ఏమీ తెలియనట్లు నాటకాలాడుతున్నావ్. బావని రానీయ్... నీ సంగతి తెల్చేస్తా..." బెదిరించింది నాగమణి. "నాకు గొలుసు దొరికిన దగ్గర్నుంచి నీ వాలకం చూస్తూనే ఉన్నా.**

ఫోన్ రింగయ్యింది. మంచి పనిలో ఉన్న జగదీష్ చూసుకోలేదు.

నాగలక్ష్మి మరలా చేసింది.

ఫోన్ ఉందన్న స్పృహలోనే లేడు జగదీష్. ఊపిరి సలపని పనికి అతని ఒళ్లంతా చెమటలు పట్టేశాయి.

ఎడతెరిపి లేకుండా చేస్తూనే ఉంది నాగలక్ష్మి.

ఒంట్లో ఛార్జింగ్ అయిపోయిన జగదీష్ విశ్రాంతిని ఆశ్రయించాడు. అతని ఫోన్ కూడా ఛార్జింగ్ అయిపోయి విశ్రాంతి తీసుకుంటోంది. సమయం ఎంతయ్యిందో చూడడానికి చేతిలోకి ఫోన్ తీసుకున్నాడు. వెక్కిరించింది ఫోన్.

"ఛీ... ఎదవది... ఛార్జింగ్ ఇప్పుడే అయిపోవాలా... అవసరమైనప్పుడే మొరాయిస్తుంది" అంటూ బట్టలు వేసుకున్నాడు.

"అవునవును... ఎవరైనా అంతే..." దెప్పిపొడిచింది ఆమె.

"అట్లా అలగకే... ఎప్పట్నుంచో దాచుకున్న డబ్బుతో నీకీ గొలుసు తెచ్చాను" అంటూ ఆమె మెడలో వేశాడు జగదీష్.

'ఇది రమేష్ ఇచ్చినట్లుందే... పోయిందనుకున్నా... వీడు నిజంగానే కొన్నాడా? కొట్టేశాడా?' స్వగతంగా అనుకుంటూ గొలుసును క్షుణ్ణంగా పరిశీలించే పనిలో పడింది రవళి.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికననుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

# నాలుగు దశాబ్దాల కాలనాళిక "లేంబాళ వాటిక కథలు"!

పిన్నంశెట్టి కథాకథన వైఖరి చిత్రించిన వ్యాసం....



సంకేపల్లి నాగేంద్రశర్మ
80748 26371

కొంతమంది రచయితలకి మొదటి ప్రయత్నంలోనే అన్ని విధాలా కలిసివస్తుంది, ఎందుకంటే ఆ రచయితలో నిబిడీకృతమై ఉన్న ఆలోచనల్ని పదునుగా, లోతుగా తీర్చిదిద్దడానికి చేసిన సుదీర్ఘ నేపథ్యపు కృషిని పరిగణనలోనికి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ ఆలోచనలను ఒక్క దారికి తెస్తూ, అక్షరీకృతం చేయడంలో సఫలీకృతులయ్యారు. కథల్లో సామాన్యుల సామాజిక జన జీవన చరిత్రను రికార్డు చేయడానికి రచయిత మేధో మదనం చేసినట్లు కనబడింది. తన బహు ముఖీనమైన నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఇదే తగిన వేదికగా (ప్రక్రియగా) మలుచుకొన్నట్లు విదితమవుతోంది.

పిన్నంశెట్టి కిషన్ లేంబాళ వాటిక కథలు పేరిట తన స్వగ్రామమైన వేములవాడ క్షేత్రంలో స్వకీయ జీవిత అనుభవాలను, అనుభూతులను, విన్నవి, కన్నవి గూర్చి చక్కగా విశ్లేషిస్తూ ఇతి వృత్తాలుగా రాశారు. తన బాల్యాన్ని, యవ్వనాన్ని, మిత్రుల సాహచర్యాన్ని, వివిధ సంఘటనల్లో పండిస్తూ, సామాజిక కోణంలో 44 కథల్ని చక్కగా రాశారు. వాసిలో, రాశిలో తన కుశలతను చూపారు. గత నెల కిందటే అచ్చులోకి తెచ్చారు. ఈ కథలను ప్రముఖ కథా రచయిత తుమ్మేటి రఘోత్తమరెడ్డి ఫేస్‌బుక్ వాల్‌పై పోస్ట్ చేసేవారు.



ఇందులోని పలు కథలు తంగేడు పక్ష పత్రికలో ప్రచురితమై, పాఠకాదరణ పొందాయి.

ఈ కథల్లో నవ్యతతో పాటు, తెలంగాణా జీవ భాష, సామెతలు, పెద్దలు చెప్పిన సత్యాలు, కొత్త పదబంధాలు, వాడుక పదాలు, నలుబై ఏళ్ళ సామాజిక జీవితం, ఉపమాన ఉపమేయాలు పుష్కలం. అంతేకాక రచయిత కుటుంబ జీవితం, మిత్రులతో ఆటపాటలు, వాళ్ళ అపసోపాలు, ఆనందాలు, విప్లవాలు, కల్లోలాలు, దొరల ఆగడాలు, రాజకీయాలు, స్థానీయతల సంస్కృతి, పండుగలు, పబ్బాలు, జాతరలు, అచల గురుబోధ మొదలగునవన్నీ రివైండ్ అవుతుంటాయి.

రచయిత కవి కావడం వల్ల వాక్యాల్లో కవిత్వపు పరిమళాలు వీస్తాయి. హాస్యం, వ్యంగ్యం, శృంగారం, వినోదం, విషాదం, అల్లరి, చిలిపితనం, ప్రేమ, అమాయకత్వం, హార్రర్ వంటి నవరసాలు, వస్తు వైవిధ్యం, ఏక బిగిన చదివించే శైలీ పాఠకున్ని ఉక్కిరి బిక్కిరి చేస్తాయి.

కవితా పంక్తుల్ని కథా శీర్షికగా తీసుకొని భేషనిపించుకొంటాడు. అంగట్లో బెల్లం శీర్షిక గల రెండు కథలకు రెండు కాలాల వర్ణనతో, టైమ్ లూప్ కథలు రాసి మెప్పించాడు.. కథా శీర్షికలకు అలంకార యుక్త వాక్యాల పేర్లు పెడుతూ, సరికొత్త ప్రయోగాలకు పూనుకోవడంలో రచయిత ఔచిత్యాన్ని ప్రదర్శించారని అనుకోవాలి. నైరూప్య చిత్రాల్లాగా కొన్ని ముగింపులను పాఠకులకే వదిలేస్తాడు. కథా కథన పద్ధతిని కొన్ని చోట్ల చైతన్య ప్రవంతిలో మలిచారు. కథల్లో రచయిత హీరో, సైడ్ హీరోగా ఉంటూనే కథాంశాలపైన ఎక్కువ దృష్టి సారించడంతో కథలు వైయుక్తికం కాకుండా జాగ్రత్తపడ్డాడు.

వాకిలిలోని రంగవల్లిలా వేములవాడ గుడిని అందమైన కవర్ పేజీగా తెచ్చి, తన కథలను చదవడానికి పాఠకులను ముగ్గులోకి లాక్కుంటాడు. వేములవాడ గూర్చి, భౌతిక, చారిత్రక, సాహిత్య, సామాజిక, రాజకీయ, ఆర్థిక పరంగా వర్ణిస్తూ అయిదు పేజీల్లో "ఊరి పటం"

శీర్షికన ఒక చక్కటి వ్యాసం రాశారు. కథలు చదివే ముందు ఈ వ్యాసం చదివితే పాఠకులకు కథల పరమార్థం సులభంగా అర్థమై పోతుంది. కథల్లో వేములవాడ చుట్టూ ఉన్న పరిసరాలే ప్రధానం కాగా, ఒకటి రెండు కథలు సిరిసిల్లా, కరీంనగర్, హైదరాబాద్ చుట్టూ తిరుగుతాయి. కథల్లో వర్ణనలు, వస్తువు, పోలికలు, సామెతలు, సూక్తులు, హితోక్తులు, ఆధునిక పదాలు, పాత పదాలు మిళితమై యువ పాఠకున్ని సైతం అలరిస్తాయి. మూలవాగు గూర్చి ఒకటి రెండు కథలు అల్లుతూనే, వేములవాడ అభివృద్ధి వాగు దాటని రాజకీయమని వ్యంగ్యాన్ని గురి చూసి కొడతారు. వేములవాడ క్షేత్రాన్ని లేంబాళ వాటిక అని శాసనాల్లో, రాజన్నగుడి సుప్రభాతంలో పేర్కొనబడడం చేత, రచయిత చతురతతో లేంబాళ వాటిక కథలు అని నామకరణం చేశారు.

బొంబాయి ప్రయాణాన్ని, బొంబాయి లోని తన బాల్య జీవితాన్ని రచయిత చుక్ చుక్ బండి, ఊరు పిలుస్తోంది కథల్లో రాశారు. యాభై ఏళ్ళ కిందట వేములవాడ నుండి బొంబాయి వెళ్ళా లంటే చేయాల్సిన ప్రయాణపు అనుభ వాన్ని పాఠకులతో పంచుకొంటాడు. కామారెడ్డికి బస్ లో వెళ్లి అక్కడ రైలెక్కి మరొక మన్మాడ్ స్టేషన్‌లో దిగి, మరో రైల్ మారి బొంబాయి చేరాల్సి ఉంటుంది. కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో తొలిసారిగా రైల్ చూసి, ఎక్కిన అనుభవాన్ని, బొంబాయిలో పద్మశాలీల వలస బతుకులను, అక్కడి పాఠశాల వాతావరణాన్ని చెబుతూ, స్వేచ్ఛ లేని బొంబాయి సిటీ ప్రవాసం నచ్చక, తాత, చిన్నితో మంకు పట్టు పట్టి, తిరిగి వాపస్ రావడం కథాంశం. వేములవాడలో పల్లె మట్టి పరిమళాలైన చెట్లు, చేను, చెరువు, ఈతలు, కట్టకాలువ పారుకంతో పాటు గుండం, గుడీ, తడుకల టాకీస్ సిటీలో కనిపించక పోవడంతో సిటీకి పల్లెకి ఉన్న తేడాను తెలుసుకొని పల్లె జీవితమే ఉత్తమమని గ్రహించి, వేములవాడలోని భద్రయ్య బడ్లో చేరి, అక్కడి మిత్రులైన చంద్రకాంత్‌తో స్నేహం ఏర్పడడం, స్వేచ్ఛా జీవితంలోకి ప్రవేశించడంతో కథ ముగుస్తుంది.

రాజన్న గుడి, అనుబంధ దేవాలయాల ప్రస్తావన వీరి కథల్లో నీటి పాయల్లా పారుతుంటాయి. బాల్యంలో చదివిన భద్రయ్య బడిలోని మిడ్డేమీల్స్ గూర్చి, చెబుతూనే, సినిమా చూడడానికి తక్కువ బడిన డబ్బుల కోసం గుండంలో మిత్రులు మునిగి పైసలు సంపాయించిన వైనాన్ని "దేవుని అప్పు" కథలో చక్కగా చిత్రించాడు. యాత్రీకులు వేసిన పైసలను ధర్మగుండానికి పహారా కాసే కాపలా దారుకు కంటబడకుండా ఎట్లా ఏరుకొంటారో ఈ కథ చదివాకే తెలుస్తుంది. సినిమా పోస్టర్లు పాన్ టేలాల గోడలకు ఎట్లా అంటిస్తారో, ఊర్లోని గోకుల్, ప్రకాశ్ టాకీస్‌ల పేర్లు ఇందులో ప్రస్తావనకు వచ్చి, పాఠకులను చిన్ననాటి జ్ఞాపకాల్లోకి తీసుకెడుతాయి. మిత్రుడు ఎడ్ల సురేందర్ కన్నీటి యాదిలో ఈ కథను మలిచాడు. నాటి కాలంలో శృంగార మళయాళ సినిమాల ప్రచారపు మోసాల్ని




**బొంబాయి** ప్రయాణాన్ని, బొంబాయి లోని తన బాల్య జీవితాన్ని రచయిత చుక్ చుక్ బండి, ఊరు పిలుస్తోంది కథల్లో రాశారు. యాభై ఏళ్ళ కిందట వేములవాడ నుండి బొంబాయి వెళ్ళా లంటే చేయాల్సిన ప్రయాణపు అనుభ వాన్ని పాఠకులతో పంచుకొంటాడు. కామారెడ్డికి బస్‌లో వెళ్లి అక్కడ రైలెక్కి మరొక మన్మాడ్ స్టేషన్‌లో దిగి, మరో రైల్ మారి బొంబాయి చేరాల్సి ఉంటుంది.

సిన్మాపాఠం కథలో రచయిత కసిగా వెల్లగక్కుతాడు. సొంత తమ్ముడు సురేష్ అకాల మరణం గూర్చి రాసిన కథ చదివితే కన్నీటి పర్యంతమవుతాం. గుండె జబ్బుల గూర్చి అప్పటి వైద్య విధానాల తీరును ఈ కథ వివరంగా తెలియజేస్తుంది. చికిత్స కొరకు వేములవాడ వైద్యుడు, అచల ప్రబోధకుడు డా.మామిండ్ల రాజయ్య, కరీంనగర్ ప్రముఖ ప్రజా వైద్యుడు డా.దారం నాగభూషణం దగ్గరికి వెళ్ళి రావడం ఈ కథలో కొసమెరుపు.

కథల్లో పండుగల అంశాలను ప్రస్తావిస్తూ రాశారు. దసరా, వినాయక చవితి, హోళి, గోకులాష్టమి పండుగల వేడుకలతో కథలు రాశారు. జీసెస్ అల్లా తేరే నామ్ కథలో వినాయక చవితి, దసరా నవరాత్రుల చందాల ప్రస్తావన తెస్తూ, ఒక వ్యంగ్యాస్త్రాన్ని సంధిస్తూ కథను హాస్యస్ఫోరకంగా అల్లారు. గోగుపువ్వు కథలో హోళీ పండుగ జరుపుకొనే తీరును, తురక కృష్ణుడి కథలో గోకులాష్టమి పండుగప్పుడు కులమతాలకు అతీతంగా ఉట్లు కొట్టే పోటీల తీరును స్థూలంగా వివరిస్తాడు. నాటి వ్యాయామ శాలల్లో విద్యార్థులు, యువకులు పాల్గొనే ఉత్సాహాల అభ్యాసాలకు చక్కటి ఆకృతి నిచ్చాడు. సిరిసిల్లా

రథయాత్ర కథలో సిరిసిల్లాలో ప్రతి ఏటా జరిగే రథాల పున్నమి జాత్రా సంబరాలను హృద్యంగా దృశ్యమానం చేస్తాడు. తండ్రీ కొడుకుల అనుబంధాన్ని, తండ్రి ఆప్యాయతల్ని గుండె తనాబి కథలో తన ఆత్మకథగా రచయిత రాసుకొంటాడు. వానాకాలంలో చెరువులు, బావులు నిండి ఈత రాని పిల్లల పాలిట శాపం కారాదని, ఆటపాటలు, అల్లర్లే కాకుండా, చదువు మీద సైతం బుద్ది పెట్టాలని తండ్రి కొడుకు దగ్గర ఒక కాగితం రాయించు కోవడం ఈ కథలో సారాంశంగా కనబడుతుంది. ఉద్యోగం వచ్చాక తండ్రి కొడుకును పిలిచి, నాటి కాగితాన్ని చూపించి ఆనందపడటం కొసమెరుపుగా చెబుతాడు.

మమతమ్ కథలో హిందూ ముస్లింల మధ్య ఉన్న సఖ్యతానుబంధాన్ని మానవీయ కోణంలో తిరగ రాసి చెబుతాడు. మానవులమే అనే ఏడు పేజీల కథలో.. కూడా మతాల మధ్య ఉన్న సన్నపు విభేదాలను వివరిస్తూనే, ఆపద వచ్చినపుడు అందరూ ఎలా ఏకమవుతారో హృద్యంగా చెబుతాడు. హైదరాబాద్ నుండి వేములవాడ బస్ ప్రయాణపు పదనిసలు ఈ కథ ద్వారా తెలిసి వస్తాయి. బహుమతి కథలో రచయిత చదివిన హైస్కూల్ వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్లు చెబుతూనే, ఆ నాటి ఉపాధ్యాయుల పేర్లు, మిత్రుల ఆగడాలు వెల్లడిస్తాడు. గుడి చెరువుకు నీరు తెచ్చే కట్టకాలువలో చేపలు పట్టే పద్దతిని ఒక చేప కథ కింద చర్చిస్తాడు. గురుభ్యోనమః కథలో పంతుళ్ళు చేసే దందా పనులను వెల్లగక్కుతాడు. డ్యూటీలు మరవక బాధ్యతాయుతంగా బోధించాలని, జూదం పేకాట, చిట్టీలు వంటి అక్రమ దందాలకు అలవాటు పడరాదని ఊరి ఎస్ఐ శేఖర్‌తో హితబోధ చేయించి వదిలి పెడతాడు. దర్నా కథలో సిరిసిల్లా బస్సులకోసం వేములవాడ విద్యార్థులు చేసిన ధర్నా సంఘటనను, పోలీసుల లాఠీచార్జీని, విద్యార్థుల రాజకీయాలను కథగా మార్చి, ఆ కాలపు యాత్రికుల రద్దీ, రద్దీకి అనుగుణంగా సరిపడని ఆర్.టీ.సీ బస్సుల వ్యవహారాల లోపాలను ఏకరువు పెడతాడు. వేములవాడ రాజన్న గుడి వంశ పారంపర్య అర్చకులు ఫుర్ పట్టీతో సహా, తమ హక్కులు కోల్పోయి, బతుకు తెరువుకై అగచాట్లు పడుతున్నతీరును చెంబెడు నీళ్ళు అనే కథలో చక్కగా చర్చించారు. బ్రాహ్మల బతుకుతెరువు పరిస్థితి అయ్యగారి సంపాదన అమ్మగారి పసుపు కుంకుమ పరిమితమై పోయి నట్లుగా ఆర్థికంగా చితికి పోయారని ఆవేదనను వ్యక్త పరుస్తాడు. మిత్రుడు ప్రతాప చంద్రశేఖర్ అర్చకునిగా తీర్థ పోళ్ళతో కల్గిన చేదు అనుభవాల్ని చక్కగా వివరించారు. ఇదే మిత్రునిపై మతి ప్రయోడిస్ట్ అనే మరో కథ రాసి మతి మరుపులో ఉండే తిరకాసు వ్యవహారాల్ని

**మస్కట్ ఏజెంట్ ఎల్లయ్య ఎల్లారావుగా ఎదిగి, తదుపరి వ్యసనాలకు లోనై పేదవాడిగా మారిన తీరును పొంగు కథలో, వేములవాడ దొమ్మరి గుడిసెల వ్యభిచారపు వ్యవహారాన్ని రాసి, వ్యభిచార కూపం నుండి పడతులకు విముక్తి కల్గించిన రీతిని మోక్షం కథగా రచయిత అల్లారు. ఇందులో ఆనాటి వేశ్యా వాటికను, పోలీసుల స్పందనను కథలో ఇమిడ్చి ఆనాటి సామాజిక జీవితాన్ని రచయిత చక్కగా రికార్డు చేశారు.**

హాస్యరసంగా రక్తి కట్టించాడు.

తన అన్నగారైన పిఎస్ రవీంద్ర గారిపై మూడు కథలు రాశాడు. సునోరసమే అనే కథలో అన్న ఇంకు తయారీని కుటీర పరిశ్రమగా మార్చే విధానంలో వచ్చిన లోటు పాట్లను, చక్కగా చర్చించాడు. పరిశోధక పాత్రికేయుడిగా తన అన్న వృత్తి ధర్మాన్ని నిర్వర్తించిన తీరుతో రెండు కథలు రాశాడు. మస్కట్ ఏజెంట్ ఎల్లయ్య ఎల్లారావుగా ఎదిగి, తదుపరి వ్యసనాలకు లోనై పేదవాడిగా మారిన తీరును పొంగు కథలో, వేములవాడ దొమ్మరి గుడిసెల వ్యభిచారపు వ్యవహారాన్ని రాసి, వ్యభిచార కూపం నుండి పడతులకు విముక్తి కల్గించిన రీతిని మోక్షం కథగా రచయిత అల్లారు. ఇందులో ఆనాటి వేశ్యా వాటికను, పోలీసుల స్పందనను కథలో ఇమిడ్చి ఆనాటి సామాజిక జీవితాన్ని రచయిత చక్కగా రికార్డు చేశారు. మొదటి హీరో అనే రెండు రకాల కథల్లో మేనమామ మంచె సత్యనారాయణ చెప్పిన ముచ్చట్లను హాస్యంతో కలగలిపి కథలుగా మలిచారు. అంగట్ల బెల్లం పేరున రాసిన రెండు కథల్లో వేములవాడ యాత్రకు వచ్చిన ఒక కుటుంబం గుడిలో మొక్కులు చెల్లించి, పోయే ముందు నిలువెత్తు బెల్లం చెల్లించే మొక్కును యాది మరిచి పోతారు. తెచ్చుకొన్న డబ్బులు ఖర్చయి పోవడంతో గుండంలో చెంబెడు నీళ్ళు తీసుకొని అంగట్లో ఉన్న బెల్లానికి నైవేద్యం పెడతాడు. రెండవ కథలో తూకంలో జరిగే కాంటా మోసాలను ఎరుకపరుస్తాడు. రచయిత తూనికల ఇన్స్పెక్టర్‌గా పనిచేసినందున ఇందులో తన నైపుణ్యాన్ని ప్రదర్శించినట్లు విదితమౌతుంది. ఈ రెండు కథల్లో గుడికి వచ్చే యాత్రికులు ఎలా మొక్కుబడులు తీర్చుకొంటారో, పోచమ్మ బోనాలు ఎలా చెల్లిస్తారో రచయిత పూస గుచ్చినట్లు పాఠకులకు వివరిస్తాడు. "మగది" కథలో వేములవాడ మగ పార్వతుల ప్రత్యేకత లను చెబుతూనే, కొత్తగా వచ్చిన ఒక పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ మోహపరవశుడై ఎలా మోసపోయాడో హాస్యరసాన్ని గుమ్మరిస్తూ చెబుతాడు. ఈ కథకు టైటిలే ప్రాణంగా ఖరారైనట్లుగా అనిపిస్తుంది. పులింగ - స్త్రీలింగ పదాల్ని ఏకం చేసి, థర్డ్ జెండర్ పదాన్ని సృష్టించి, కథ పేరును మగదిగా సెట్ చేయడంలో హాస్యం సద్యోజాతకమవుతుంది.

కాలాయ తస్మైనమః, రైట్ రైట్ కథల్లో ఆ నాటి ప్రయివేట్ (ఎస్ఆర్ఎంటి) ట్రాన్సుపోర్టు బస్సుల నిర్వహణా తీరును వివరిస్తూనే, ఒక నాడు రాజరికం

పుస్తక పరిచయం

చలాయించిన ఒక దొర దంపతుల చెరిగిపోయిన గీతను, పడిపోయిన గ్రాఫ్‌ను అంశంగా తీసుకొని అల్లిన కథ వీరి కథల్లో హైలెట్‌గా నిలిచింది. దొరసాని చివరకు ఒక ఆర్టీసి బస్సులో ఒంటరిదై ప్రయాణిస్తూ కనిపించడం, ఎన్నికలలో ఓడిన అవమాన భారంతో ఓడిన దొర కాల్చుకొని ఆత్మహత్య చేసుకొన్న వార్తను, ఎర్ర జెండాల విప్లవాలను, ఆ నాటి కల్లోలిత ప్రాంత రాజకీయాలను మిళితం చేసి పాఠకులకు చక్కటి విందు భోజనం పెడతాడు. కథల్లో కాలాన్ని రికార్డు చేయడానికే కాలాయ తస్మైనమ: అని పేరును సూచించాడు. దేవాలయంలో జరిగే అవినీతి లొసుగులను కంచికి చేరని కథలో చక్కగా వివరించాడు. రాతిరి పిల్ల కథ హర్రర్ తో సాగుతుంది. ఇందులో దయ్యాలు, పిశాచాలు, స్మశానాల వాతావరణంతో భయంతో మృత్యుబారిన పడిన సంఘటన అంశంతో కథ రాస్తాడు. పంచ్ కళ్యాణి కథలో గుడి చెరువులో స్నానాలు.

వేములవాడ మూలవాగు వర్ష కాలపు వరద సౌందర్యాన్ని చిత్రిస్తూనే, కొట్టుకు వచ్చిన ఒక ఆడ శవం నుండి ఆభరణాలను ఒల్చుకొన్న వార్తను, ఒక సస్పెన్స్ థ్రిల్లర్ కథగా (హర్రర్) చెబుతాడు. సామాన్యం కథలో ఒక ఆర్టీసి కూలి పొట్టకూటికై వివిధ రకాల పనులు చేస్తూ, ఊరిలో అందరికీ తలలో నాలికగా వ్యవహరించిన నైజాన్ని రచయిత అద్భుతంగా చెబుతాడు. శ్రీశ్రీ అన్నట్లు తాజ్‌మహల్ నిర్మాణంలో రాళ్ళెత్తిన కూలీలెవ్వరన్నట్లుగా, ఒక ఆర్టీసి కూలి అష్టల్ జీవితగాథను సామాన్యం కథలో అసామాన్యంగా రికార్డు చేశారు. జడలో జాజులు కథలో కొత్తగా పెళ్ళయిన జంట మధురోహలను, జీవితపు మధురానుభూతులను వివరిస్తాడు. యవ్వనారంభంలో ఒక అందమైన అమ్మాయి ఆకర్షణకు గురైన విధానాన్ని తొలిప్రేమ కథలో సుందరమైన వర్ణనలతో చెబుతాడు. ఆంధ్రనాట్య పాఠశాలలో నృత్య శిక్షణలు ఇచ్చే గురువు బొడపాటి శ్రీనివాసరావు గూర్చిన వివరాలను పొందుపరిచాడు. నడిచే నదిలా తను! తనువు పడవలా నేను! అనెడి కథలో ఒక ప్రేమ జంట ప్రేమలను, వంచనాశిల్పం కథలో అక్రమ సంబంధాల గూర్చి వివరిస్తాడు. శీర్షికలేని కథలో Dylan Thomas కవితా పంక్తుల్ని ప్రయోగాత్మక శీర్షికగా ఎంచుకుని, విఫలమైన ప్రేమికుల జంట ఆత్మార్పణాల్ని కన్నీటి పర్యంగా చిత్రించాడు. తలకు మాసిన పని కథలో ఒక మంగళి వృత్తిలో వచ్చిన మార్పులని ఏకరువు పెడతాడు. లాక్-డవున్ అనే ఏడు పేజీల సుదీర్ఘ కథలో కరోనా కాలంలోకి పరకాయ ప్రవేశం చేస్తాడు. లాక్ డవున్ అవసోపలను, కడుపు మాడ్చుకొన్న పరిస్థితులను వివరించాడు. ఎంతో శ్రమించి ఊరి ముచ్చట్లను కథలుగా అల్లిన పిన్నంశెట్టి కిషన్ అభినందనీయుడు.

కవిత

# మనిషిగా...



డా॥ సి.హెచ్. ఆంజనేయులు, 77025 37453

నూతన జీవనానికి నాంది కావాలి
మనిషి నవోదయం వైపు సాగాలి

విశ్వమంతా జగతి వైపు ఒకే కుటుంబం పై పయనించాలి
ప్రతి పదం కొత్త అడుగులు వేసే పాటలు కావాలి

ప్రతి రోజూ ఉదయం పూట
పక్షులు చెట్లు పువ్వులు వసంతమై వర్ధిల్లాలి

ప్రతి దినం జగతిని జాగృతం చేసే చైతన్య శిఖరమై సాగాలి
ప్రతి వెలుగు దీపిక
జగతికి జ్ఞాన దీపిక కావాలి

ప్రతి మధువు ప్రతి తరువు అందించాలి
ప్రభాతం పక్షుల మేలుకొలుపు గీతమై ఉదయించాలి.

ముఖాముఖి

# కాలం ఏ రచయితనైనా జల్లెడ పడుతుంది....

## - డా॥ వెల్దండి శ్రీధర్

రచనా స్రవంతి వెల్దండితో శీలం... ఈ పక్షం ముఖాముఖి



శీలం భద్రయ్య
98858 38288

సాహిత్య అధ్యాపనం వృత్తిగా, అధ్యయనం, సృజనను ప్రవృత్తిగా చేసుకొన్న బహుముఖీన సాహిత్య కళాజీవి డా. వెల్దండి శ్రీధర్. తెలుగు సహాయాచార్యుడు, పరిశోధకుడు, కవి, కథా రచయిత, విమర్శకుడు, తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ తెలుగు పాఠ్యపుస్తక రచయిత. 'ఊపిరి దీపాలు' (నానీలు), 'పుంజీతం' (కథా సంపుటి) 'ఆసు' కవితాసంపుటి వెల్దండి శ్రీధర్ స్వీయ రచనలు. 2009లో మంజీరా రచయితల సంఘం వారు అందించే రాష్ట్ర స్థాయి 'వట్టికోట ఆళ్వారు స్వామి ఉత్తమ కథాపురస్కారం' శ్రీధర్ రాసిన 'పొక్కిలి' కథకు లభించింది. సారంగ వెబ్ మేగజైన్‌లో గత కొంత కాలంగా ఉత్తమ తెలంగాణ కథలను పరిచయం చేస్తూ 'కథాకచ్చీరు' కాలమ్‌ను నిర్వహిస్తున్నాడు. కొత్త కవులు, రచయితల పుస్తకాలకు ముందుమాటలు రాస్తూ ప్రోత్సహిస్తున్నాడు. సాహిత్య పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి 'సబాల్టర్న్' త్రైమాసిక సాహిత్య సామాజిక పత్రికను నిర్వహిస్తున్నాడు. 2014 నుండి ఏటా తెలంగాణ ఉత్తమ కథల సంకలనాలను వెలువరిస్తూ కొత్త రచయితలను ప్రోత్సహిస్తున్నాడు. ఇటీవలే 2020 సంవత్సరానికిగాను కరోనా బీభత్సాన్ని ప్రతిబింబించే కథలతో 'బుగులు'



కథాసంకలనాన్ని వెలువరించాడు. సమకాలీన తెలుగు సాహిత్యానికి తన సాహిత్య దివ్వెలతో వెలుగులద్దుతున్న డా. వెల్దండి శ్రీధర్‌తో శీలం భద్రయ్య ముఖాముఖి.

**మీ కుటుంబ నేపథ్యం వివరించండి?**

మాది మధ్యతరగతి చేనేత కుటుంబం. మా బాపు వెల్దండి ఒదయ్య ముందు కొన్నేళ్ళు వ్యవసాయం చేసి తరువాత చేనేత వృత్తిలోకి మారాడు. అమ్మ ఈశ్వరమ్మ వ్యవసాయ కూలి. మేము ఇద్దరం అన్నదమ్ములం. మా అన్నయ్య రవీందర్ కొన్నేళ్ళు పవర్‌లూమ్ కార్మికుడిగా పనిచేసి ప్రస్తుతం వ్యాపార రంగలో స్థిరపడ్డాడు. నాకు ఒక అక్కయ్య రాజమణి, ఒక చెల్లెలు సరోజన. వీరిద్దరు గృహిణులే. నా భార్య సురేఖ. ఈమె కూడా గృహిణే. మాకు ఇద్దరు పిల్లలు శివాని, హాసిని. ప్రస్తుతం చదువుకుంటున్నారు. మాది పూర్వపు కరీంనగర్ జిల్లా (ఇప్పుడు సిద్దిపేట) కోహెడ గ్రామం.

**పరిశోధన నుండి సాహిత్యం వైపు ఎలా ఆకర్షితులయ్యారు?**

సాహిత్యం నుండే పరిశోధన వైపు వచ్చాను. చిన్నప్పుడు అన్నీ గ్రామాల్లో వేసిట్టుగానే మా ఊర్లో కూడా హరికథలు, బుర్ర కథలు, వీధి నాటకాలు వేసేవారు. వాటిని ఆసక్తిగా చూసేవాడిని. అలాగే అన్నయ్యతో పాటు మా ఊర్లో దేవాలయాలలో, ఎవరి ఇంట్లోనైనా భజనలు జరుగుతున్నప్పుడు వెళ్ళే వాడిని. అక్కడ పాడే భక్తి పాటలు, పద్యాలు బాగా ఆకర్షించేవి. అప్పుడప్పుడు నేను కూడా అన్నయ్య నేర్పిన భగవద్గీత శ్లోకాలు చదివే వాడిని. పదవ తరగతిలో ముత్తయ్య సారు, డిగ్రీలో పాపయ్య శాస్త్రి గారు పాడే పద్యాలు బాగా శ్రద్ధగా వినేవాడిని. పి.జి.లో డా. ఎన్. గోపి, డా. ఎల్లూరి శివారెడ్డి, డా. నమూస స్వామి, డా. మసన చెన్నప్ప, డా. రుక్నుద్దీన్ గార్ల తెలుగు సాహిత్య పాఠాలు ఎంతో ఇష్టంగా ఉండేవి. మాసాబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యా అధ్యయన సంస్థలో తెలుగు పండిత శిక్షణ చేస్తున్నప్పుడు డా. సరోజన బండ

గారి తెలుగు బోధన పాఠాలు చాలా ఆసక్తిని కలిగించేవి. పీజీలో ఉండగానే 'యువసాహితీ' ఎం. ఏ తెలుగు విద్యార్థుల సాహిత్య సంచికకు రాసిన 'అక్షరాలు ఏడుస్తున్నాయి' అనే గల్పికతో నా రచనా వ్యాసంగం మొదలయింది. తరువాత ఉద్యోగ రీత్యా సిరిసిల్లలో పని చేస్తున్నప్పుడు జూకంటి జగన్నాథం, పెద్దింటి అశోక్ కుమార్, డా. పత్తిపాక మోహన్, జిందం అశోక్, ఆడెపు లక్ష్మణ్, మద్దికుంట లక్ష్మణ్‌ల పరిచయం వల్ల, వారి సాహిత్యాన్ని దగ్గరగా పరిశీలించడం వల్ల మరింత సాహిత్యం పట్ల మక్కువ ఏర్పడింది. సిరిసిల్లలో ఉన్నప్పుడే తొలి కథ 'అమృతవర్షిణి'ని రాశాను. ఇది 2005లో ఆంధ్రజ్యోతి నవ్య వీక్లీలో ప్రచురింపబడింది.

**కవిగా, రచయితగా, విమర్శకుడిగా సాహిత్య సృజన చేస్తున్నారు కదా! ఏది రాస్తున్నప్పుడు సులువుగా అనిపిస్తుంది?**

సాహిత్య సృజనలో ఏ సాహిత్య ప్రక్రియనైనా సులువుగా రాయలేము. లోలోపల ఎంతో తొక్కులాట జరిగిన తరువాతే ఒక వాక్యం బయటకు వస్తుంది. అయితే ఇష్టాయిష్టాలుండవచ్చు. నేను అన్నింటికంటే ఇష్టంగా రాసేది కథే. Spontaneous over flow లాగా అప్పడప్పుడు కవిత్వం రాస్తుంటాను. కథల్లో చెప్పలేని వస్తువులను కవిత్వంలో రాస్తుంటాను. ఇలా అప్పుడప్పుడు రాసిన కవితలతో ఇటీవలే 'ఆసు' కవితా సంపుటి వెలువడింది.

**మీరు కవిత్వాన్ని వదిలి వచన కథా సాహిత్యం, విమర్శ వైపు రావడానికి కారణం?**

కవిత్వాన్ని వదిలి పెట్టలేదు. అయితే పైన చెప్పినట్లు కథలో చెప్పడానికి వీలు కాని వస్తువులను కవిత్వంలో చెప్తుంటాను. చిన్నప్పటి నుంచి కథలు వినడమన్నా, చదవడమన్నా ఇష్టం. యౌవనం తొలి వాకిట్లో ఉన్నప్పుడు కథలు రాయాలనే ఉబలాటం బాగా ఉండేది. పీజీలో సెలబస్‌లో మాకు విరసం ప్రచురించిన 'శ్వేతరాత్రులు' కథా సంకలనం పాఠ్యాంశంగా ఉండేది. అందులోని కథలతో పాటు ప్రసిద్ధ తెలుగు కథలు చదవడం, వాటి గురించి స్నేహితులము కలిసి చర్చించుకోవడం వలన మెల్లగా కథ పట్ల ఆకర్షితుణ్ణి అయ్యానేమో!

ఇక విమర్శ వైపు రావడానికి ప్రత్యేకంగా ఒక కారణం అంటూ ఏమీ లేదు. తెలుగు సాహిత్యంలో మొదటి నుంచి కూడా విమర్శకుల సంఖ్య తక్కువే. ఒక అనివార్యత వల్ల విమర్శ వ్యాసాలు రాయాల్సి వస్తోంది.

**తెలుగులో సాహిత్య విమర్శను అనేకమంది రాస్తూ ఉన్నారు. అయినా విమర్శపై విమర్శకు కారణం ఏమిటి?**

పైన చెప్పినట్లు తెలుగులో విమర్శకుల సంఖ్య చాలా తక్కువ. మీరు అన్నట్లు గత కొద్ది రోజులుగా విమర్శ మీద విమర్శ వస్తోంది. అసలు రచయితకు, పాఠకుడికి మధ్య ఈ విమర్శకుడు అక్కరలేదు అనే దాకా వచ్చింది. ముందు మాటలు, సమీక్షల రూపంలో వస్తున్న విమర్శ కేవలం పరిచయాత్మకంగా ఉంటోంది తప్ప ఒక రచనలోని తప్పొప్పుల్ని, భావ, దృక్పథ వైరుధ్యాలను, లోపాలను చెప్పేవిగా ఉండడం లేదు. అందుకే విమర్శ అక్కరలేదు. విమర్శకుడు అక్కర లేదనే వాదన వచ్చింది. కానీ ఈ విపరీత ఆలోచన తప్పు. విమర్శ లేకపోతే సాహిత్యంలో మేలిమి రచనలు వెలువడవు. వెలువడిన రచనల్లోని లోపాలు తెలిసే అవకాశం లేదు. విమర్శ రచయితలకు గీటురాయి లాంటిది.

**మీ సిద్ధాంత గ్రంథం 'ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సాహిత్యం-సమగ్ర పరిశీలన' గురించి, మీరు పరిశీలించిన ప్రధాన విషయాలను క్లుప్తంగా చెప్పండి?**

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డా. నందిని సిధారెడ్డి పర్యవేక్షణలో 'ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సాహిత్యం - సమగ్ర పరిశీలన' (1969-2014) అనే అంశంపై Ph.D. చేశాను. తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం (1969-1973) నాటికి గోల్కొండ పత్రిక మూత పడడం



తెలంగాణ ప్రజల దురదృష్టం. దీని వలన తెలంగాణ ప్రజలకు తమ గొంతును వినిపించే ఒక వాహిక లేకుండా పోయింది. అప్పటికి ఆంధ్ర యాజ మాన్యంలో నడుస్తున్న పత్రికలు తెలంగాణ రచయితల రచనలుగాని, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సాహిత్యాన్నిగాని ప్రచురించడానికి సిద్ధంగా లేవు. అందువల్ల ఎంతో విలువైన ఉద్యమ సాహిత్యాన్ని రికార్డు చేయలేక పోయాము. ఆనాడు ఉద్యమకారులే రచయితలు కావడం వలన వాళ్ళకు వాళ్ళు రాసిన రచనలను ముద్రించు కోవాలని, ముందు తరాల కోసం రికార్డు చేయాలనే సోయి లేదు. కీర్తి ఖండూతి అంతకన్నా లేదు. అందుకే తీవ్ర నష్టం జరిగింది. అయితే కొంతలో కొంత జరిగిన మేలు ఏమిటంటే వరంగల్ నుండి 'జనధర్మ', కరీంనగర్ నుండి 'విద్యుల్లత'లాంటి పత్రికలు రావడం. ఈ పత్రికలను సేకరించి అందులోని కొన్ని ఉద్యమ కవితలు, వ్యాసాలు, కథలు, కరపత్రాలను నా పరిశోధనకు వాడుకున్నాను. ఆనాడు వచ్చిన ఒకే ఒక్క నాటకాన్ని కూడా సేకరించి నా పరిశోధనలో చేర్చాను. ఎంతో విలువైన పద్యాలు, నినాదాలు, కరపత్రాలు, కథలు కాలగర్భంలో కలిసిపోయాయి. మలిదశ (1995-2014)లో ఈ అసౌకర్యం లేదు. కొన్ని లక్షల పుటల సాహిత్యం అందుబాటులోకి వచ్చింది. అయితే తొలిదశలో అయినా, మలి దశలోనైనా మహిళలు రాసిన పాటలు చాలా తక్కువ వచ్చాయి. ఉద్యమ సాహిత్యాన్ని ఇంకా అనేక కోణాల్లో పరిశీలించాల్సి ఉంది. ముఖ్యంగా బహుజనులు చేసిన కృషి దళితులు చేసిన ఉద్యమ భావజాల వ్యాప్తి గురించి పరిశోధించి భావి తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

**మీరు కర్నూలు జిల్లా కథలపై పుస్తకాన్ని తెచ్చారు. రాయలసీమ కథలకు, తెలంగాణ కథలకు మధ్య పోలికలు, భేదాలను చెప్పండి?**

రాయలసీమ కథ అనగానే కేవలం ఫ్యాక్షన్ కథే అనుకుంటారు. కానీ అక్కడి



నుంచి కరువు, మానవీయ సంబంధాలు, మానసిక సంఘర్షణలు, హాస్యం, ప్రేమ కథలు (ఇటీవలే 'రాయలసీమ ప్రేమ కథలు' డా. ఎం. హరికిషన్ సంపాద కత్వంలో వెలువడ్డాయి) చాలా వచ్చాయి. అలాగే తెలంగాణ కథంటే కేవలం పోరాట కథలే కాదు ఇక్కడి నుంచి కూడా మానవ సంబంధాల కథలు, ప్రేమ కథలు, ప్రపంచీకరణ కథలు, అస్పృశ్య అనంతర కథలు ఎన్నో వచ్చాయి. ఈ రెండూ ఉద్యమ నేలలే కాబట్టి ఈ ప్రాంతాల కథ మట్టి కుదుళ్ల నుండి పుట్టింది. 1990ల తరువాత రాయలసీమ, తెలంగాణ రెండు ప్రాంతాల కథకులు వారి మాండలికాన్ని బలంగా వాడుకుంటూ ఎన్నో అద్భుతమైన కథల్ని రాస్తున్నారు.

**'పుంజీతం' కథా సంపుటి తరువాత ఇప్పటివరకు ఎన్ని కథలను రాశారు?**

2019లో 'పుంజీతం' వెలువడింది. దాని తరువాత దాదాపు ఎనిమిది కథల్ని రాశాను. ఇంకా రాయాల్సినవి చాలా ఉన్నాయి.

**తెలంగాణ కథ పరిణామం ఎలా ఉంది?**

మిగిలిన తెలుగు ప్రాంతాల కథతో సమానంగా తెలంగాణ కథ ఎదుగుతూ వస్తోంది. కాల పరిణామంలోని ప్రతి మలుపునూ తెలంగాణ కథకులు పట్టించుకొని వాటిని కథలుగా మలుస్తున్నారు. ఇంతకు ముందు దళిత, బహుజన కులాల్లోని కొన్ని కులాల కథకులు మాత్రమే కథలు రాసేవారు. కానీ ఇటీవల ఆయా కులాల ఆశ్రిత కులాల కథకులు కూడా వారి జీవితాల్ని కథలుగా మలుస్తున్నారు. శిల్ప పరంగా పెద్దగా ప్రయోగాలు లేకున్నా మెరుగైన శిల్పంతోనే కథలు వస్తున్నాయి. ఇప్పుడు మనం అస్తిత్వ చలనాల దశలో ఉన్నాము కాబట్టి అన్ని అస్తిత్వాలను కలుపుకొని తెలంగాణ కథ కొనసాగుతోంది.

**ఆంగ్ల కథల ప్రభావం కోస్తా, సీమ, తెలంగాణ కథలపై ఏవిధంగా ఉంది?**

కోస్తా ప్రాంత కథకుల మీద ఉన్నంతగా రాయలసీమ, తెలంగాణ కథకుల మీద ఆంగ్ల ప్రభావం లేదనే చెప్పాలి. సీమ, తెలంగాణలో ఆంగ్ల సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేసిన కథకులు ఉన్నా వాటిని అనుకరించినవారు, అనుసరించిన వారు చాలా తక్కువ. అయితే ఇతర భారతీయ భాషల కథా సాహిత్యం, ఆంగ్ల కథా సాహిత్యాన్ని పరిశీలించి మన కథలను మరింత మెరుగు పర్చుకోవాల్సి ఉంది.

**సంగిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి ఏటా 'తెలంగాణ కథా వార్షిక' ను వెలువరిస్తున్నారు కదా!. నేటి తెలంగాణ కథ బలాబలాల్ని విశ్లేషించండి.**

2013 నుండి 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం పక్షాన ప్రతి ఏటా తెలంగాణ ఉత్తమ కథల వార్షిక సంచికలను తీసుకువస్తున్నాము. 'రంధి' (2013) కథ సంకలనానికి సంగిశెట్టి శ్రీనివాస్, స్కైబాబ సంపాదకత్వం వహించారు. 'తన్లాట' (2014)కు నేను, సంగిశెట్టి శ్రీనివాస్, స్కైబాబ సంపాదకత్వం వహించాము. 'అలుగు' (2015), 'కూరాడు' (2016), 'దావత్' (2017), 'రివాజు' (2018), 'రూబిడి' (2019), 'బుగులు' (2020) సంకలనాలకు నేను, సంగిశెట్టి శ్రీనివాస్ ఇద్దరం సంపాదకత్వం వహిస్తూ వస్తున్నాము.

ఉద్యమ ప్రభావం నుంచి బయటపడి




ఈ రోజు తెలంగాణ కథ అన్నీ వాదాలను, దృక్పథాలను, సమకాలీన సంఘర్షణలను స్పృశించుకుంటూ ముందుకు పోతోంది. కొత్త కథకుల్లో అధ్యయన లోపం కనిపిస్తోంది. ఇంకా తెలంగాణ మాండలిక సొగసును పట్టుకోలేకపోతున్నాము. వర్తమాన కథకుల్లో పెద్దింటి అశోక్ కుమార్, కె.వి. నరేందర్, స్కైబాబ, పూడూరి రాజిరెడ్డి, జూపాక సుభద్ర, పసునూరి రవీందర్, జిలుకర శ్రీనివాస్, వంశీధర్ రెడ్డి, కొట్టం రామకృష్ణారెడ్డి, డా. బి. వి. ఎన్. స్వామి, కటుకోజ్వల మనోహరాచారి, మేడి చైతన్య, చందు తులసి, డా. గోగు శ్యామల, షాజహానా, శీలం భద్రయ్య, హనీఫ్ లాంటి వాళ్ళు అద్భుతమైన తెలంగాణ తెలుగులో బలమైన కథలు రాస్తున్నారు. కొత్త తరం కథకులు తెలంగాణ తెలుగు భాషలోని నాద సౌందర్యాన్ని లోతుగా పరిశీలించాల్సి ఉంది. ఎప్పటికీ ఫ్లాష్ బ్యాక్ టెక్నిక్‌తోనే కాకుండా కొత్త శిల్పంతో రాయడానికి ప్రయత్నించాలి. ఆంగ్ల కథలతో పాటు ఇతర భారతీయ భాషల కథలను కూడా అధ్యయనం చేసి, చర్చించాలి. అప్పుడే తెలంగాణ కథ మరింత మెరుగులు దిద్దుకొని మున్ముందుకు సాగుతుంది. వివిధ సాహిత్య సంస్థలు పూనుకొని కొత్త కథకులకు శిక్షణా కార్యక్రమాలు గత దశాబ్ద కాలంగా నిర్వహిస్తున్నాయి. ఇది తెలంగాణ కథకు ఎంతో మేలు చేస్తుంది.

**సబాల్టర్న్ పత్రిక ఉద్దేశం?**

నేను, సంగిశెట్టి శ్రీనివాస్ కలిసి 2018 నుండి సబాల్టర్న్ త్రై మాసిక పత్రికను వెలువరిస్తున్నాము. బహుజనుల సాహిత్యాన్ని ప్రచురించడం, ప్రచారం కల్పించడం కోసం ఈ పత్రికను ప్రారంభించాము. తెలంగాణలో ప్రత్యేకించి బహుజనుల కోసం ఒక్క పత్రిక కూడా లేదు. ఆ లోటును భర్తీ చేయడానికి ఒక ప్రయత్నం ఈ సబాల్టర్న్. బహుజనులను సెన్సిటైజ్ చేయడం, వాళ్ళ హక్కులను తెలుసుకునేలా చేయడం, వాళ్ళకు జరుగుతున్న అన్యాయాలపై వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రేరణ కల్పించడం ఈ పత్రిక ఉద్దేశం.

**సంగిశెట్టి శ్రీనివాస్‌తో మీ సాహిత్య అనుబంధ క్రమాన్ని తెలియజేయండి.**

తెలంగాణ కోసం ఎంతో నిబద్ధతతో, క్రమశిక్షణతో, సరైన ప్రణాళికతో పనిచేస్తోన్న చరిత్రకారులు, పరిశోధకులు, సాహిత్యకారులు సంగిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి పని చేయడం నాకు దక్కిన గొప్ప సమకాలీన అవకాశం. విడిగా ఆయన ఎంత లోతైన పరిశోధన చేస్తున్నారో సాహిత్య ప్రపంచానికి సుపరిచితమే. నేను ఆయన కలిసి 2014 నుండి ప్రతి ఏటా తెలంగాణ ఉత్తమ కథల సంకలనాలను తెస్తున్న సంగతి మీకు తెలుసు. అవి ఇప్పటికి ఎనిమిది సంకలనాలు వచ్చాయి. తొమ్మిదవది రాబోతున్నది. ఇద్దరం కలిసి 2015 లో 'పడుగుపేకలు' చేనేత కథా సంకలనాన్ని వెలువరించాము. 2017లో 'తొలి తెలుగు దళిత కథాయిత్రి తాడినాగమ్మ' పుస్తకాన్ని తీసుకు వచ్చాము. ఇవేగాక ఇంకా కొన్ని ప్రాజెక్టులు చేయాలనే ఆలోచనలో ఉన్నాము.

**ఇప్పటి రచయితలు కథలు రాసేటపుడు ఏ విషయాలపై శ్రద్ధ వహించాలంటారు?**

ఎప్పటి రచయితలైనా ప్రధానంగా గమనించాల్సింది తన సమకాలీన సమాజం యొక్క చలన సూత్రాలను, వాటి వెనక ఉన్న ఫిలాసఫీని. ఈ అవగాహనతో తాను ఎన్నుకున్న ప్రక్రియలో రచనలు చేసినపుడు గొప్ప రచనలు వెలువడుతాయి. లేదంటే తాత్కాలిక ఆనందాన్ని, సంచలనాన్ని కలిగించి కాలగర్భంలో కలసిపోతాయే కానీ క్లాసిక్స్‌గా నిలబడవు. 'గొల్ల రామవ్వ - పి. వి. నరసింహారావు', 'నిప్పుపూలు - దాశరథి', 'మంద'-డా. నలిమెల భాస్కర్, 'అతడు' - అల్లం రాజయ్య, 'ముసల్దాని ముల్లె' - ఆడెపు లక్ష్మీపతి, 'మాయి ముంత' - పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన కథల్లాంటివి ఇప్పుడు రావడం లేదు. ఒక చిల్లరదేవుళ్లు, ఒక ప్రజల మనిషి, ఒక నా గొడవ లాంటి రచనలు కూడా ఇప్పుడు రాకపోవడానికి కారణం ఇదేనను కుంటాను. సామాజిక శాస్త్రాల అధ్యయనం, మనకంటే ముందు తరం రచయితల రచనలను అధ్యయనం చేయడంతో పాటు తన సమకాలీన సమాజాన్ని లోచూపుతో పరిశీలించాలి. శైలీశిల్పాలను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలి. అన్నింటికంటే ముఖ్యంగా జీవితాన్ని అధ్యయనం చేయాలి. కాలం ఏ రచయితనైనా జల్లెడ పడుతుంది. లోతైన తాత్వికతతో రాసినపుడే కాలపరీక్షను తట్టుకొని కొంత కాలం నిలబడుతాము.

వ్యాసం

# తెలుగు సినిమా - సాహిత్యం, నాటకం, నవల

సినిమా సాహిత్యాన్ని విశ్లేషించిన వ్యాసం...



పొన్నం రవిచంద్ర
94400 77499

తెలుగు సినిమాలోని సాహిత్యపరమైన అంశాలలో ముఖ్యమైనది "సినిమా కథ కోసం సాహిత్యంపై ఆధారపడటం" అని చెప్పవచ్చు. మొదటి నుంచి తెలుగు సినీరంగం కథల కోసం తెలుగు సాహిత్యాన్ని ఆశ్రయించింద నడంలో ఏ మాత్రం సందేహం లేదు. మొదట్లో సాహితీ విలువలున్న నాటకాలు, నవలలు సినిమాలుగా తెరకెక్కగా, ఆ తర్వాత పాప్యులర్ నవలలే తెలుగు సినిమా కథలకు ఆలంబనగా మారాయి. క్రమక్రమంగా తెలుగు సినిమాలకి - సాహిత్యానికి మధ్య ఉన్నా అనుబంధం తెగిపోయి ఇపుడు అడపాదడపా మాత్రమే సినిమా కథల కోసం సాహిత్యాన్ని ఆశ్రయించే పరిస్థితి వచ్చింది. ఈ మొత్తం పరిణామానికి ప్రధానంగా ఇతర భాషలు, విదేశీ చిత్రాలు అందుబాటులోకి రావడమే కారణం అని చెప్పాలి. నవలని లేదా నాటకాన్ని చదివి అర్థం చేసుకుని, దానిని సినిమా స్క్రీన్‌ప్లేకి, అనుగుణంగా తిరగరాసి, సాహిత్యంలోని ఆత్మని 'మిస్' చేయకుండా తెరపై ఆవిష్కరించాలంటే చాలా విద్వత్‌గణం, సాహితీ-సినిమా రంగాలపై సమానమైన పట్టు దర్శక, రచయితలకు అవసరం. కానీ, నేటి తెలుగు దర్శకులలో చాలా మందికి అంతర్ పరిజ్ఞానం కానీ, సాహితీ అభినివేశం కానీ లేవు. దీనివల్ల తెలుగు సాహిత్యం దారి-తెలుగు సినిమా దారి వేరయ్యాయి.

### తెలుగు సాహిత్యం-సినిమా అనుబంధం

సినిమా రంగం కథల కోసం సాహిత్యాలపై ఆధారపడటం, తెలుగు సాహిత్యం తన కథలను లిఖిత రూపం నుంచి దృశ్య రూపంలోకి విస్తరణ కోసం సినిమాపై ఆధారపడటం అనే 'పరస్పరా ధారిత ధోరణి' ఈ క్రింది రూపాలలో కనిపిస్తుంది.

తెలుగు సాహిత్యంలోనూ, రంగస్థలం లోనూ ప్రజాదరణ పొందిన నాటకాలను సినిమాలుగా తెరకెక్కించడం. తొలి సినిమా 'భక్త ప్రహ్లాద' 'పాదుకా పట్టాభిషేకం' వంటివి దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు.

నాటకాలను సినిమా చిత్రీకరణకి అనుకూలంగా కొన్ని మార్పులు చేసి తెరకెక్కించడం. 1939లో వచ్చిన వర విక్రయం, 1955లో వచ్చిన కన్యాశుల్కం ఈ విధంగానే తెరకెక్కాయి.

ఆయా నాటకాలలోని ప్రజాదరణ పొందిన ఘట్టాలనో, పద్యాలనో, అంకాలనో మాత్రమే వాడుకుని, సినిమా కథని తమ సొంతంగా అల్లుకోవడం. చిలకమర్తి 'గయోపాఖ్యానం', 'పాండవోద్యోగ విజయాలు'లోని పద్యాలను పాండవ వనవాసం వంటి సినిమాలకు ఈ రకంగానే ఉపయోగించుకున్నారు.

సినీ కథల కోసం సాహిత్యంలోని నాటకాలను కాకుండా నవలలను ఆశ్రయించడం. ఈ ధోరణి తెలుగు సినిమాలలో నవలా చిత్రాల శకాన్ని ఆవిష్కరించింది.

నవలలపై ఆసక్తిని కొనసాగిస్తూనే, కథ, కథానిక, నవలిక వంటి ఇతర సాహితీ ప్రక్రియలలో వచ్చిన కథలను తీసుకుని వాటిని సినిమాకి అనుకూలంగా కథా విస్తరణ చేయడం, కొత్త సీన్లను అల్లుకోవడం, 'దోషగుణం' అనే చలం కథని 2004లో 'గ్రహణం' పేరుతో పూర్తి స్థాయి కథాచిత్రంగా తీయడం దీనికి ఉదాహరణ.

తెలుగు సినిమాకి-తెలుగు సాహితీ ప్రక్రియలకు మధ్య 'ఎడం' పెరిగిన దశ. 1990 దశకం తర్వాత కొత్తరకం ప్రేక్షకులలో తెలుగు సాహిత్య అధ్యయనం తగ్గిపోవడం, వారికి ఇంగ్లీషు వంటి ఇతర భాష సాహిత్యాల సాంగత్యం లభించడం, అదే సమయంలో తెలుగు పాప్యులర్ సాహిత్యంలో పేరెన్నికగన్న సాహిత్య కృషి జరగకపోవడం కారణంగా చెప్పవచ్చు.

తెలుగు సాహితీ సృష్టి సినిమాలను దృష్టిలో పెట్టుకుని, సినిమాల కోసమే జరగడం! ఇప్పటి సాహిత్యం అంతా సినిమాకు 'నఖలు'లా ఉండటం, సినిమా తరహా వర్ణన,శైలినే అనుకరించడం ప్రస్తుత పరిణామం.

సినిమా కథలే తిరిగి సాహిత్యం వైపుగా "వెండితెర నవలలు" అనే పేరిట సాహితీ రూపాన్ని పొందడం! "మాయాబజార్ మల్లీశ్వరి, ఇద్దరు మిత్రులు, ఇటీవలి శ్రీరామరాజ్యం" వంటి సినీ నవలలే దీనికి ఉదాహరణగా చూడవచ్చు.

**నాటక సాహిత్యం - సినిమా**

ప్రాచీన అలంకారికులు సాహిత్య రూపాలన్నింట్లోనూ కావ్యం, కవిత అత్యుత్తమంగా కీర్తించారు. అలాంటి కావ్యాలన్నింట్లోనూ నాటకమే రమ్యం (కావ్యేషు నాటకమ్ రమ్యమ్) అన్నారు. అంతేగాక ఒకడుగు ముందుకేసి అసలు సాహితీ ప్రస్థానం యొక్క అంతిమ లక్ష్యం నాటకమే (నాటకాంతాహి సాహిత్యమ్) అని కూడా వర్ణించారు. అలా సాహిత్యంలో ప్రాధాన్యతని సాధించిన నాటకం తెలుగు సినీరంగానికి కూడా తనదైన సృజనాత్మక సహాయాన్ని అందించింది. దీనివల్లే చాలా నాటకాలు సినిమాలుగా రూపాంతరం చెందాయి. తొలి నాళ్లలో పౌరాణిక నాటకాలు, తర్వాత చారిత్రక నాటకాలు, ఆ తర్వాత సాంఘిక నాటకాలెన్నో తెలుగు వెండితెరపై దృశ్యరూపాన్ని సాధించాయి అలా తెలుగు సినిమాలో దాదాపు 60పైగా సినిమాలు నాటకాల పునాదులపై వెండితెర విన్యాసాలు చేసాయి.

**సినిమాలుగా వచ్చిన నాటకాలు**

కాళ్లకూరి నారాయణరావు "చింతామణి, వరవిక్రయం" నాటకాలు

**అప్పట్లో** 'నవలా చిత్రాలు' ట్రెండ్ లా ఏర్పడటమేకాక అ సినిమాలలో నటించిన హీరోకు 'నవలా నాయకుడు' అని, హీరోయిన్‌కు 'నవలా నాయిక' అని ప్రత్యేక గుర్తింపునిచ్చాయి. పైగా నవలా చిత్రాలలో నటించడం అంటే మేథో చిత్రాలలో నటించడంగా, ఆ హీరో, హీరోయిన్ లకు మేథో నటులుగా విశిష్ట ఆదరణ లభించేది. మొదట్లో నవలా నాయకుడు టైటిల్‌ను అక్కినేని సాధించగా, ఆ తర్వాత ఆ క్రెడిట్‌ని శోభన్ బాబు, ఆ తర్వాత చిరంజీవి దక్కించుకున్నారు.

1933, 39లలో సినిమాలుగా రాగా, గురజాడ 'కన్యాశుల్కం' 1955లో, శూద్రకుడి 'మృచ్ఛకటికం' 1967లో 'వసంతసేన' పేరుతో, గణేష్ పాత్రో 'పావలా, కొడుకు పుట్టాల' 1975లో 'నాకూ స్వతంత్రం వచ్చింది' పేరుతో సినిమాగా వచ్చింది. దాసం గోపాలకృష్ణ 'చిల్లరకొట్టు చిట్టెమ్మ' 1977లో, సి.ఎస్. రావు 'ఊరుమ్మడి బతుకులు' 1977లో, 'ప్రాణం ఖరీదు' 1978లో, పరుచూరి వేంకటేశ్వరరావు 'మరో భారతం' 1979లో 'కలియుగ భారతం'గా, 'ఈ పిల్లకు పెళ్ళౌవుతుందా?' 1983లో, 'సమస్యా నీకు నూరేళ్ళు' నాటకం 1985లో 'శ్రీ కట్న లీలలు' పేరుతో, 1987లో 'ఇదిగో ప్రశ్న? ఏది జవాబు!' 'అగ్నిపుత్రుడు' పేరుతో సినిమాలుగా వచ్చాయి. యండమూరి 'కుక్క' 1980లో, పరుచూరి బ్రదర్స్ 'దారితప్పిన ఆకలి' 1982లో 'ఈ చరిత్ర ఏ సిరాతో', 1983లో కొడాలి గోపాలరావు 'లంకె బిందెలు', 1985లో వి.ఎస్. కామేశ్వరరావు 'ఈ మంటలారపండి' నాటకం 'వందేమాతరం' పేరుతో, 1987లో గొల్లపూడి మారుతీరావు 'కళ్లు', 1991లో పల్లేటి లక్ష్మీకులశేఖర్ 'తపస్సు' నాటకం 'ప్రేమ తపస్సు' పేరుతో, 1991లో శ్రీరాజ్ 'కాలధర్మం' 'కలికాలం' పేరుతో, 1994లో ఇసుకపల్లి మోహనరావు 'మర్యాదస్తులకో నాటకం' 'ఆమె' పేరుతో, 2000 సంవత్సరంలో ఎల్.బి. శ్రీరాం 'ఒంటెద్దు బండి' 'అమ్మో ఒకటో తారీఖు' పేరుతో సినిమాగా వచ్చింది.



**సినిమాలుగా వచ్చిన నవలలు**

తెలుగు సాహిత్యంలోని నవలలను సినిమాలుగా మలచడం అనేది 1970, 1980 దశకాలలో ఓ ఉద్యమంలా నడిచిన చరిత్ర. ఇది తెలుగు సినిమా ప్రస్థానంలో ప్రముఖ ఘట్టం. అప్పట్లో 'నవలా చిత్రాలు' ట్రెండ్ లా ఏర్పడటమేకాక అ సినిమాలలో నటించిన హీరోకు 'నవలా నాయకుడు' అని, హీరోయిన్‌కు 'నవలా నాయిక' అని ప్రత్యేక గుర్తింపునిచ్చాయి. పైగా నవలా చిత్రాలలో నటించడం అంటే మేథో చిత్రాలలో నటించడంగా, ఆ హీరో, హీరోయిన్ లకు మేథో నటులుగా విశిష్ట ఆదరణ లభించేది. మొదట్లో నవలా నాయకుడు టైటిల్‌ను అక్కినేని సాధించగా, ఆ తర్వాత ఆ క్రెడిట్‌ని శోభన్ బాబు, ఆ తర్వాత చిరంజీవి దక్కించుకున్నారు. హీరోయిన్‌లలో మాత్రం 'నవలా నాయిక' అంటే వాణిశ్రీ అనే ముద్ర పడిపోయింది.

అయితే ఈ నవలల్లో కొన్ని యథా తథంగానూ, మరికొన్ని పాత్రలు సన్నివేశాలలో మార్పులతోనూ, ఇంకొన్ని మూలకథలోని మార్పులతోనూ తెరకెక్కాయి. 'దొంగ మొగుడు' సినిమాగా

వ్యాసం

వచ్చిన 'నల్లంచు తెల్ల చీర' నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ నవలా పరిచయంలో చెప్పిన మాటలు నవలకి సినిమాకి మధ్య ఉండే మార్పులకు అద్దం పట్టేవే! ఆయన మాటల్లో..

"సినిమాకు కావలసిన హంగులన్నీ చేర్చాక కథ మరొక విధంగా తయార యింది. మిస్ విజయవాడ పాత్ర మాయ మయింది. ప్రియంవద మంచిదైంది. మాధవి మరణించలేదు. కాబట్టి నల్లంచు తెల్లచీర నవలకీ, ఆ సినిమాకీ ఏ సంబంధం లేదు. కేవలం పాత్రల ఆధారంగా తీయబడిన సినిమా- దొంగ మొగుడు".

మొత్తం మీద 90 ఏళ్ల తెలుగు సినీ చరిత్రలో దాదాపు వందకు పైగా సినిమాలకు నవలలే ఆధారంగా నిలిచాయి. అత్యధికంగా యండమూరి వీరేంద్రనాథ్ 16 నవలలు చిత్రాలుగా రూపొందాయి. వీటిలో "రాక్షసుడు, ఛాలెంజ్, అభిలాష, ఆఖరిపోరాటం, మరణ మృదంగం, సంపూర్ణ ప్రేమాయణం, స్టూవర్ట్ పురం పోలీస్ స్టేషన్" తదితర చిత్రాలు బాక్సాఫీస్ దగ్గర విజయం సాధించాయి. మల్లాది వెంకట కృష్ణమూర్తి 12 నవలలు సినిమాలు తెరకెక్కగా వాటిలో "రేపటి కొడుకు, ఇదేనా న్యాయం, శ్రీవారి శోభనం, నీకూ నాకూ పెళ్ళంట, రెండు రెళ్ల ఆరు" చిత్రాలు విజయ వంతంగా ప్రదర్శించబడ్డాయి. యద్దనపూడి సులోచనారాణి 11 నవలల్లో "మీనా, జీవన తరంగాలు, ప్రేమ సింహాసనం, సెక్రటరీ, ప్రేమలేఖలు, బంగారు కలలు, అగ్నిపూలు, రాధాకృష్ణ" సినిమాలు విశేష ప్రేక్షకాదరణ పొందాయి. ముప్పాళ్ల రంగనాయకమ్మ 4 నవలల్లో "బలిపీఠం, గోరింటాకు, కృష్ణవేణి" చిత్రాలు విజయవంతమయ్యాయి. పొత్తూరి విజయలక్ష్మి 3 నవలల్లో "శ్రీ వారికి ప్రేమలేఖ, ప్రేమ చిత్రం పెళ్లి విచిత్రం", మల్లిక్ 3 నవలల్లో "పరుగో పరుగో, వివాహ భోజనంబు", అరికెపూడి కౌసల్యదేవి 2 నవలల్లో "ప్రేమనగర్" చిత్రాలు సక్సెస్ నమోదు చేసుకున్నాయి. "ఆదివిష్ణు, చలం, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, పి. శ్రీదేవి, చల్లా సుబ్రహ్మణ్యం కొమ్మనాపల్లి గణపతిరావు, జి.వి. అమరేశ్వర్ రావు, వంశీ, కొలపల్లి ఈశ్వర్ కాశీపట్నం రామారావు దాశరథి రంగారావు కిషన్ చందర్ తమిరిశ జానకి, డి. రామేశ్వరి, అంపశయ్య నవీన్, సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి" మొదలైన రచయితల ఒక్కో నవల సినిమాలుగా రాగా, వాటిలో "ఏకవీర, ఆహా! నా పెళ్ళంట, ఓ వర్షం కురిసిన రాత్రి, రెండిళ్ళ పూజారి, సితార, చిల్లర దేవుళ్ళు, మా భూమి, న్యాయం కావాలి" సినిమాలు ప్రజాదరణ పొందాయి.




**నిజానికి తెలుగు సాహిత్యంలో మరెన్నో సాహితీ విలువలు కల రచనలు ఉన్నాయి. రాయలసీమ, తెలంగాణ, ఉత్తరాంధ్ర మాండలి కాలలో వచ్చిన కథ, నవలా సాహిత్యం నిండా గుండెల్ని తడిమేసే మానవీయ కథనాలు న్నాయి. నైజాంకు వ్యతిరేకంగా చేసిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఎన్నెన్నో వీరోచిత ఘట్టాలు న్నాయి. స్వాతంత్రోద్యమ సమయంలో వచ్చిన నవలలను "పీరియడ్ ఫిల్మ్"గా తీయడానికి తగినట్లుగానే ఉన్నాయి.**

ఇంకా మరెన్నో.. ఇలా తెలుగు సాహిత్యం కథల పరంగా తెలుగు సినిమాలను ప్రభావితం చేసినప్పటికీ, వీటిలో పాప్యులర్ రచనలే ఎక్కువగా ఉన్నాయనేది గమనించాలి. నిజానికి తెలుగు సాహిత్యంలో మరెన్నో సాహితీ విలువలు కల రచనలు ఉన్నాయి. రాయలసీమ, తెలంగాణ, ఉత్తరాంధ్ర మాండలికాలలో వచ్చిన కథ, నవలా సాహిత్యం నిండా గుండెల్ని తడిమేసే మానవీయ కథనాలున్నాయి. నైజాంకు వ్యతిరేకంగా చేసిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఎన్నెన్నో వీరోచిత ఘట్టాలున్నాయి. స్వాతంత్రోద్యమ సమయంలో వచ్చిన నవలలను "పీరియడ్ ఫిల్మ్"గా తీయడానికి తగినట్లుగానే ఉన్నాయి. వాణిజ్య అంశాలు అనే ఆటంకాన్ని పక్కనబెట్టి నిజమైన మానవ జీవన చిత్రణని తెర మీద ఆవిష్కరించాలనుకునే దర్శకులకు తెలుగు నవలా సాహిత్యం, తెలుగు సాహిత్యం ఓ తరగని గని అనడంలో సందేహం లేదు. తెలుగు సాహిత్యంలో కథల కొరత ఉందని పదే పదే చెప్పే సినీ నిర్మాత, దర్శకులు, హీరోలు ఒక్కసారి హాలీవుడ్, కొరియన్, థాయ్ సినిమాలను పక్కన పెట్టి, తెలుగు సాహిత్యం వైపు దృష్టి సారిస్తే తెలుగు సాహిత్యంలో కథలు లేవనే వారికి తప్పనిసరిగా పరిష్కారం దొరుకుతుంది.



# తొవ్వ...



శ్రీరామోజు హరగోపాల్, 99494 98698

రెండురెక్కల చెమటలతో తడిపిన
ఆశల మొలకలమీద చిగురించిన కాలం
గుప్పిళ్ళకొద్ది ఇష్టాలతో కట్టుకున్న పిట్టగూటిలో
ఆత్మీయ, మమకారాలు దోసిళ్ళు నింపిన కాలం
ఇగిరిపోయే సంతోషాల ఆవిర్లను
కన్నీళ్ళతో కమ్మి బతుకుజలాలను పారించిన కాలం

చేసిన స్నేహాలు మరువకుంట,
జోటకట్టిన చేతులు విడువకుంట
నడిచిన బాటలు తప్పిపోకుంట,
కలల్లెక్క రాలిపోకుంట కాపల కాలం...

భరోసాతో ఈదటానికి కాలం సెలయేరా,
గుండెలమీదికి దూకే జలపాతం
అంతరంగ రంగస్థలం మీద నటనమాడే నేస్తమా,
మంజులశింజాన మంజీరాలు చేసింది కాలమే....

కఠినశిలా సదృశమైన కాలాన్ని శిల్పంగ చెక్కిన చెలికాడా
రోజూ నలిగి, నలిగి... మనసు విరిగి
ఇంకా రేపటి మీద మోహంతోనే
ఊపిరిలో శక్తి నింపుతున్నది కాలమే...

కాలం ఒక సమాధానం
కాలం ఒక సమ్మేళనం
కాలం ఒక ప్రేమకావ్యం



# ముచ్చలిక

గూడెపు ఆచారాలకు ఒక వ్యక్తీకరణ...



డా॥ గంధం విజయలక్ష్మి
96666 04322

సరస్వతి వాళ్ళది ఉన్నంతలో సర్దుకొని గుట్టుగా ఉండే కుటుంబం జంగాల గూడెంలో మంచి పేరున్న కుటుంబం. సరస్వతి పెండ్లి ఈడు వచ్చింది గూడెం సిరస్థ ప్రకారం లంగం చేసి బాన్సువాడ దగ్గరి గ్రామము నర్సాపల్లి గూడెంకు చెందిన రామయ్య కిచ్చి లంగం జేసిరి.

శిర్పడు (అబ్బాయి) మంచోడు అనుకొనిరి కాని కొన్ని రోజులకే ఆడి గుణం ఒక్కొక్కటి బయటపడసాగే సంసారం మూడు రోజుల ముచ్చటైంది. మూడు నెలలకే సరస్వతి మొగడు రామయ్య గుణం గబ్బు గబ్బు అని గూడెం అంతా తేటతెల్లం గావట్టింది సరస్వతి కడుపులో ఒక మొలక మొలిచింది. పంటి బిగువున బాధను అనుభవిస్తూ కాలం వెళ్ళదీస్తోంది కడుపులో బిడ్డకోసం అన్ని భరిస్తూ పెళ్ళైన కొత్తలో గూడెంలో శాంతి  ఇంటి మీదకి వచ్చి నన్ను అనుభవించి మోసం చేశాడు. ఈ రామయ్య అని పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టింది. ఎంతటి అమ్మాయిల పిచ్చోడో అప్పుడే గ్రహించాల్సింది సరస్వతి గ్రహించలేకపోయింది.

రామయ్య ఆగడాలకు అంతులేకుండా పోయింది రామయ్య తల్లి కొడుకు దుర్మార్గుడు అయినా వాడికే వంత పాడేది తాన అంటే తందాన అన్నట్లు రామయ్య తల్లి “ఈన నేర్చింది కాని నాక నేర్వలేదు”. అలా గడుస్తుండగానే సరస్వతికి పండంటి ఆడపిల్ల పుట్టింది అయిన ఆ రాక్షసుడి మనస్సు మారలేదు ఉద్యోగం అంటూ పట్నంకు మకాం మార్చిండు. అక్కడ దవాఖాన్ల నర్సుతో అక్రమ సంబంధం పెట్టుకొని సరస్వతిని గోస గోసపెట్టేటోడు.

ఒక్కసారి పట్నంల ఉన్నప్పుడు



అయిన దానికి కాని దానికి కొడుతుంటే అక్కడున్న చుట్టపక్కల వాళ్ళంత మీ ఊరికి మీరు పొండ్రి అని పంపించిండ్రు.

గూడెం వచ్చినంక సరస్వతి బాపుని పిలిపించిండ్రు గూడెం కులస్థులతో సరస్వతి బాపు కులం న్యాయగాళ్ళతో అయ్యా నా బిడ్డ ఏ తప్పు చేయలేదు రంకులు బొంకులు (చెడు పనులు చేసింది కాదు నాపింకే (నా పిల్ల/నా బిడ్డను గొడ్డును బాదినట్టు మీ కండ్లముందే బాదిండు చూస్తిరి గదా అని సరస్వతి తండ్రి ముచ్చలిక మద్యవర్తి చేతిలో పెట్టిండు. ముచ్చలిక సరస్వతి వాళ్ళ కులంలో గడ్డిపుల్లనో చెట్టు పుల్లనో లేదా సన్నని కట్టె పుల్లను చిటికెన వేలంత పుల్లను తన మీద లేదా తన వాళ్ళ మీద వేసిన నిందలను ఆరోపణలను అన్యాయాలను ఫిర్యాదుగా చెప్పడానికి ఆ గూడెం న్యాయగాళ్ల చేతిలో పెడతారు వారు అటువైపు ఇటువైపు సంగతులు విని న్యాయ అన్యాయాలు విచారిస్తారు.

ఆ పుల్లదారి అటు ఇటు సంగతులు విని రేపు మాట్లాడుకుందాం. కుల పోల్లందరిని పిలిపించి అప్పటి దాకా కులం గూడేమ్లు సరస్వతి ఆమె తండ్రిని ఈ పొద్దింకి ఉండుండ్రి అని ఆ పుల్ల దీసుకున్న కత్పదారి (న్యాయాధికారి) జెప్పిండు అయినా రామయ్య శాంతించలేదు. మళ్ళీ ఒక్కసారి గొడ్డును

కథ

బాదినట్టు సరస్వతిని కొట్టేసరికి అది జూసి సరస్వతి బాపు గుండెలో బాధమొదలైంది.

రామయ్య చిన్నమ్మ ఆడదాని బతుకెంతరా మూలకు ఇడిచిన చెప్పులతో సమానం ఇది కాకపోతే యింకొకతి దీనిని ఇడిచి వెట్టు అని అనే ఇగుర జెప్పు ఆడదాన అంటే...ఈన్ని ఇడిచి ఆడిని వట్టు అన్నదట రామయ్య చిన్నమ్మ వ్యవహారం వాడికి బుద్ది చెప్పాల్సింది పోయి వాడికే సపోర్టు చేసింది అది విని వాడు ఇంక రెచ్చి పోయిండు. కమ్మోళ్ళ రాజు వాళ్ళ అమ్మ సత్యం పల్కాటాలు (మాటామంతి) పలికింది ఆడపిల్ల ఉసురు పోసుకుంటే ఊరికి మంచిది గాదు రామయ్య అంటే ఎవరి మాట లెక్క జేసే స్థితిలో లేడు.

రామయ్య దోస్త్ మంకాల్ల సాయిలుకు కూడా ఈ తెగతెంపులో పాపం ఉంది ఒక దుర్మార్గుడిని ప్రోత్సహించాడు. ఇద్దరి ఆడబిడ్డల ఉసురు పోసుకున్నడు. రామయ్యతో బాస్సువాడకు వెళ్ళి 20 స్టాంపు పేపర్ తెచ్చారు దగ్గరుండి ఇడుపు కాగితం రాయించాడు.

రామయ్యతో ఉన్న తాగుబోతు దోస్తులందరు రామయ్య మాటకు తానా అంటే తందానా అన్నారు. రశీదు తప్పిదే మసీదు అని అతని దోస్తులు అవమానించారు. ఇదంతా చూస్తున్న గూడెంమ్ల గుసాయి (పెద్ద మనిషి) ఇప్పటి వరకు ఇంతటి ఘోరం చూడలేదు. తీసుకున్న ముచ్చిలికను పచ్చని చెట్టుకింద పడేసి పచ్చని చెట్ట నీకిందే ఇంత అన్యాయం జరిగింది. నాయ్యమో అన్యాయమో నీకే తెలవాలి అంటూ కండ్ల నీళ్ళు తుడుచుకుంటూ అక్కడి నుంచి పోయిండు. రామయ్య సరస్వతి పెండ్లి సంబందం కుదిర్చిన మంకాడు నా దగ్గర సదువు నేర్చినోడు అక్షరాలు దిద్దినోడు ఆడదాని జీవితం నాశనం జేసిండు అని అంగలార్చిండు. ఎవరి కోసం కాలం ఆగదు. ఎవరు జేసిన తప్పువారే అనుభవిస్తారు. అన్నట్టుగా కాలమే శిక్షలు వేసింది. రామయ్య కుటుంబమంతా చిన్న భిన్నామయింది. రామయ్య పెద్దన్న భార్య చేతులు నరికినందుకు జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు.

గొట్టంగాళ్ళ శాంతిని గూసు చేసినందుకు ఎండదెబ్బ తగిలి రామయ్య రెండో అన్న కర్సిపోయిండు. రామయ్య ఆ ఇంటి ఆడపిల్లలకు విడాకులు అయ్యాయి. పుల్లదారి అన్నట్ట పచ్చని చెట్టే చూసుకుంది. ఎండకుపోయిన చెట్టు వర్షపు చినుకులతో చిగిరించినట్టు ఎడారి అయిన సరస్వతి జీవితం చదువు అనే చినుకులతో మళ్ళీ కొత్త చిగురులు తొడిగింది.

కవిత

# రసహేల



తుమ్మూరి రాంమోహన్ రావు, 97015 22234

ఎక్కడో విన్న పాటను
తుమ్మెదకు గుర్తుచేస్తూ
ఓ పూవు పిలుస్తుంది

పూలతోడిదే కదా తుమ్మెద లోకం
ఎగురుతూ వెళ్లి పూల కొమ్మను పలుకరిస్తుంది

మది నిండా గానం తురిమిన మణీచకం
తేటిపాటలో తేలియాడుతుంది
ఎదనిండా మోహం కమ్మిన తుమ్మెద
తేనెకోసం తహతహలాడుతుంది

పాట కావాలి పుష్పానికి
తేనె కావాలి తేటికి
ఆదానప్రదానం ఆనంద సూత్రమవుతుంది

వాడిపోయే లోపే
పూజకో పుణ్యానికో
నోచుకోని పూల పరితాపం
బంభరగీతంతో మటుమాయం

పాపం అల్పాయువు ఆర్తవమంటే చిన్నచూపు
నల్లరెక్కల కలక్వాణం చూపు మరో విరివైపు

ఇది ఎడతెగని రాసలీల
ఎవరిదో ఈ మాయారసహేల

# ఒక సంస్కృతి ఐకాన్‌గా 'శంఖం'

శంఖం మతలబు చెప్పిన వ్యాసం...



చకిలం వేణుగోపాలరావు
82848 66622

మరియు
శ్రీరామోజు హరగోపాల్

శంఖంలో పోస్తేనే తీర్థం, చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లు అనే లోకోక్తులు శంఖం మన సంస్కృతిలో భాగమన్న విషయాన్ని తెలుపుతున్నాయి. శంఖానికి పవిత్రత ఉందని, శంఖాన్ని శబ్దం చేయడానికి వాడుతారని ఈ లోకోక్తుల సారాంశం.

**శంఖమంటే ఏమిటి?**

జంతువులలో మొలస్కా వర్గంలోని గాస్ట్రోపోడా తరగతికి చెందిన నత్తల శరీరాల్ని జీవితకాలం కాపాడే గట్టి రక్షణకవచాలే శంఖాలన్నీ. నత్తల మేంటిల్ స్రావాలవల్ల శంఖాలు రూపొందుతాయి. ఈ నత్తల జాతులు, ఉపజాతులు, ప్రజాతులన్నీ కలిసి 40 వేల నుంచి 90 వేల వరకు ఉండవచ్చునంటారు జీవశాస్త్ర పరిశోధకులు. శంఖాలన్ని సర్పిలాకారంలో ఉండే పెంకుగుల్లలే. శంఖాలన్నీ నిజమైనవే. కాని, వీటిలో దొరికే ప్రాదేశికతనుబట్టి, వాటిలోని రకాలనుబట్టి వేర్వేరు పేర్లతో గుర్తిస్తారు. 1758లో లిన్నేయస్ అనే జీవశాస్త్రవేత్త భారతదేశంలో పవిత్రంగా భావించే శంఖానికి 'టర్బినెల్లా పైరమ్' అని నామకరణం చేసాడు. ఇవి ఇండో-పసిఫిక్ సముద్రంలో ఎక్కువగా లభిస్తాయి. అమెరికావంటి దేశతీరాల్లో లభించే శంఖాలలోని నత్తలు మాంసాహారు లంటారు.

శంఖం సముద్రం నుంచి లభించే ఒక



రకమైన నత్తవంటి ప్రాణి కవచం, గూడు, సహజ కవచకుండలంగా ఆ ప్రాణినంటి ఉండే పెంకు. క్సాంకస్ అనేది యూరపులో పేరు. నిజానికి ఆ పదం హిందూ మహాసముద్రంలో లభించే 'టర్బినెల్లా పైరమ్'కు మాత్రమే ఉపయోగించబడింది. Xancus was it's old generic name. మార్కెట్లో వరదలెత్తే అనేక రకాల గుల్లపెంకులను శంఖమనే పిలుస్తారు. వీటిలో ప్రధానంగా ఈ Whelk Shells రాణిశంఖం, గుర్రం శంఖం మొదలైన పేర్లతో పిలువబడే రకాలున్నాయి. Buccinidae అనేది విస్తారమైన, వైవిధ్యభరితమైన, వర్గీకృతమైన, పెద్ద సముద్రనత్తల కుటుంబం గురించి చెప్పే మాట. ఈ కుటుంబంలో 1500ల కంటే ఎక్కువ జాతులున్నాయి. Whelkలంటే నత్తలే. గుల్లచేప అనవచ్చు. వీటిమీద కనిపించే దృఢమైన పెంకు సర్పిలాకారంలో ఉంటుంది. Buccinids యూరప్ అట్లాంటిక్ సముద్రంలో, ట్యూబినెల్లా పైరమ్ ఇండో పసిఫిక్ సముద్రంలో లభిస్తాయి. Whelk Shells తొలుత Sinistogulgurous అని, ఇపుడు Byssicon అని పిలుస్తున్నారు. వీటిలోనే 'ఎడమచేతి'వైపు తిరిగిన గుల్ల వుంటే దానిని 'దక్షిణావృత'శంఖమని పిలుస్తారు.

శంఖాలను ఏర్పరుచుకుని జీవించే నత్త మొలస్కా జాతికి చెందిన జీవి. ఇవి వివిధ జాతులకు చెందిన మధ్యమ పరిమాణంలోని ఉప్పునీటి నత్తలు లేదా వాటి కర్పరాలు. శంఖం అనే పదాన్ని ఇంగ్లీషు మాట్లాడే దేశాలలో విస్తృతంగా చాలా రకాల సర్పిలాకారంగా, రెండు వైపులా మొనదేలి ఉండే పెద్ద కర్పరాలకు ఉపయోగిస్తున్నారు. ఇందులో కిరీటపు శంఖాలైన మెలాంగినా జాతులు, గుర్రపు శంఖాలైన (Pleuroploca gigantea), పవిత్రమైన భారతీయశంఖాలు (Turbinella pyrum) కూడా ఉన్నాయి. ఇవన్నీ నిజమైన శంఖాలు కావు.

నిజమైన శంఖాలు సముద్రంలో నివసించే గాస్ట్రోపోడా తరగతికి చెందిన

స్ట్రాంబిడే (Strombidae) కుటుంబం లోని స్ట్రాంబస్ (Strombus) ప్రజాతికి చెందిన జీవులు. ఇవి చాలా చిన్నవాటినుండి చాలా పెద్దవాటి వరకు వివిధ పరిమాణాలలో ఉంటాయి. వీటిలో చాలా జాతులు వాణిజ్యపరంగా, ఆహార పదార్థాలుగా ముఖ్యమైనవి. Strombus gigas శంఖువుల నుండి ఖరీదైన ముత్యాలు తయారౌతాయి. సుమారు 65 జాతుల శంఖాలు అంతరించిపోయాయి. జీవించియున్న జాతులు ఎక్కువగా హిందూ మహాసముద్రం - పసిఫిక్ మహాసముద్రంలో నివసిస్తున్నాయి. ఆరు జాతులు కారీబియన్ ప్రాంతంలో నివసిస్తున్నాయి. చాలా శంఖు జాతులు ఇసుకమేట వేసిన సముద్రగర్భంలో ఉష్ణ ప్రాంతాలలో జీవిస్తాయి. స్ట్రాంబస్ అనేది కూడా భారతీయ శంఖమే కాని, అది పవిత్ర భారతీయ శంఖం కాదు. టర్బినెల్లా

**శంఖు ధ్వని విజయానికి, సమృద్ధికి, సుఖానికి, కీర్తి ప్రతిష్ఠలకు, లక్ష్మి ఆగమనానికి ప్రతీక, శంఖాన్ని శివపూజకు, పూజలో ఆరతి ఇచ్చేటప్పుడు, ధార్మిక ఉత్సవాలలో యజ్ఞాలలో రాజ్యాభిషేకాలకు, శుభ సందర్భాలలోనూ, పితృదేవతలకు తర్పణలు ఇచ్చేటప్పుడు, దీపావళి, హెూళి, మహాశివరాత్రి, విశిష్టమైన కర్మకాండలలో శంఖాన్ని స్థాపించి పూజిస్తారు.**



ఆంగ్యులేట అనేది టర్బినెల్లా ఇతర ప్రజాతులకు చెందినది. భారతీయ పశ్చిమతీరంలో లభిస్తుంది.

**భారతదేశంలో శంఖం...**

భారతదేశంలోని ప్రతిగుడిలో శంఖంది ప్రత్యేక పవిత్రస్థానం. బాలసంతునుంచి బాబాలదాక, శైవ, వైష్ణవ, జైన మతాల వారు ధార్మికకార్యాల్లో వాడేది శంఖం. ఇతిహాసాలలో శంఖం యుద్ధప్రకటనలకు వాడబడేది. ఇతిహాస పాత్రధారులకు వేర్వేరు శంఖాలు, వాటికి పేర్లు వాటి ప్రత్యేకతలు ప్రత్యేకంగా పేర్కొన బడ్డాయి.

శంఖాన్ని రుద్రపూజకు, గణేశపూజకు, దేవిపూజకు, విష్ణుపూజకు ఉపయోగిస్తారు. పూజనందు ఆరతి ఇచ్చేటప్పుడు ధార్మిక ఉత్సవాలలో యజ్ఞాలలో రాజ్యాభిషే కాలకు, శుభ సందర్భాలలోనూ, పితృదేవ తలకు తర్పణలు ఇచ్చేటప్పుడు మరియు దీపావళి, హెూళి, మహాశివరాత్రి, విశిష్టమైన కర్మకాండలలో శంఖాన్ని స్థాపించి పూజిస్తారు. దీనిని గంగాజలం, పాలు, తేనె, నేయితోను, బెల్లంతోను, అభిషేకిస్తూ వుంటారు. దీనిని ధూపదీప నైవేద్యాలతో పూజిస్తారు. దీనిని పూజించటం వల్ల వాస్తుదోషాలుపోతాయి. వాస్తుదోషం పోవడానికి ఎర్ర ఆవుపాలతో దానిని నింపి ఇల్లు అంతా చల్లుతారు. ఇంటి సభ్యులు అంతా సేవిస్తారు. ఇలా చేయడం వల్ల అసాధ్య రోగాలు, దు:ఖాలు దౌర్భాగ్యం దూరమవుతాయి.

శంఖ ధ్వని విజయానికి, సమృద్ధికి, సుఖానికి, కీర్తి ప్రతిష్ఠలకు, లక్ష్మి ఆగమనానికి ప్రతీక, విష్ణు శంఖాన్ని దుకాణాలలోను ఆఫీసుల్లోను ఫ్యాక్టరీల లోను స్థాపిస్తున్నారు. లక్ష్మి స్వయంగా శంఖం నా సహెూదరి అని చెప్పిన సందర్భాలు ఉన్నాయి. దేవి యొక్క పాదాల వద్ద శంఖాన్ని వుంచుతారు. శంఖాలు వున్న చోట నుండి లక్ష్మి తరలిపోదు. ఆడ మగ శంఖాలని రెండు కలిపి స్థాపించాలి. గణేశ శంఖాలలో నీరు నింపి, గర్భవతులకు త్రాగించినట్లయితే అంగవైకల్యంతో కూడిన సంతానం కలగదని కొందరు నమ్ముతారు. అన్నపూర్ణ శంఖాన్ని ఆహారపదార్థాలలో స్థాపించి పూజిస్తారు. మణిపుష్పక్, పాంచ జన్యాలను కూడా అక్కడ స్థాపించి పూజిస్తారు. చిన్న శంఖాల మాలలను ధరిస్తారు కూడా. శాస్త్రవేత్తల అభిప్రాయా నుసారం శంఖ ధ్వని వల్ల వాతావరణ లోపాలు, కీటకముల నాశనం జరుగు తుందని అనేక ప్రయోగాలు చేసి నిరూపించారు.

శంఖ భస్మము వల్ల అనేక రోగాలు నయమౌతున్నాయి. ఋష్యశృంగుడు చెప్పిన విధానం ప్రకారం చంటి పిల్లలకు



శంఖమాలలు ధరింపచేసి వాటితో నింపిన నీరును త్రాగించినట్లయితే పిల్లలు ఆరోగ్యవంతులు అవుతారు. శంఖాన్ని పూరించుట వల్ల శ్వాసకోశ రోగాలు నశిస్తాయి. కొన్ని శంఖాలు చెవి దగ్గర పెట్టుకుంటే ఓంకార నాదం వినిపిస్తుంది. ఈ శంఖాల వల్ల ఆయువృద్ధి, లక్ష్మీ ప్రాప్తి, పుత్రప్రాప్తి, శాంతి, వివాహ ప్రాప్తి కలుగుతాయని, శంఖము పాపనాశని అని కొందరి విశ్వాసం.

మార్కెట్లో ఇపుడు లభించే ఏదైనా శంఖం గురించి భారతీయ శంఖం అనేది సామాన్యపదమైపోయింది. అనేకరకాల కర్పరాలన్నింటిని కలిపి శంఖం అనే పేరు కిందనే పిలుస్తుంటాం. వీటిలో కొన్ని రాణి శంఖం, గుర్రం శంఖం వగైరా ఉన్నాయి. అట్లాంటిక్ సముద్ర తీరంలో లభించే శంఖాలు వేరు. పసిఫిక్ సముద్రతీరంలో లభించే 'ట్యుబినెల్లా పైరం' వేరు. దక్షిణావర్త కర్పరాలను 'బైస్సికాన్' అంటారు. వీటినే దక్షిణావర్త శంఖాలంటారు. వీటికెంతో విలువ.

వీటిని మిగతా శంఖాలతో వేరు చేసి గుర్తించడం ప్రయత్నం మీద సాధ్యమౌతుంది. శంఖం లోపలి పొరలు తిరిగిన చుట్లు, బయట తెరుచుకున్న చోట్ల ఉండే మెట్లవంటి తంతులుంటాయి. నిజమైన



> **మార్కెట్లో ఇపుడు లభించే ఏదైనా శంఖం గురించి భారతీయ శంఖం అనేది సామాన్య పదమైపోయింది. అనేకరకాల కర్పరాలన్నింటిని కలిపి శంఖం అనే పేరు కిందనే పిలుస్తుంటాం. వీటిలో కొన్ని రాణి శంఖం, గుర్రం శంఖం వగైరా ఉన్నాయి. అట్లాంటిక్ సముద్ర తీరంలో లభించే శంఖాలు వేరు. పసిఫిక్ సముద్రతీరంలో లభించే 'ట్యుబినెల్లా పైరం' వేరు. దక్షిణావర్త కర్పరాలను 'బైస్సికాన్' అంటారు. వీటినే దక్షిణావర్త శంఖాలంటారు.**

ట్యుబినెల్లా పైరం కర్పరం లేదా శంఖం సౌష్టవం తీర్చిదిద్దినట్లుగా ఉంటుంది. రంగు, రూపును బట్టి మార్కెట్లో వీటి విలువ, ధరలు మారుతుంటాయి.

ఈ శంఖం గోధుమవర్ణంలో నల్లటి మచ్చలతో కనిపిస్తే గౌరీ శంఖం అని పిలుస్తారు. ఎక్కువ విలువ.

శంఖాలు మెడలో వేసుకునే లాకెట్ల సైజు నుంచి రెండు చేతుల పట్టుకునేంత పెద్ద సైజుల్లో కూడా లభిస్తుంటాయి. విష్ణు, లక్ష్మీ, గౌరీ, గరుడ, గద, గణేశ్ శంఖాలనేవి ప్రత్యేకమైనవి. దైవకార్యాల్లో వీటిని ప్రత్యేకంగా వాడుతుంటారు.

శంఖే చంద్ర మావాహయామి
కుక్షే వరుణ మావాహయామి
మూలే పృథ్వీ మావాహయామి
ధారాయాం సర్వతీర్థ మావాహయామి

అందుకే శంఖంలో పోస్తేనే తీర్థం అనే నానుడి వచ్చింది.

శంఖాన్ని పూజించడానికి మంత్రం కూడా ఉంది.

'సముద్ర తనయాయ విద్మహే
శంఖరాజాయ ధీమహీ
తన్నో శంఖ ప్రచోదయాత్'

శంఖం యొక్క ఆకారాన్ని బట్టి వాటిని 3 రకాలుగా విభజిస్తారు.

1. దక్షిణావృత శంఖం - ఎడమచేతితో



పట్టుకునే శంఖము (పూజకు మాత్రమే ఉపయోగిస్తారు)

2. వామావృత/ఉత్తరావృత శంఖం - మధ్యలో నోరులా ఉన్న శంఖము (ఊదుటకు మాత్రమే ఉపయోగిస్తారు)

3. మధ్యావృత శంఖం - కుడిచేతితో పట్టుకునే శంఖము

**కొన్ని ముఖ్య శంఖాల పేర్లు...**

1.లక్ష్మీ శంఖం, 2. గోముఖ శంఖం, 3. కామధేను శంఖం, 4. దేవ శంఖం, 5. సుఘోష శంఖం, 6. గరుడ శంఖం, 7. మణిపుష్పక శంఖం, 8. రాక్షస శంఖం, 9. శని శంఖం, 10. రాహు శంఖం, 11. కేతు శంఖం, 12. కూర్మ శంఖం

**మహాభారతంలోని వివిధ యోధుల శంఖాల పేర్లు ఇలా ఉన్నాయి....**

శ్రీకృష్ణుడు - పాంచజన్యం, అర్జునుడు - దేవదత్తం, భీముడు -పౌండ్రకం, యుధిష్ఠిరుడు - అనంత విజయ, నకులుడు - సుఘోష, సహదేవుడు - మణిపుష్పక, కాశీరాజు - శిఖండి, దృష్టద్యుమ్నుడు, విరాటుడు - స్వాతిక

భారతీయ పవిత్ర శంఖం టర్బినెల్లా పైరం మాత్రమే. ఇతర భారతీయ శంఖాలనేకం వుంటాయి. టర్బినెల్లా పైరమ్ ప్రజాతి శంఖాలలో లక్షల్లో ఒకటి దక్షిణావర్త శంఖంగా దొరుకుతుంది. దీని ధర గ్రా.లలో కేరట్లలో ఉంటుంది. ఈ శంఖాల్ని ఉంగరాలలో పెట్టుకుంటారు. లాకెట్లలో పెట్టుకునే సైజులో దొరికేవి తక్కువ. ఎంత చిన్నవైతే అంత రేటెక్కువ. ప్రతి గ్రాముకు 35 వేల రూపాయలదాకా ధర. 3 అడుగుల పొడవు, 5 కిలోల బరువుండేవి కూడా దొరికాయి.

## జ్ఞానపీఠ్ అవార్డు 1986



### ఉద్యమ కవి సచ్చిదానంద రౌత్రాయ్

సచ్చిదానంద రౌత్రాయ్ 1916, మే 13న జన్మించారు. ఈయన ఒడియా కవి, నవలా రచయిత మరియు కథా రచయిత. ఈయన సాచి రౌత్రాయ్ గా ప్రసిద్ధి చెందాడు. ఈయన 1986లో భారతదేశ అత్యున్నత సాహిత్య పురస్కారమైన జ్ఞానపీఠ్ అవార్డును అందుకున్నాడు. ఈయన విద్యాభ్యాసం బెంగాల్‌లో జరిగింది. ఈయన తెలుగువారైన గొల్లపల్లి రాజకుటుంబానికి చెందిన రాకుమారిని వివాహమాడారు. రౌత్రాయ్ తన 11 యేండ్ల వయసు నుంచే రచనా ప్రస్థానాన్ని ప్రారంభించారు. పాఠశాల స్థాయిలో ఉన్నప్పుడే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. ఉద్యమ భావాలు ఉన్నాయన్న కారణంగా ఆయన రచనలలో కొన్నింటిని బ్రిటిష్ వారు నిషేధించారు. రౌత్రాయ్ తన రచనా వ్యాసంగాన్ని 1932లో "పథేయ" (తొలి కవిత)తో ప్రారంభించాడు. 1943లో బాజీ రౌత్ అనే కవిత ప్రచురణతో రౌత్రాయ్ ఒరియా పాఠకులలో చాలా ప్రాచుర్యం పొందాడు. ఈ దీర్ఘ కవిత, బ్రిటీషు పోలీసులను తన్న పడవలో "బ్రాహ్మణి" నది ఆవలి ఒడ్డుకు చేర్చటానికి నిరాకరించినందుకు, వారి బుల్లెట్లకు బలైన పడవనడిపే అబ్బాయి యొక్క వీరమరణాన్ని కీర్తిస్తుంది. రౌత్రాయ్ కవితా ఝరి అనర్గళంగా సాగింది. ఈయన దాదాపు ఇరవై దాకా కవితా సంపుటాలను ప్రచురించాడు. ప్రజా కవిగా ప్రసిద్ధి చెందాడు. ఈయన 1962 లో పద్మశ్రీ, 1963లో సాహిత్య అకాడమీ అవార్డు మరయు 1986 లో జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్నాడు. 2004, ఆగస్టు 21న కీర్తిశేషులయ్యారు.

## నోబెల్ బహుమతి 1987



### రష్యన్ అమెరికన్ కవి జోసెఫ్ బ్రోడ్స్కీ

జోసెఫ్ బ్రోడ్స్కీ 1940 మే 24వ తేదీన జన్మించిన రష్యన్ మరియు అమెరికన్ కవి, వ్యాసకర్త . 1940లో రష్యాలోని లెనిన్‌గ్రాడ్ (ఇప్పుడు సెయింట్ పీటర్స్‌బర్గ్)లో జన్మించిన బ్రాడ్స్కీ, 1972లో సోవియట్ యూనియన్ నుండి బహిష్కరించబడ్డాడు. డబ్ల్యు.హెచ్. ఆడెన్ మరియు ఇతర మద్దతుదారుల సహాయంతో యునైటెడ్ స్టేట్స్‌లో స్థిరపడ్డాడు. ఈయన మౌంట్ హెూలియోక్ కళాశాలలో మరియు యేల్, కొలంబియా, కేంబ్రిడ్జ్ మరియు మిచిగాన్ విశ్వవిద్యాలయాలలో బోధించాడు. బ్రాడ్స్కీ 1987లో సాహిత్యంలో నోబెల్ బహుమతిని పొందారు మరియు 1991లో యునైటెడ్ స్టేట్స్ "పొయెట్ లారేట్"గా నియమితుడయ్యాడు. బ్రాడ్స్కీ ముఖ్యమైన రచనలలో, కవితా సంకలనాలు, ఎ పార్ట్ ఆఫ్ స్పీచ్ (1977), టు యురేనియా (1988), వ్యాసాలలో, నేషనల్ బుక్ క్రిటిక్స్ సర్కిల్ అవార్డును గెలుచుకున్న లెస్ దేన్ వన్ (1986), నాటకాలలో, మార్బుల్స్ (1989), మరియు వాటర్‌మార్క్ (1992) ఉన్నాయి. తన సాహిత్య ప్రస్థానంలో బ్రాడ్స్కీ రష్యన్ మరియు ఆంగ్లంలో రచించాడు మరియు ప్రముఖ కవి-అనువాదకులతో కలిసి పనిచేశాడు. బ్రాడ్స్కీ ఆంగ్ల మెటాఫిజికల్ కవులైన జాన్ డోన్, ఆడెన్ తదితరులచే తీవ్రంగా ప్రభావితమయ్యాడు. బ్రాడ్స్కీ కవిత్వాన్ని భాష యొక్క అత్యున్నత స్థాయి పరిపక్వత ఉన్న రూపంగా పరిగణించాడు. ఈయన 1996 జనవరి 28న పరమపదించారు.

# చదువు... ఆనందించు... అభివృద్ధి చెందు....

తెలంగాణలోని ప్రతి పాఠశాల పుస్తక పఠనం తో మారుమ్రోగిపోతున్నది. 100 రోజుల రీడ్ కార్యక్రమం సాహిత్యా గంధాలను వెదజల్లుతున్నది. ఫిబ్రవరి 5 వసంత పంచమి పర్వదినాన" చదువు, ఆనందించు, అభివృద్ధి చెందు" అనే లక్ష్యంతో రీడ్ అనే కార్యక్రమం అమలవుతున్నది. భాషా పరిరక్షణకు ఇంతకుమించిన కార్యక్రమం మరేదీ లేదంటే అతిశయోక్తి లేదు. తెలంగాణ వ్యాప్తంగా చిత్తశుద్ధితో అన్ని పాఠశాలలో రీడ్ అనే కార్యక్రమం అమలవుతూ మంచి ఫలితాలను సాధిస్తోంది. ప్రతి పాఠశాల లోని లైబ్రరీ పుస్తకాలు ఇప్పుడు పిల్లల చేతుల్లో కళకళలాడుతున్నాయి. అందులోని అక్షరాలు పిల్లల మస్తిష్కలను జ్ఞానంతో నింపుతున్నాయి. కథలు,, కవితలు, వ్యాసాలు, సంభాషణలు ఇలా అనేక రకాల ప్రక్రియలతో పాటు విజ్ఞానశాస్త్రాలు సంబంధమైన విషయాలను పిల్లలు విరివిగా చదువుతున్నారు. పాఠశాలలో నిర్వహించే ఎనిమిది పీరియడ్లలో ప్రతిరోజు మొదటి 15 నిమిషాలు ఈ పట్టణం కార్యక్రమానికి కేటాయించడం గమనార్హం. అంతేకాక ప్రతి రోజు ఒక ప్రత్యేక గ్రంథాలయం పీరియడ్‌ను అమలు చేస్తున్నారు. దీంతో కరోనా కాలంలో చదువుకు దూరమైన పిల్లలు ఈ పఠనం కార్యక్రమంతో తిరిగి తమ చదువును గాడిలో పెడుతున్నారు.






ఇంతకుముందు పఠనం అంశమై భాష ఉపాధ్యాయులే శ్రద్ధ వహించేవారు. ఇప్పుడు ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల సారథ్యంలో పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులంతా ఈ రీడ్ కార్యక్రమంలో భాగస్వాములు అవుతుండటంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నడుస్తోంది. రాష్ట్రంలోని ప్రైమరీ పాఠశాలల్లోనూ, ప్రాథమికోన్నత పాఠశాలల్లోను, ఉన్నత పాఠశాలల్లోనూ కార్యక్రమం అమలవుతోంది. ఫిబ్రవరి 14 నుంచి ఫిబ్రవరి 21 వరకు విజయ వంతంగా పఠన వారోత్సవాలను నిర్వహించారు. పాఠశాల పరిధిలోని దాతలను ఆహ్వానించి పుస్తకాలు కొనిపించి గ్రంథాలయాలను పరిపుష్టం చేస్తున్నారు. గ్రామ పెద్దలను, నాయకులను, పిల్లల తల్లిదండ్రులను పాఠశాలకు ఆహ్వానించి పిల్లల సామర్థ్యాలను వారి ముందు ప్రదర్శింప చేసి పాఠశాలలపై నమ్మకం పెంచుతున్నారు. పిల్లలు సైతం వివిధ పత్రికలలో వచ్చిన కథలు సేకరించి స్టోరీ కార్డులను స్వయంగా తయారు చేసి ఉండటం విశేషం. రీడ్ కార్యక్రమం మూలంగా పిల్లలు పఠనం వల్ల పాఠశాలకు రావాలన్న ఆసక్తిని పెంచుకున్నారు. ఇది మొత్తం వంద రోజుల కార్యక్రమం. ఈ కార్యక్రమం అనంతరం విద్యార్థుల తరగతి వారి సామర్థ్యాలను చేరుకుంటారనే లక్ష్యం నెరవేరుతుందని జిల్లా అధికారులు ఉపాధ్యాయులు ఆశావహ దృక్పథంతో ఉన్నారు. కరోనావల్ల పాఠశాలకు దూరమైన పిల్లలు సహజంగానే చదవడంలో వెనుకబడి పోయారు. ఈ రీడ్ కార్యక్రమం వారిని మళ్లీ చదువు వైపు ఆకర్షించడంలో దోహదపడుతున్నది. ఈ కార్యక్రమం ఎస్ సి యి ఆర్ టి , సమగ్ర శిక్ష , ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి కార్యక్రమం నిర్వహిస్తున్నది. పఠనాభిలాషకు ప్రేరణనిచ్చి,

పఠనాభివృద్ధికి దోహదం చేసే ఈ ప్రభుత్వ ప్రత్యేకకార్యక్రమం సత్ఫలితాల నిస్తున్నది. కరోన కారణంగా ఏర్పడిన విద్యాసంక్షోభాన్ని , చదువుల అగాథాన్ని ఇది కొంత తీరుస్తున్నది. చదవడమంటే పాఠ్యపుస్తకాలలోని విషయాలను బట్టీపెట్టడము కాదు, పాఠ్యేతరపుస్తకాలూ ఉంటాయి.. అవి చదువుపట్ల మమకారాన్ని పెంచుతాయని విద్యార్థులకు ఇపుడిపుడే అర్థమవుతున్నది. గ్రంథాలయ వినియోగం చదువులో భాగం కావడం వలన పిల్లలు సంబురంగా చదువుకుంటున్నారు. సెలుఫోను మాయాజాలం నుండి ఈనాటి బడిపిల్లల తరం బయటపడాలంటే పఠనం ఒక మంచి మార్గంగా కనిపిస్తున్నది. కార్యక్రమానికి నోడల్ అధికారిగా సువర్ణ వినాయక్, సమగ్ర శిక్ష అధికారులు తాజ్ బాబు, పి.శ్రీనాథ్, స్టేట్ కోర్ టీం రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం విజయవంతం చేసేందుకు కృషి జరుగుతున్నది.

## బీసి అస్థిత్వవాదం జాతీయ సదస్సు....

మార్చి 11, 2022న కాకతీయ యూనివర్సిటీలో బీసి అస్థిత్వవాదంపై నిర్వహించిన సాహిత్య సదస్సులో వక్తలు సాహిత్యంలో బీసి అస్థిత్వ వాదం గురించి రానున్న కాలంలో బీసీలు ఎదగడానికి సాహిత్యం చేసే దోహదాన్ని గురించి సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో పుప్పాల కృష్ణమూర్తి, డా॥ పంతంగి వెంకటేశ్వర్లు, డా॥ కృష్ణ కౌండిన్య, జూలరు గౌరి శంకర్, డా॥ ననుమాస స్వామి, డా॥ ఎస్ రఘు మరియు వెల్దండి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.






## నా ఏకాంత బృందావనం ఆవిష్కరణ

ఫిబ్రవరి 27న హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో ప్రసిద్ధ కవయిత్రి డాక్టర్ అమృతలత రచించిన "నా ఏకాంత బృందావనం" ఆత్మకథా గ్రంథాన్ని ప్రముఖ శాస్త్రవేత్త రచయిత పద్మభూషణ్ గ్రహీత డాక్టర్ కే.ఐ. వర ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య ఎన్.గోపి అధ్యక్షత వహించగా డాక్టర్ నెల్లుట్ల రమాదేవి సమీక్షకురాలిగా వ్యవహరించారు. ఓల్గా, కిషన్ రెడ్డి, ఘనపురం దేవేందర్, డాక్టర్ జె. చెన్నయ్య, ఎనిశెట్టి శంకర్, దేవకీదేవి తదితరులు పాల్గొన్నారు.



## రెండు పుస్తకాల ఆవిష్కరణ

మార్చి 7న నిజామాబాద్ కొత్త అంబేద్కర్ భవన్లో ఇందూరు యువత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొగర్ల సురేశ్ రచించిన "విషయ' దీర్ఘకవిత, దారం గంగాధర్ రచించిన "త్యాగమయి" కథల సంపుటిని నగర మేయర్ నీతూ కిరణ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మద్దుకూరి సాయిబాబు, డాక్టర్ కాసర్ల నరేష్ రావు, డాక్టర్ వి త్రివేణి, డాక్టర్ ఇందిరా, చిట్టిమిల్ల హరిప్రసాద్, ఘనపురం దేవేందర్, కందకుర్తి యాదవ్ రావు, ఆనందరావు, బి కళ్యాణి, వరలక్ష్మి, సుభాష్ పద్మ, చెన్న శంకర్ తదితరులు పాల్గొన్నారు



## సినీ గీత కవి కందికొండ అస్తమయం

మార్చి, 12 శనివారం ప్రసిద్ధ సినీ గీత కవి కందికొండ ఈ లోకాన్ని విడిచిపెట్టారు. కందికొండ చిరకాలం నుండి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన జానపద బాణీలలో రాసిన గీతాలు తెలంగాణ ప్రేక్షకులను అలరించాయి. తెలుగు సాహిత్యంలో డాక్టరేట్ చేసిన కందికొండ మరణం తెలుగు సాహితీ ప్రపంచానికి తీరని లోటు. శ్రావణి సుబ్రమణ్యం సినిమాలో ఆయన రాసిన "మళ్ళీ కూయవే గువ్వా" అనే పాట ఆయనను సినీ రంగ ప్రవేశం చేయించింది. "నిన్నే.. నిన్నే..., ఒరి దేవుడో లోకం మారేరా..., చూపులతో గుచ్చి గుచ్చి చంపకే" మొదలైన అనేక పాటలు కందికొండ కలం నుంచి జాలువారినవే. కంది కొండకు తంగేడు అశ్రునివాళి.

స్వీ
కా
రం




## నాది దు:ఖం వీడని దేశం

హనీఫ్
సెల్ : 9247580946

నవోదయ బుక్ హౌస్
హైదరాబాద్
వెల : రూ.120/-




## తురాయి పూలు

వాసరచెట్ల జయంతి

చందన పబ్లికేషన్స్
హైదరాబాద్
వెల : రూ.150/-




## ఓరుగల్లు చేవ్రాలు

వి.ఆర్. విద్యార్థి
సెల్ : 9989139498

శ్రీమతి వేలూరి రత్నమాల
వరంగల్
వెల : రూ. 100/-




## పరావలయం

ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్
సెల్ : 9849082693

పాలపిట్ట బుక్స్
హైదరాబాద్
వెల : రూ.100/-




## మౌనమూర్తి

లేదాళ్ళ జయ రాజేశ్వరరావు

పాలపిట్ట బుక్స్
హైదరాబాద్
వెల : రూ120/-




## వచన కవిత ఆలంకారికత

పెన్నా శివరామకృష్ణ
సెల్ : 9440437200

విశాలాంధ్ర బుక్ హౌస్, నవ చేతన బుక్ హౌస్, నవోదయ బుక్ హౌస్
హైదరాబాద్
వెల : రూ.100/-




## గోరటి వెంకన్న కవితా పరామర్శ

పెన్నా శివరామకృష్ణ
సెల్ : 9440437200

నవ చైతన బుక్ హౌస్
హైదరాబాద్
వెల : రూ.80/-




## రామాయణ పరివారము

బుర్రా వెంకటేశం

విశ్వ సాహితీ ట్రస్ట్
హైదరాబాద్
సెల్ : 9963 539 139
వెల : రూ. 250/-




## మానేరు ముచ్చట్లు

తమ్మూరి రాంమోహన్ రావు
సెల్ : 970 152 2234

పద్మసూర్య ప్రచురణలు
హైదరాబాద్
వెల : రూ. 300/-


తెలంగాణ ఆధ్యాత్మిక వనం..
బుద్ధవనం...